Navayuga Telugu

Gandhi Vijayam 2794

Vijayam

24.2.

53

46

2794

51

NATIONAL ARCHIVES OF INDIA

స్వరాజ్యసోపానపంక్తి ౨.

"నవయుగము"

# గాంధి విజయము

అను 5 అం[illegible]

(కలకత్తా [illegible]



గ్రంథకర్త.

దామరాజు పుండరీకాక్షుడు

గుంటూరు.

R No. 170

NATIONAL ARCHIVES OF INDIA

"నవయుగము"

# గాంధి విజయము

అను 5 అంకములు నాటకము

(కలకత్తా నాగపుర మహాసభలు.)


గ్రంథకర్త.

## దామరాజు పుండరీకాక్షుడు

గుంటూరు.



రెండవ కూర్పు

చంద్రికా ముద్రాక్షరశాల, గుంటూరు.


కాపీరైటు వెల రు. ౦—౧౨—౦

NATIONAL ARCHIVES OF INDIA

NATIONAL ARCHIVES LIBRARY
NO 2794
3·3·72
GOVT. OF INDIA

# తొలిపలుకు.

ప్రథమ ముద్రణము.

ఏప్రియల్ 1921.

---

పాఠకమహాశయులారా!

ఈ నాటకమునందు కల్పితములుగాక నిజవిషయములు వర్ణింపబడినవి, గాంధిగారియుగ మారంభమైనప్పటి నుండియు నాగపురమహాసభానంతరమువరకు నున్నవియున్నట్లు దేశీయపరిస్థితులు వరుసగా వర్ణింపబడినవి. ఇందువచ్చు పాత్రలు మన సమకాలికులు. కావున నాటకమునందలి వారి యభిప్రాయములు వారి అసలు అభిప్రాయములకు చాలవర కనుగుణ్యముగ నుండును. స్వల్పమార్పు లుద్యమప్రబోధమున కవుసరములు, కలకత్తా నాగపురదేశీయ మహాసభలు విపులముగా వర్ణింపబడినవి. రాజకీయ చరిత్రనెప్పటి కప్పుడు వర్ణించుటయేముఖ్యోద్దేశము.

భాషావిషయిక, లక్షణ సంబంధాది లోపములకు పండితులు కవులు, విమర్శకులు క్షమింప ప్రార్థితులు. రాజకీయవిషయములు బాగుగా నెరుగనివారికిగూడ, ప్రస్తుత రాజకీయచరిత్ర రుచికరముగా నుండి సులభముగా బోధపడునని గట్టిగా చెప్పగలను.

---

ద్వితీయ ముద్రణము.

అక్టోబరు 1921.

---

ప్రథమ ముద్రణమైపోయి చాలదినములైనను, ఇతరపాత్రములనచ్చువేయించుచు నీగ్రంథమును మరలవేయించుట ఆలస్యమైనది. ఈసారి బీదసాదలకుగూడ సులభసాధ్యముగు నట్లు 0-4-0 వెల తగ్గించినాను.

ఇట్లు విన్నవించు,

గ్రంథకర్త.

---

# విషయసూచిక.


| | | పేజీలు. |
|---|---|---|
| నాంది | ప్రథమాంకము. | 1 |
| | ప్రస్తావన. | 2-6 |
| 1 రంగము. | అరవింద ఘోష్ ధ్యానము. | 7-12 |
| 2 ... | రామయ్య, బాపిరెడ్డి, గోపిశెట్టి | 12-15 |
| 3 ... | విద్యార్థులు. | 15-17 |
| | ద్వితీయాంకము. | |
| 1 రంగము. | షౌకతాలీ ఆగ్రహము, గాంధి శాంతోపదేశము. | 18-24 |
| 2 ... | భాలభటులు, కలకత్తా కాంగ్రెసు ప్రయత్నములు. | 24-26 |
| 3 ... | (లజపతిరాయ్) అధ్యక్షోపన్యాసము. | 26-29 |
| 4 ... | కాంగ్రెసులో ఒక తెగవాడు. | 29-32 |
| | తృతీయాంకము. | |
| | కలకత్తాకాంగ్రెస్ మహాసభ. | 33-54 |
| | చతుర్థాంకము. | |
| 1 రంగము. | మాలవ్యా, క. రంగయ్యంగార్లు. | 54-56 |
| 2 ... | మహమ్మదాలీ శాక. | 56-58 |
| 3 ... | నాయకుల సమావేశము. | 58-64 |
| 4 ... | ఓట్లహాస్యము. | 64-67 |
| | పంచమాంకము. | |
| 1 రంగము. | వెడ్జివుడ్ బెన్ స్పూర్లు. | 68-87 |
| 2 ... | నాగపురసభకుపూర్వమునాయకులసమావేశము | 68-71 |
| 3 ... | దేశభక్తుడు, దేశసేవకుడు. | 76-78 |
| 4 ... | నాగపుర మహాసభ. | 78-96 |
| | శ్రీమతి సరళాదేవి ప్రబోధము. | 96-97 |
| | మంగళము. | |


సమాప్తము.

## నాటకమునందలి పాత్రలు.

**పురుషులు**

1 దేశభక్తుడు.
2 దేశసేవకుడు.
3 అరవిందఘోష్.
4 గాంధి.
5 షౌకతాలీ.
6 లజపతిరాయ్.
7 బిపినచంద్రపాల్.
8 చిత్తరంజనదాస్.
9 మహమ్మదాలీ.
10 నెహ్రూ.
11 మదనమోహన మాలవ్యా.
12 సేలం విజయరాఘవాచారి.
13 కస్తూరి రంగయ్యగారు.
14 కొండ వెంకటప్పయ్య పంతులు.
15 బాపిరెడ్డి, గోపిశెట్టి, రామయ్యా.
16 స్వాభిలాషి, సగర్వి, అధికారాభిలాషి.
17 న్యాయవాది, రైతు, కూ.
18 విద్యార్థులు.
19 వెడ్జివుడ్.
20 బెర్కస్హూర్.
21 జిన్నా.
22 బాలభటులు, వగయిరా.

**స్త్రీలు**

శ్రీమతి సరళాదేవి.
ఆనీబిసెంటమ్మ.

"నవయుగము"

# గాంధివిజయము.

---

నాంది.

ఉ॥ ఎవ్వని శాంతమూర్తియని యెల్లరనారతమున్ భజింతురో
యెవ్వడధర్మమార్గమున నించుకయేనియు కాలుబెట్టడో
యెవ్వడు లోకమంతట నహింసయె యుత్తమమంచు జాటెనో
అవ్వరమూర్తి గాంధిఋషి కంజలిమోడ్చినమస్కరించెదన్॥

ఉ॥ కత్తులులేవు, శూలమును గాండివమున్ మొదలే హుళక్కి నో
రెత్తి ప్రచండవాక్పటిమ నేనియు జాటఁడు, వైరిమీద దం
డెత్తగ సేనలేదు, బలహీనము కాయము, కోపతాపముల్
బొత్తుగ సున్న, అట్టిఘనమూర్తి మనోబలశాలి గాంధిఁ జే
మొత్తినమస్కరించి స్మరియించెద నెప్డు స్వరాజ్యసిద్ధికిన్

(నాంద్యంతమున నాటకప్రారంభము.)

# ప్రస్తావన

(ప్రవేశము దేశభక్తుడు-దేశసేవకుడు.)

దే॥ భ—ఓహో! మిత్రమా! యెన్ని దినములైనది మనమిరువురము ను కలసి; నవయుగారంభమైన తరువాత ఇదే మొదటి కలియుటం.

దే॥ సే—అవును. గాంధిమహోదయానంతరం మనమెప్పుడునుగలసి మాట్లాడియుండలేదు. ఏమి విశేషములు?

దే॥ భ—ఏమున్నవి. కాలమునానాటికి సందిగ్ధస్థితికి వచ్చుచున్నది. మనస్సు కుదుటపడియుండుటలేదు. రాత్రింబవళ్లుమనస్సు తలక్రిందగుచున్నది.

దే॥ సే—మిత్రమా! నీవట్లు విచారించుట కింకనుఅవకాశమేమున్నది

ఉ॥ రండు స్వరాజ్యపుం రథము లాగనవశ్యము రండటంచు, ను
ద్దండ మనోబలంబు ప్రదితంబుగ శాంతముబూని దైవ పు
త్రుండనివార్య బుద్ధిబల ధుర్యుడు గాంధిమహాత్ము డిద్ధరా
మండలమెల్ల మ్రోగ వరమంత్రము నూత్నమతంబు జెప్పెదుం

అట్టితరి యుడుతభక్తి యన్నట్లు మన చేతనైనంతమట్టుకు మనము గూడ నామహాత్మునికి తోడ్పడుటయే మన కర్తవ్యము. తదితరములయిన ఆలోచనలు, శంకలు, అన్నిటిని కట్టిపెట్టవలసినదే.

దే॥ భ—మిత్రమా! నామనమున వేధించుచున్న విషయముగూడనదియే. ఒకప్పుడు ఈ నూతనోద్యమము నెగ్గునాయని భీతియు, మరొకప్పుడు ఇంతకన్న వేరొకమార్గము లేదనియు తోచుచుండును. కాని, గాంధిమహాత్ముడిన్ని దినములనుండియు నూరకుండి, తత్కాలున ఈక్రొత్తసిద్ధాంతమును దేశములో ప్రవేశపెట్టెను. అట్టితరి

NATIONAL ARCHIVES OF INDIA

దేశపరిస్థితులకు ఆయనమార్గము సరియైనదగునా కాదా యను శంక పెక్కుమందిని వేధించుచున్నది.

దే॥ సే॥ మిత్రమా! ఏమి నీపిచ్చి! గాంధిమహాత్ముడకస్మాత్తుగా ఇవ్వాళనే ప్రారంభించెనని తలచుచుంటివా!

సీ॥ దక్షిణాఫ్రికయందు ధ్వజమెత్తి శంఖుపూ
రించిధంకాను మ్రోగించినాడు
మ్రోగించి, చాంపరాన్ * భూమి జయధ్వనుల్
జెలరేగ శిబిరంబు నిలిపినాడు
నిలిపి, సత్యాగ్రహానీతి భారతభూమి
నెల్లదిక్కుల వెదజల్లినాడు
జల్లి, వెంటనె స్వరాజ్యరథంబుపైనెక్కి
శాంతి చక్రము బూని సాగినాడు
తే॥ గీ॥ సాగి, హైందవ పుత్రుల వేగిరముగ
రమ్మనుచు బిల్చుచున్నాడు, రమ్ము (రండు) వేగ
చంద్రునకు నూలుపోగన్న చందమునను
మన యథాశక్తి దేశసేవను మెలంగ॥

* ఉత్తరహిందూస్థానముపైన నున్న ఒకజిల్లా॥

దే॥ భ—సరి నీవుచెప్పిన విషయములను బట్టిచూడగాగాంధిమహాత్ముడిదివరకే తనమార్గమున లోకమును నడిపించుటకు ప్రయత్నములు చేయుచు తగిన అవకాశమునకు వేచియున్నాడని తేలుచున్నది. అయినను మఱియొకశంక నన్ను బాధించుచున్నది. ఏదియనిన,—

ఉ॥ "భీకరబాణవర్షముల పెల్లున వైరులమ్రుంచ లేదు; మా
ర్వీకృత గర్జితంబు పృథివీవియదంతర మెల్ల మ్రోగను
గ్రాకృతి" జూపి వైరిహృదయంబుల భీతినిగొల్పడాయె, యిం
కేకరణి జయించునో! శా యెంతోబలాఢ్యుల రాజ్యవర్గముల్!

అనునీ శంక అనేకమందిని వేధించుచున్నది. నాకును తలచుకొనినపుడెల్ల మనస్సు తలక్రిందగుచుండును.

దే. సీ—మిత్రమా! నీవొక్క విషయము నెరిగింతివేని నీయనుమాన
ములన్నియు దీరును. పరమేశ్వరుడు జగచ్ఛాసన సభలో
జెప్పిన విషయమును నీకు తెలిపెదను. ఎట్లనిన,—

మ॥ వగమంత్రిం బఖిలప్రజాహితము శ్రీ ప్రిష్ఠోదమానీంద్రి ధ
ర్మరహస్యంబు జగత్ పవిత్రమగు నూత్రింబాయహింసామృతం
పురుచిం జూపగ, నాత్మనిగ్రహముల్ బోధించి, దౌర్జన్యముం
మరువం జేయగ, గాంధినై భరత భూమధ్యంబునం బుట్టెదం॥

అని పరమేశ్వరుడు చెప్పెను ఆప్రకారముగా గాంధి మూర్తి యవతరించినాడు. కావున యీనూతన శాంతిమార్గముననే ప్రపంచకమును పరమేశ్వరుడు సంస్కరింప వలెనని తలచెను. కనుక ఆయుధములు, సైన్యము వగయిరా ఆడంబరములు లేకనే గాంధిమహాత్ముడు మనకు ముక్తిసంపాదించును.

దే. భ—అట్లయిన మిత్రమా!

సీ॥ మాలవ్యలజపతి మహనీయు డరవిందులింకరంగముప్రవేశింప రేమి?
బ్రాహ్మణాబ్రాహ్మణవైరముల్ చల్లారియెల్ల రేకంబుకా రేమియింక?
అతివాదమితవాదమనుభేదములమాని యైక్యంబుగా రేమియఖిలజనులు
కులమతవైషమ్యములుపోయిసర్వసౌభ్రాత్రప్రేమంబుర్వి పార దేమి?
తే॥ గీ॥ దుష్టరాజ్యాంగ దౌర్జన్య దుండగంబు
లింకవిచ్ఛిన్నమగుట లేదేమి? హరియె
గాంధిగా పుట్టెననుట నిక్కంబెయైన
భూమియంతట జయభేరి మ్రోగ దేమి?

దే. సీ—మిత్రమా! మనకాభీతి యక్కర లేదు. ఏలననిన,—

సీ॥ మాలవ్యలజపతి మహనీయుడరవిందు లింకెందరో ప్రవేశింపగలరు
కులమతవైషమ్యములుపోయి సర్వసౌభ్రాత్రభావంబుర్విపారునింక

బ్రాహ్మణాబ్రాహ్మణ వైరముల్ నశియించి యైకమత్యము
వృద్ధియగును వేగ
అతివాదమితవాద మనుభేద మేపోయి, యేకమయ్యెదరింక నెల్లజనులు
తే॥ గీ॥ దుష్టరాజ్యాంగదౌర్జన్య దుండగముల
కంత్యకాలంబు సామీప్యమయ్యెనిపుడె
గాంధివిజయమారంభమై కలవరంబు
గలిగె సంకోచమేల నిక్కంబుజయము॥

ఇన్నియేల మహాత్ముడవతార పూర్షుడేయని మనము గట్టిగా నమ్మచో అందరిపెట్టు ఆయన ఒక్కడే చాలడా?

దే. భ—మిత్రమా! గాంధివిజయమారంభమైనదని చెప్పితివే, అది యెట్లు? యింకను జయాపజయ నిర్ధారణ ముందుగదా చేయ వలసినది.

దే. సే—మంచిప్రశ్న నడిగితివి. మహాత్ముని యుద్యమప్రభావ మారంభములోనే దెలిసినది. పూవుబుట్టుటతోడనే పరిమళించు నన్నట్లు, ఆయనసంకల్పమప్పుడే దిగ్విజయముగాంచినది ఈవిష యములో విపులముగ దెల్పుట సాధ్యముకాకపోవుటచే నాతో గూడ నీరాత్రి నాటకప్రదర్శనమునకు వచ్చితివేని సర్వమునీవే తెలిసికొనగలవు.

దే. భ—ఏమినాటకము.

దే. సే—"గాంధివిజయము" అనునాటకము.

దే. భ—ఆనాటక గ్రంథకర్తయెవరు? "గాంధిమహోదయం" వ్రాసిన మన పుండరీకాక్షుడుగారేనా?

దే. భ—అవును. "గాంధిమహోదయం" వ్రాసిన గుంటూరు వాస్తవ్యులగు దామరాజు పుండరీకాక్షుడుగారే.

దే. భ—అట్లయిన ఆనాటకమును చూచితీరవలసినదే. జాగుచేయుట కవకాశము లేదు. మనమిక శీఘ్రముగపోయి మన యితర మిత్రులనుగూడ దీసికొని సత్వరము పోవుదమురమ్ము.

("తెరలో గాంధిమహాత్మకు జేయ్"అని, ఒంకాయ గొట్టుదురు.)

దే. భ—అదిగో జేయ్‌శబ్దములు నాటకశాలనుండి మిన్ను ముట్టుచున్నవి. ఇందరు "గాంధిమహాత్మునకు జేయ్" యనుచుండగా నామహాసీయునకు జయము కలుగకుండునా! పోవుదమురమ్ము.

(నిష్క్రమింతురు.)



# గాంధివిజయము

## ప్రథమాంకము.

(ఒకటవ రంగము) —అరవిందఘోష్.

(తపస్సుపైనుండును * భవానీప్రత్యక్షము.)

శా॥ అమ్మా, యీశ్వరి లోకమాత జగదంబా పావనీ మాదు లో
కమ్ముల్ గాచి మముం భరించుజననీ పాపంబుబోగొట్టి పు
ణ్యమ్ముల్ నిల్పెదువీరమాత, దయ లేదా? దీనుడన్ నీపదా
బ్జమ్ముల్ బట్టి భజించు భక్తుడను వాత్సల్యంబునన్ బ్రోవవే.

(భవాని ప్రత్యక్షమగును).

శా॥ ఆహా! ధన్యుడనైతి, నిన్ గనగనేత్రానందమో మాతరో
జోహార్లమ్మ, భవత్ స్వరూప మహిమన్ జూపించి నన్నిట్లు త
ల్లీ, హర్షాంబుధిఁ దేలజేసితిక సంప్రీతిన్ నినున్ గొల్తు, నీ
సాహాయ్యంబొనగూర్చి మోక్షపదవిన్ సాధింపగా జేయవే॥

భవానీ, భవద్దర్శన మాత్రంబున ధన్యుడనైతిని. ఆహా! యేమి యీ స్వరూప సౌందర్య మహిమావిలాసము! ధన్యోస్మి, ధన్యోస్మి: నాజన్మ పావనంబై పది: తల్లీ, నాపై నింతటి కరుణాకటాక్షవీక్షణముల ప్రసరింప జేసినందులకు నాపూర్వపుణ్యము దక్క నే నేమిజేసితిని. అమ్మా! వరమునుకోరుమనియా సెలవిచ్చితివి. భవత్పాదారవిందసేవ దక్క వేరొకకోరిక నాకేమున్నది. అయినను మాతా నేనొక్క టడుగ నెంచితిని.

శా॥ అంబా, నైవగలేము దుస్థితికిపాలై దీనతంగుందు దే
శంబుల్ భారతభూమిజూచి, తనయుల్ స్వాతంత్ర్యమేలేక సౌ
ఖ్యంబుల్ బాసి నిరంతరవ్యధల దాస్యంబందు నల్లాడ స్వాం
తంబందెంతయు గుందు మాజనని దీనత్వంబు మాన్పంగదే॥

(పైనుండి పుష్పములు హస్తముల రాలును.)

ఆహా! ధన్యుండను. ధన్యుండను. భవదీయ ప్రసాదమునకెంత
యు కృతజ్ఞుడను. (దేవి అదృశ్యమగును.)

అరవిం—(ఆకసమువంక జూచి) దేవి తెల్పినవిధంబున గాంధి సోదరుడు
నాయభిప్రాయమెరుంగుటకై యిటకేతెంచునని దోచెడని. మదీ
యాభిప్రాయముల నీతని కుత్సాహము గలిగించెద.

(ప్రవేశము గాంధి.)

ఉ॥ కాలము మారుచున్నది చికాకుజనించెను తోచదేమి, భూ
పాలకవర్గమంతయును పాడయిపోయె, మనుష్యకోటి క
ల్లోల విపన్ముద్రములలోబడి కొట్టుకులాడుచుండె, నిం
కేలధరిత్రి జీవన మికేటికి జన్మమటంచు దోచెడిన్॥

ఈసందిగ్ధసమయమున తిలక్ మహారాజే యున్నయెడల నాకింత
భారముండదు. ప్రస్తుత మున్నవారలలో పెద్ద యనందగు
మహనీయు డరవిందఘోషు గలడు. ఆయన యభిప్రాయము
లెట్లుండునో తెలిసికొనెద. (సమీపమునకుబోయి) సోదరా!
నమస్కారము,

అర॥ మిత్రమా! నమస్కారము. (దర్భాసనముచూపి) దయచేయుము.

(గాంధి కూర్చుండును.)

గాం॥ సౌఖ్యమా?

అర॥ మిత్రా! మనకు సౌఖ్యమననేమి? అసౌఖ్యమననేమి?

తే॥ గీ॥ దేశమున పాడిపంటలు దేజరిలగ
పాపమునసించి పుణ్యంబు ప్రబలుచుండ
స్వచ్ఛమగు జీవనము జనుల్ సలుపుచుండ
నపుడె మనక్షేమమప్పుడే మనకు శాంతి॥

మిత్రమా! నీఆగమ కతంబేమి?

గాం—మీరెన్ని విషయంబు లావశ్యకమని సెలవిచ్చియుంటిరో అన్ని విషయములంగూను మన ఆర్యావర్త మతిహీనదశయందున్నది. ఇట్టితరుణంబున తిలక్‌మూర్తి యవతారమును చాలించెనని మీరెరింగియే యుందురు. ఆవిషయమట్లుండ మనుష్య ప్రపంచమునందుండియు తామరణ్యవాసమును స్వీకరించితిరి. ఇట్టిసందిగ్ధసమయమునం దేమిచేయుటకును తోచక మీయభిప్రాయ మెరుంగుటకై వచ్చితిని.

అర—మంచిది. మిత్రమా, అన్నిటిని భరించవలసిన భారము నీయందున్నది. నీమనంబెల్లయు నాకు తేటతెల్లమయ్యె నీసంకల్పము నెరవేరుటకు సర్వదా పరమేశ్వరుని ధ్యానించుచుండెదను. నా దీక్షముగియువరకును నాసంకల్పశక్తిదక్క వేరొండుసాయము చేయజాలమికి చింతిలుచున్నాను. పరమేశ్వరుడు సర్వమును నీచే నడిపింపయత్నించెను. నీసంకల్పము నెరవేరునుగాత. నీయభీష్టము సిద్ధించుత

గాం—మిత్రమా! భరతమాత తమ రాకకై యెదురు చూచుచుండును. దేశీయులెల్లరును తమపైనాశ బెట్టుకొనియుండిరి.

అర—సోదరా, సూరతుకాంగ్రెసు నాటినుండియు రాచకీయవ్యవహారములలో సంబంధము వదులుకొనియున్న నేనిప్పుడువచ్చి యేమిచేయగలను! దేశక్షేమమునకై సర్వదాపరమేశ్వరుని ధ్యానించుచుండెదను. నాదీక్షముగియువరకు నేనిచ్చటనే యుండవలయు. సర్వమును భరించుటకు నీవేయున్నావు. అది నాకెంతయు సంతోషము.

గాం—సంతసము. త్వరలో తమ కనుకూలమగు కాలముగలుగు ననియు తమదీక్షయు శీఘ్రకాలములో ముగియుననియు మేమెదురు చూచుచుందుము. నేనిక సెలవుగైకొనెద.

అర—మంచిది. నీకు జయముగలుగుగాత.

గాం—సర్వమును దైవాధీనముగదా.

(బయటికివచ్చి తనలో) నేననుకొనినదియే సవ్యమైనదారి. కర్తవ్యము రూఢియైనది. దేశమునకు నానూతన సిద్ధాంతమే ముక్తి తేగలదు. సంకల్పమున కెన్నియడ్డంకులున్నను నెరవేర్చి తీరెద. ఇదియే నామనోనిశ్చయము. (నిష్క్రమించును.)

అర—(మరలధ్యానమునుండి) ఆహా! దేశమున కెట్టిదుస్థితి వాటిల్లినది. జనులల్లకల్లోలములపాలై ఏమిచేయుటకును తోచక కొట్టుకొనుచున్నారు. (ప్రక్కకుచూచి) అరుగో ఎవరో కొందరు దేశీయులుఁగూడ నాకడకు వచ్చుచున్నారు వీరికి నేనేమి హితముచెప్పి పంపగలను!

(ప్రవేశము న్యాయవాది, రైతు, ఉద్యోగి, వ.)

అందరు— మహాత్మా! నమస్కారములు—

అర— దేశీయసోదరులారా! దయచేయుడు. దేశమున విపరీతము లేమియు లేవుగదా?

న్యాయ— మహాత్మా! ఇంక వేరువిపరీతము లేమి కావలయును. భారతదేశము నానాటికతిహీనదశకు వచ్చుచున్నది. ప్రభుత్వవిధానము క్రూరసాంప్రదాయమై నానాటికీ పెచ్చుమీరిపోవుచున్నది. ప్రాణమునకును మానమునకుగూడ భంగము వాటిల్లినది. ఈసమయమున తిలక్ మహారాజు మృతినొందెను. ఇట్టి సందిగ్ధసమయమున నేమిచేయుటకును తోచక తమ దర్శననిమిత్తమై వచ్చియుంటిమి.

అర—సోదరులారా! దేశస్థితినిజూడ నాకునుగూడ నేమియు తోచుట లేదు. అయినను నాచేతనైనంతమట్టుకు దేశసేవజేయుటకు గూడ నాకిప్పుడవకాశము లేనందుకు చింతిల్లుచున్నాను. ఇంక కొన్ని మాసములకు గాని మీసేవకై నేనుపయోగపడను. ప్రస్తుతము దేశస్థితినిగూర్చి పరమేశ్వరుని ధ్యానించుటయే నాచేతనైనపని.

రైతు—మహాప్రభో! మాగతియేమిచెప్పెదరు. మేము మలమలమాడి పోవుచున్నాము.

అర—సోదరులార, నన్నింతగా మీరడుగనక్కరలేదు. అయినను మీకొక్క విషయమును మాత్రము దెలిపెదను. ప్రస్తుతము గాంధిమహాత్ముడే దేశమునకుగల దిక్కు. మీరందరా మహాత్మునికి తోడ్పడుటయే మీకర్తవ్యము.

ఉ॥ భారతదేశ దుస్థితిని బాపగలట్టి పవిత్రమూర్తి, రూ
పారయగానరాదు, హృదయంబు వికాసతజెందినట్టి మం
దారము, శాంతమూర్తియని ధాత్రిప్రకాస్తి, మహాత్మగాంధియన్
పేరునబుట్టె, నన్నిట ప్రవీణుడు పొందు(రండు)హితంబుమీకిదున్

ఉద్యో—మహాత్మా! ఈ ప్రభుత్వోద్యోగమను దాస్యవృత్తి మమ్ము వేధించుచున్నది. ఈబాధలమేముపడజాలకున్నాము. మాకేమి సలహానిచ్చెదరు.

అర—మిత్రమా! మీయిక్కట్లీడేరురోజు సమీపించుచున్నది. ప్రభుత్వము త్వరలో బాగుపడును. గాంధిమహాత్ముని సంకల్పమున దేశమంతయు పవిత్రవంతమగును. మీరామహాత్మునితో గలసిమెలసి వర్తింతురనియే నాకోరిక.

న్యా—అట్లయిన మహాత్మా! మేమిక సెలవుపుచ్చుకొని, కలకత్తామహాసభలో గాంధిమహాత్ముని గలసికొందుము. పోయివచ్చెదము.

అర—మంచిది. మీకు శుభమాగాత.

అందరుకలసి—కీర్తన.

గాంధిమహాత్ముఁడేకలదిక్కాతనిగలయగపోదమురండింక
గాంధినామమే కలియుగమంతను కలచి మోక్షమిడు నమ్ముఁడిక
అంధమునఁబడి అణగియుందుమెుకో! ఆర్యతనూజులమెల్లరము
గాంధిమూర్తిమేగల దిక్కాతని గలసిమెలంగగ రారండీ॥

(అందరునిష్క్రమింతురు.) (తెరపడును.)

---

2 రంగము.

(ప్రవేశము రామయ్య.)

రా॥ కటకటా! ధనధాన్యంబులకు రాశినై పాడిపంటల కిరువై స్వేచ్ఛగా విరాజిల్లు నాభరతఖండమునకా యీఅగచాట్లు! ఎంతటి దుస్థితి! కూడును, గుడ్డయును, లేక అల్లాడు నాబోంట్లు వేనకువేలున్నారే! ఆభరతదేశ సౌభాగ్య మడుగంటినదా? లేదు లేదు, సౌభాగ్యమడుగంటినచో యీపట్టణవైభవము లెట్లు దేదీప్యమానముగా విజృంభించును. వైభవము పరులపాలైనది. ఏమి యీ మోటారుబండ్లు, ఏమి యీ సిల్కు దుస్తులు, ఏమి యీ కాఫీక్లబ్బులు! ఏమి యీపట్టణకేళింతపాట్లు! బీదసాదలల్లాడుచున్నారని యివియన్నియు మానినవా? హెచ్చుగుచున్నవి. వీనికి ఏడ్వనేల ఆతెల్లచర్మము ఏమాణిక్యముబొడ్డున పెట్టికొని పుట్టెనోకాని యీదేశమున దైవభోగమునసనుభవించుచున్నారే. నెలకు వెయ్యి రూప్యములకు తక్కువ వారికి గౌరవవేతనమేగాదట! యీవెయ్యిరూప్యములచే నూరుమంది బీదలను బ్రతికించవచ్చునే! ఆహా! ఒక్కొక్కరికి ఎంత ఆవరణములు! ఎంత చక్కని సౌధములు! ఎంత భోగము! స్వర్గసౌఖ్యము వారికింతకన్న వేరు లేదు. వేనకు వేలు కూడును, గుడ్డయు, లేక అలోయని యేడ్చుచుండగా మన శ్రీమంతులు వేలకు వేలు లంచములు ధారపోసెదరుగాని, నలుగురుకలసి యొకరోజైనను బీదలను పోషించుబుద్ధి పుట్టదుకదా!

సరే, యీ వేదాంతమునకు మితమెక్కడిది! ఈపూట పొయిలో పిల్లి లేవవలయునుగదా. దారియెట్లు? అదిగో మారయితు బాపిరెడ్డి వచ్చుచున్నట్లున్నాడు. ఆయన నేదైనా యడిగెదను.

(ప్రవేశము బాపిరెడ్డి)

బా—ఏమండీ రామయ్యగారు? మీదగ్గర కేమైనా పైకమువచ్చినదా ఈపన్నులుగావుగాని మాప్రాణముపొయ్యేరోజు వచ్చినదండి. రెండు కిస్తీలు చెల్లించాను మళ్ళా మూడవకిస్తీ తయారు. ఎక్కడనుండి తెస్తాము? ఇంట్లోచూదామా గిద్దెడు గింజలులేవు. ఈఏడు మట్టుకు యీఏడు 15 యకరములు జొన్న వేస్తే గిద్దెడుపేలాలు యింటికి జేరలేదు. ఇంకాయేమి బ్రతుకుతామండీ. సరే, కడుపులో కాళ్ళుపెట్టుకొని పడుకుందామంటే యీకరణాలు మామీద లగాంలు చేస్తారు. చస్తుంటే సంధ్యమంత్రమన్నట్లు యేమిపన్నులిస్తామండి! యీపన్నులు యిట్లావుండగా "యిన్‌కమ్‌టాక్సు" బాధ రామరామ! విరోధికైనా వద్దండి.

రా—(తనలో) సరే, యెవరిగోల వారిది. నాయగచాట్లునావి, ఆయన యగచాట్లు ఆయనవి.

(ప్ర) బాపిరెడ్డిగారూ కరణాలబాధంటారు, వారేమిచెస్తారండీ. వాళ్ల తాతగాడి సొమ్మనుకొన్నారా.

బా— ఎమోలెండి, ఆగోలంతా ఎవరికి తెలుస్తుంది. మనమనెత్తిమీద మిరియాలు తోలేది వారు. సరే పైకముసంగతి?

రా—నేను మీదగ్గరకువస్తున్నానండీ- చెప్పుకుంటేసిగ్గుచేటు.

బా—సరేలెండి, యిద్దరముకలసి ఎక్కడికన్నా పోదామురండి. కూడులేక చచ్చేది లేదుకదా. ఎక్కడో ఏలణాకో బేడకో వ్రాసేది తెచ్చేది. అదుగో, గోపిశెట్టి మాఖాతాదారుడువస్తున్నాడు. అయనకూ మాకూ యీ మధ్య ఖాతాలేదులెండి మీరే హెచ్చరించండి.

(ప్ర)వేశము గోపిశెట్టి).

రా—ఏమండో శెట్టిగారు, మీవద్దకే ప్రయాణం.

గో—బాపిరెడ్డి వారంతవారుండగ మాదగ్గరకు మీరువస్తారూ. ఆరోజులు పోయినవిలెండి.

రా—లేదండీ, నిశ్చయముగా మేమిద్దరమూ మీదగ్గరకే రావడం,

గో—రోజులు మహాకటువుగా నున్నవండి. మాఅమ్మాయిని అత్తవారింటికి పంపుచున్నాము. దానితాలూకు సొమ్ముదిగపడ్డది. ఇదిగో అణాకానీ కాడికి తెస్తున్నా యిప్పుడే.

బా—మీరుకూడా అణాకానికి వ్రాయడమేమండీ?

గో—ఏమిచేయమంటారు మీవంటి మహారాజులు చల్లగానుంటేనేనా లేకపోతే మాపని యేమున్నది చెప్పండి.

రా—(తనలో) ఇతడు మాయవుసరము కనిపెట్టి బెట్టు చేస్తున్నాడు. మొన్నటివ్యాజ్యము నాచేతిలోనే యున్నదిగదా చూదాము.

(ప్ర) ఏమండి శెట్టిగారూ మొన్న వ్యాజ్యములో సాక్ష్యము కుదిరిందా.

గో—ఇదిగో రామయ్యగారూ, జ్ఞాపకమువచ్చింది. నన్నేమన్నా కడతేర్చేమార్గమున్నదా లేదా? మొన్న యిట్లాబస్తీకిపోతే రోజుకు రూపాయి సరేకదా ఏమో ప్లీడరుగారి నకళ్ళంటా ష్టాంపులంటా మరేమో సమన్లంటా, వందరూపాయలు భర్తీ అయినవి, ఇంకా ఫీజుఅట్లాగేయున్నది. మీరు కాస్తఆకాగితాలు చూచి మాట్లాడి పొండి. మొదటినుంచి మాతాతలనాటినుండి యున్న పరిచయము.

రా—అబ్బే అలాంటివేమి నాకు లేవండి. దీనిదుంప తెంచుకొని యీ డబ్బు తొందరవచ్చిపడ్డది.

గో—సరే రామయ్యగారు! మీరిన్నివిధాల చెప్పవలెనా? మీఅవసరమొకటి మాఅవసరమొకటేనా? చెపుతాలే రండి.

రా—బాపిరెడ్డిగారూ మీరింటికిపొండి,వీడిదగ్గర నేనుకొట్టుకొస్తాలెండి.

(అని సైగచేయును.)

(గోపిశెట్టి రామయ్య నిష్క్రమింతురు.)

బా—ఈయగచాట్లు పడేదానికంటె గాంధి మహాత్ముడేదో రైతులకు దారిచూపిస్తాడట.కొద్దిరోజులలో కలకత్తాలో గొప్పసభ జరుగు తుందన్నారు.అక్కడికిపోయి మీ అగచాట్లన్ని మొరపెట్టుకొని యామహాత్ముని కాళ్ళమీద పడతాను. కాలమురోజురోజుకు విపరీతమైపోవుచున్నది.! (నిష్క్రమించును)

---

3 వ రంగము.

ప్రవేశము యిద్దరు విద్యార్థులు.

1 వి—ఏమండోయ్! ఈసంవత్సరం పరీక్ష పర్యవసానం(రిజల్టుస)వచ్చినవి చూచినారా? నేను చూచినంతవరకు బి. ఏ. వాళ్ళెవ్వరు ఇంగ్లీషులో కడతేరలేదు. ఇంటరుమీడియేటులో నూటికి 9 మందిఅయినారట.

2 వి—సరేలెండి! ఈరిజల్టుసకేమిగాని నిన్నమీటింగుకువెళ్ళారుమీరు? ఈరోజులలో తిలక్‌మహారాజు పోవటం మన దురదృష్టమేనండి. ఇక గాంధిమీద పడ్డవి యీభారమంతా.

1 వి—ఏమిమీటింగులకు పోతాము, ఏమిపేపర్లు చదువుతాం.ఇవ్వాళ హిస్టరీపరీక్ష. నిన్నంతాబయటకు రాకుండా చదివితే యిప్పటికి పోర్షనులింకా కాలేదు. ఇంతా యేడిస్తే మనము చదివేదొకటి. వాండ్లడిగేదొకటి. సరేకష్టపడియిందులో కడతేరుతా మనుకొండి.అసలు పరీక్షలో నూటికి 20 మందిలో మనముంటామని యెట్లాగండి.

2 వి.—మీరింకా పరీక్షకు పోవలయునని చూస్తున్నారే! ఈసహాయ నిరాకరణ గడిబిడ నీకేమిపట్టనట్లున్నదే! రేపు కలకత్తా మహాసభలో గాంధిగెలువడా, దేశమంతయు కలవరముజెందదా? నామట్టుకు నేను యీ పాడుచదువు వదలటం యెప్పుడాయని యెదురు చూచుచున్నాను.

1 వి.—ఏమోలెండి, యీతీర్మానం నెగ్గుతుందని నాకు ధైర్యము లేదు, ఒకవేళ నెగ్గినను మనవిద్యార్థులవిషయమై మాత్రము గాంధిని గెలువనీయరు. తిలక్ మహారాజయినా వుంటే దేశాన్ని పట్టుకు వచ్చేవాడు. ఇప్పుడు గాంధి ఒక్కడేఅయినాడు. మాలవ్యా అటూయిటూ వూగుతున్నాడని విన్నాము. పాలు, దాసులు వ్యతిరేకంగా వున్నారట. మన మదరాసు అయ్యంగార్లుకూడ వారిలో కలిసినారట. ఇక తీర్మానం నెగ్గటం ఎలా చెప్పండి.

2 వి.—ఇవన్నీ ఆగుతవండీ! గాంధి అంటే పూర్వపుగాంధి అనుకున్నారాయేమి? తిలకుమూర్తి అవతారము చాలించి గాంధిలో ప్రవేశించినాడట! మొన్న ఆయన మారణకాలములో జరిగిన సంగతి మీరు వినలేదా?

1 వి.—విన్నాలెండి. కాకపోతే యిదివరకు గాంధికి యిప్పటి గాంధికి యింత భేదముంటుందా? అయినప్పటికి ఆయన తీర్మానం నెగ్గటం చాల కష్టమండీ.

2 వి.—కష్టమేమిటండీ, యీశంకలన్ని మనవిద్యావంతులని చెప్పకొనేవారికేగాని ప్రజాసామాన్యము మనరయితాంగము యావన్మంది గాంధిమహాత్మునిపై అతిభక్తికలవారై రేపు కలకత్తాకుపోవ సంసిద్ధులైయున్నారు. అసలు ప్రజలే పట్టుపట్టినప్పుడు యితరులు యెంతమంది వ్యతిరేకంగావుంటే లెక్కయేమిటిలెండి. అవునుగాని మనకాంగ్రెసు ప్రయాణం విషయమేమిటి,

వి— అవునండీ, నేను అనుకుంటూనే యున్నాను. మాయింటిప్రక్క ప్లీడరుగారు, ఇంకొక కలెక్టరాఫీసు గుమాస్తా, వారిద్దరు గూడా వెళ్ళుతారట.

2వి— గుమాస్తాగూడానా ! అవును లెండి. అందరికి విసుకుపుట్టుతున్నది! మనముగూడా యెల్లాగైనా పోయి తీరాలిసిందేనండి. పోయిడబ్బు ప్రయత్నం చేతామురండి. (నిష్క్రమింతురు)





NATIONAL ARCHIVES OF INDIA

# గాంధివిజయము.

(1 రంగము.) ద్వితీయాంకము.

షౌకతాలి (దీర్ఘాలోచనపరుడై తీవ్రదృష్టితో)

ఎట్టి దౌర్జన్యము!— ఎట్టి దౌర్జన్యము.— ఎట్టి దౌర్జన్యము:— ఛీ ఈజన్మమెందులకు? బెబ్బులి పిల్లలవలె గంభీరస్వరూపులై గొదమ సింగములవంటి పౌరుషమూర్తులై ఖడ్గమును చేతబూని భూమ్యాకాశంబుల గడగడలాడించు నా మహమ్మదీయ జాతి ప్రతాపమంతయు చల్లారినదే! నేడు స్వేచ్ఛగానుండుటకు గూడ నోచుకొనమైతిమిగదా! యింక కర్తవ్యమేమి? మనస్సు పరి పరివిధముల బోవుచున్నది. ఆహా! లయడ్ జార్జిమంత్రి గారి మాటలు నీళ్ళలో మూటలయ్యెనుగదా! మాకెంతయో సాయము చేసెదనని చెప్పి తుదకామాటలనన్నిటిని మంట గల్పెను. మాకాతడేదియో మహద్భాగ్యము చేయునని ఆశ పెట్టుకొనియుంటిమి. తుదకు మోసపోతిమి.

ఆహా! తుర్కీరాజ్యము ధ్వంసము కావేసినదేనా! ఎంత మాటపల్కితిని! ధ్వంసమా! రాజ్యమునకా! కాదు. మతమునకు గూడ! మహమ్మదీయమతమునకా! నాకయోమయ మగుచున్నది. నాయొడలు నాకు తెలియుటలేదు. ఏమిచేయుదుము! ఈదేశముననున్న ఏడుకోట్ల మహమ్మదీయులము కూడ నొక్కుమ్మడి ప్రాణములర్పింతుమా! కాక మరేమిచేయవలయును? తుర్కీరాజ్యమును కాపాడక మాప్రాణము లెందుకు? ఇక యీదేశము మాకెందుకు? ప్రభుత్వము మాకెందుకు? ప్రభుత్వమునకు విధేయత చూపవలసినదేకాని దైవముకన్న ప్రభువెక్కువగునా? ముందు మాదైవాజ్ఞను నెరవేర్చి తదుపరి రాజభక్తిని జూపవలయును: ఇంకనూ అనుమానించుటేటికి మావిషయములో దైవముముందా రాజుముందా అనుచో

నిస్సంశయముగా దైవమే. రాజభక్తి రెండవపక్షము.

(కొంచెమాలోచించి).

చేయవలసిన పనియేమి? యోచించుటేటికి? దేనికినీసిద్ధమే. అవుసరమైనచో మహమ్మదీయులమందరమును హిందూదేశమును విడిచిపోవుటకు సిద్ధమైయుండవలసినదే. ప్రాణములను లెక్కింపగాదు. అక్కటా! మతమునకు నాశనమా! ఆమాటకూడ యెంత కర్ణకఠోరముగా నున్నది. నాకేమియు తోచుటలేదు పిచ్చెత్తుచున్నది.

(ఎవరో గనబడినట్లు భ్రమపడి)

ఓహో ఎవరువీరు? మామతము నేమిచేసెదరు! మీరెవరు? ఆంగ్లదేశీయులా? అయ్యో మీరుగూడమాపైనింత పగయేటికి? మీరు మాదేశమునకువచ్చినప్పటినుండియు మీకు "దాసోహం"అనుచున్నందులకా? మీకు సహాయభూతులమై మీతో పాటు నిలచియున్నందులకా? మొన్ననే కదా మీతోపాటు కత్తిగట్టి మామతస్థులపైకి కూడ దాడివెడలినది. మొన్ననే కదా వేలకువేలు రూప్యంబులను వేలకువేలు ప్రాణంబులను మీకర్పించినది. ఇవియన్నియు ఎంతలో మరుపునకు వచ్చినవి! చాలు—చాలు—పొరబడితిమి. అయ్యో, మీరీఘోరకృత్యమునుండి తొలగిపోయెదరని ప్రార్థించుచున్నాము. మీరుమాకు ప్రభువులగుటచే మిమ్మింతకన్న నేమియు అనలేకున్నాము.

(కనులు మూసుకొని)

అల్లాహో అక్బర్! మహమ్మదీయ మతరక్షణార్థమై యేప్పుడు వచ్చెదవు తండ్రీ! (అనిమూర్ఛపడి,) మరల తత్తరపడి లేచి) ఛీ, ఛీ, దురాత్ములారా! యింత ఆగడమా? ధ్యాన

పరుండనై యున్న నన్నిగతాళి చేయుచుంటిరా? మామహమ్మదీయరాజ్యమును ధ్వంసముచేయుదుమనియా మీతలంపు. మీ మీపూర్వపుపగలనుసాధింప నెంచుచుంటిరా! మీపూర్వులు తుర్క రాజ్యమును స్వాధీనపరుచుకొనజాలనందుకు మీరావనినిపూర్తిచేయదలచుచున్నారా? ఎంతఅన్యాయమునకొడిగట్టుకొంటిరి! మీదేశములమధ్య తురకదేశమెందుకనుకొంటిరా? ఆమహమ్మదు రక్తము మానాళములలో ప్రవహించుట లేదనుకొంటిరా? సూర్యచంద్రాదులుర్వపై వ్రాలినను భూమ్యాకాశంబులుతల్లక్రిందైనను పర్వతశిఖరంబులు నేలపైగూలినను ఇంకెన్ని జరిగిననజరుగుగాక! మా మహమ్మదీయమతమున కించుక చలనముకూడ కలుగదు. మీరెన్ని దురాలోచనలు సల్పిననేమగుగాక. మామహమ్మదీయమతముపృధ్విపైలయువరకును నశింపనేరదు. అట్టి మతమున కవమానము సయితము మేమోర్చుకొందుమా? హిందూమహమ్మదీయుల మొకటగుచోపరిపంచకమంతయు నాపియుంచమా! హిందూసోదరులారా, లెండు, మాతోరండు. మనమనపూర్వపు పగలను మరచిపోవలయును. లెండు లెండు. మాకు సాయముచేయుడు. ఏమిచేయవలయునని అడుగకుడు. ఏమిచేయుటకునూ సిద్ధముకండు. మనమందరమును ఒక్కమాతృగర్భముననే జనించితిమని మరువకుడు. లెండు! లెండు! జాగుచేయకుడు, ముందు మనమాతృభూమికి స్వేచ్ఛ తెచ్చుటకు పూనుకొనుడు, అట్లుచేయుటకు సర్వవిధములను ప్రయత్నించుదమురండు. ముందు మనము స్వతంత్రులమైనగాని మనమేపనియు చేయజాలము. మామహమ్మదీయజాతియందుపుట్టిన వారెవరును వెనుతీతురపితలంచకుడు. వెనుతీసిన ఆత్మహత్యచేసికొనిన వారగుదురు. వేయిశంక లేల, నిశ్చయించుకొంటిని. ఇదే నాప్రతిన గైకొనుడు,

శా॥ నేనేపౌరుషజాతివాడనయితే నిక్ మామహమ్మద్ సుతుల్
ప్రాణంబుల్ భువిగల్గియున్నయెడ, నార్యావర్తదేశంబిదే
యైనన్, జంకడు షౌకతాలి, యిక భూమ్యాకాశముల్ డొల్లగా
రానీ రక్తసకోటినైన నతి సిర్ లత్యుంబునన్ ద్రుంచెడే॥

(గాంధి ప్రవేశము)

గాం—శాంతింపుము. శాంతింపుము. ఏమి యీమూఢత్వము. "అహింసా పరమోధర్మః" అని యెఱుగవా! ఇతరులవలెనే నీవును అహంకారముజూపిన ప్రయోజనమేమి? కార్యముసిద్ధింపదు. శాంతిమార్గమే జయమునకు రూఢియైన పథముగాని నీవంటి తేజోవంతు లాగ్రహులగుచో విప్లవము వాటిల్లదా! నెమ్మది వలన సాధించవలె గాని తొందరపడిన ప్రయోజనమేమి.

షౌ—ఏమి! తొందరపడుచుంటినా! పౌరుష పరితాపంబులన్నియు చల్లారిన మీవంటివారామాకు సలహాలనిచ్చుట. సరిసరి కను కనే మనస్థితి యింతహీనముగా నున్నది.

గాంధి—ఓపౌరుషమూర్తీ! నీవలె నేను పౌరుషవంతుడకాక పోయినను నీఆగ్రహమువీడి శాంతచిత్తుడవయ్యెదవేని నీకొక సందేశమును దెల్పెదను.

షౌ—కట్టా! యితడు మహాత్ముడని యెఱుగక ఏమేమియో యిష్టమువచ్చినట్లు వదరుచుంటిని. మహాత్మా! తామెంత చెప్పినను నా ఆగ్రహాతీవ్రసలమింకను చల్లారకున్నది. తామేమి సెలవిచ్చెదరు.

గాంధి—ఓపరితాపమూర్తి, నీపౌరుషపటుత్వమున కెంతయు సంతసించువాడ నైనను కాలము నెరింగియు కర్తవ్యమును దెలిసికొనియు మెలగవలెనని నాకోరిక.

ఉ॥ శాంతమువీడి యాగ్రహము సల్పిన కార్యముసిద్ధిజెందునే?
స్వాంతమునందు సర్వము వశంబుననుంచియు గీడుమేలులా
సాంతముగా నెరింగి పనిసల్పిన మేలగుగాని, తొందరన్
గంతులుపెట్టి దూకుటల గల్గునె కోర్కెఫలంబు మిత్రమా॥

మరియు

మ॥ అలపాశ్చాత్యులబోలె మూఢమతులై యాలంబులన్ జేసి ల
క్షలప్రాణంబుల దీయనెంచుటయె యుక్తంబానో! నాదుమా
టలనాలింపుము, శాంతిమార్గ మతికష్టంబేయగున్ గాక లో
కులకున్ నేర్పుచు నేర్చుకొన్నయెడ కోర్కుల్ నెగ్గవో యెంచుమీ॥

ఓయీ! పౌరుషాలి! నాయందనుగ్రహముంచి నామనవి విందువేని నీయనుమానములన్నియు తీర్చెదను.

షౌ—మహాత్మా! శాంతము శాంతమనికలికెదవు. ఇన్నివేండ్లనుండియు పాతుకొనియుండి యింత నిరంకుశాధికారమును సాగించుచున్న యీప్రభుత్వమును శాంతముచే సాధింప గలమనియా మీ యూహ.

గాంధి—లేక దౌర్జన్యముచే సాధింతమనియా నీతలంపు. దౌర్జన్యమున విశ్వప్రయత్నము చేయుచున్న ఐర్లాండుదేశమేమి సాధించ గలిగెను? దౌర్జన్యమార్గమునందారితేరిన జర్మనీ యేమిమూట కట్టుకొనెను? పాశ్చాత్యులు వేరొకమార్గము నెరుగక దౌర్జన్యమార్గమునే దొక్కుచున్నారు. పూర్వము మన తూర్పు ప్రపంచము లోకమునకెట్టిదారి చూపెనో యిప్పుడును మన మీ శాంతమార్గమును ప్రపంచమునకు బోధింపవలయును.

షౌ—మిత్రమా! ఈయుడుతయూపులకు చింతకాయలు రాలుననియా మీతలంపు. నెమ్మదిగామాటలాడుట వలన మనమేమి సాధించగలము. వారు మననెత్తిపైనెక్కుకొలదిని మనము లొంగి లొంగి మెలగవలెననియా మీరుచెప్పుట.

గాం—షౌకతాలీ! నేనుచెప్పెడు శాంతిమార్గ ముడుతయూపులవంటి దనియా నీయూహ. నామతము ముమ్మాటికిని శాంతమే. శాంతమార్గము ఆత్మనిగ్రహముపై నాధారపడి యుండును.

ఆత్మశక్తికన్న వేరొక మించినశక్తిలేదు. అట్టి ఆత్మశక్తిని మనము స్వాధీనపరచుకొనిన విశ్వమంతయును మన స్వాధీనమైనట్లే. అనగా మన అంతరాత్మను మనస్వాధీన పరచుకొనిన ప్రపంచమంతయు మనకు లోబడియుండును. అప్పుడు మన కెట్టిబాధలును బాధలుగా తోచవు. అప్పుడు మన కసాధ్యమైనదేదియు కనుపించదు. ఇదియే నాసిద్ధాంతము.

షౌ.—మీరు చెప్పువిషయములు కొంతవరకు నాకు నచ్చినవి, కాని నామనను వేరొక దారిని పరుగిడ జూచుచున్నది.

గాం.—మిత్రమా! నీవాలోచించు విషయము రెండవపక్షము. నిజమునకు దౌర్జన్యమవలంబించి మనమేమిచేయగలము! ఆయుధములవాసనకూడ చూచి యెన్నేళ్ళయినది? పోనీ ఒకవేళ చేయగల్గినను ఉత్తమమార్గములు విడిచి రెండవపక్షమగు మార్గమున పోజూచుట శ్రేయస్కరమగునా?

షౌ.—అవును అదియును సత్యమే నామనముకూడ ఆలోచనలోపడినది. మీరు చెప్పినవన్నియు నిశ్చయములనియే తోచుచున్నది.

గాం.—మేలు, మిత్రమా! ఇంకకొంచెము సావకాశముగ విందువేని నామతమును సంపూర్ణముగ నంగీకరించెదవని నేను నమ్ముచున్నాను.

మరియొకసారి నీదౌర్జ్యమునుగూర్చి చెప్పెద వినుము.

సీ॥ దౌర్జన్యమున దురంధరుడై నెపోలియన్ •
జగమెల్లనేలగా జాలెనొక్కొ
దౌర్జన్యమూని స్వాతంత్ర్యమీ కమెరికా •
నణచిరే బ్రిటిషు రాజ్యంబువారు
దౌర్జన్యమగ్గాన దర్పంబుజూపిన •
జర్మనీ యేపాటి జయముగాంచె

దార్జన్యపథమున దరిజేరగాబోరు
నైర్లాండు దేశమేమయ్యె నేడు।
తే॥ గీ॥ ఇచటదార్జన్యమునుజూపి యేమిమూట
గట్టుకొందురు రాజ్యవర్గంబువారు ?
పరమమహానీంద్రు ప్రహ్లాదువరపథంబు
శాంతిమార్గాన సాధింపజాలమేమి?

మిత్రమా! మనమింకబోయి శీఘ్రముగ కలకత్తా మహాసభకు జేరి, అచ్చట మనసందేశమును దేశమునకు వెల్లడింతము.

షా—మిత్రమా, కాలమునకు కట్టుబడినట్లే, నీశాంతమునకుగూడ నేను కట్టుబడితిని. ఇంక నీనూతనమార్గమున నడుగుదప్పక వర్తించెదను. పోవుదమురమ్ము. (నిష్క్రమింతురు).

2 రంగము. (కాంగ్రెసుభవనము) కలకత్తానగరము.

(బాలభటులు. కాంగ్రెసుసభాలంకారము:—)

(సిగ్నలు వినబడును.) (బాలభటుల సైన్యము ప్రవేశము.)

నాయకుడు—బాలభటులారా! కాంగ్రెసుసభాలంకారములు పూర్తి అయినవి గనుక, మనమందరము చిన్నిచిన్ని సంఘములుగనేర్పడి అవసరమైన పనులన్నియు చేయుదము, రేపటిదినమే కాంగ్రెసు మహాసభకూడును. ఈరోజు అధ్యక్షులగు లాలా లజపతి రాయిగారును, మహాత్మాగాంధి మొదలయిన నాయకులు నరుదెంచెదరు. వారికి స్వాగతమొసంగి, వసతుల నేర్పరుచు

---

1 . ఫ్రాన్సుదేశమునకు పూర్వము చక్రవర్తి, అతడు యూరపునంతయు గడగడలాడించెను.

2 . అమెరికా పూర్వము బ్రిటిషువారికి లోబడినరాజ్యము వారు తిరుగబాటు చేసి స్వతంత్రరాజ్యము నేర్పరుచుకొనిరి.

8 . మొన్నటి మహాయుద్ధములో జర్మనీ రోడిపోయినది.

4 ఐర్లాండు దేశమిప్పటికి స్వరాజ్యమునకై పోరాడుచున్నది. ఇంకను జయింపలేదు.

టకు మనము త్వరితముగ పోవలయును. 1 వ నెంబరుముఠా ధూమ శకటాలయమునకు వెళ్ళి వివిధప్రదేశములనుండి వచ్చు ప్రతినిధుల తీసుకు రావలయును. 2, 3, వ ముఠాల వారు సభామంటపమునందును, ద్వారములయందును నిలువబడి ఆజ్ఞల నిర్వర్తించుచుండవలెను. 4 వ ముఠా వారు అత్యావసర కార్యములకై నిలువలోనుండవలయును. 5వ ముఠా వారు అగ్రాసనాధిపతిగారి యాజ్ఞలో నుండవలయును.

(తెరలో) మహాత్మా గాంధికి జేయ్. లజపతిరాయ్‌కి జేయ్.

అరుగో నాయకులరుదెంచుచున్నట్లున్నారు. మనమిక శీఘ్రముగ పోవలయును. రండు. (అందరు కలసి)

(నవరోజు - త్రిశ్రజాతి - ఏకతాళము.)

స్వదేశమాతనీ, పదారవిందముల్
సదామదిన్ భజించెదన్ ముదంబుగూర్పుమా॥
వరాలతల్లి మా మొరాలకింపుమా
బిరాన కనికరానగని, వరాలొసంగుమా॥ స్వదేశ॥
శ్రితార్థిమాతమా, హతాఘపూతమా
హితంబుగరపి మముకృతార్థ, మతులజేయుమా॥ స్వ॥

(నిష్క్రమింతురు)

తెరలో (మహాత్మా గాంధికిజెయ్. లజపతిరాయికిజెయ్. షౌకతాలికిజెయ్)

[ప్రవేశము:—లజపతిరాయ్, గాంధి, షౌకతాలి, నెహ్రూ వగ॥ బాలభటులు దేశీయ గీతములు పాడుచుండ నాయకుల ఊరేగింపు]

బాలభటులు— (అందరు)

భూపాళరాగము—చాపుతాళము

1 "మేలుకొనుమీ భరతపుత్రుడ
మేలుకొనుమీ సుజనమిత్రుడ

మేలుకొనుమీ సచ్చరిత్రుడ
మేలుకొనుమయ్యా వత్సా। మేలుకో।

2 వేడుకను జాతీయతాయను
వేగుచుక్క పొడిచె నదిగో
కూడి "వందేమాతరం" యని
కుక్కుటములరచెఁ। వత్సా మేలుకో।

3 అంతటను నవశక్తియనియెడు
కాంతిపుంజము తేజరిల్లెను
మంతనంబున నూతనోద్యమ
మారుతమువీచెఁ। వత్సా।

4 అందరును నీకంటెముందటి
నడుగులిడుచును మెలగుచుండగ
కందవలె నిటు నిద్రపోవగ
పాడియగునయ్యా। వత్సా।

5 ఒక్కప్రాణమె యందరిది మా
దొక్కమనసే యందరిది, మే
మొక్కమార్గమె దొక్కగలమని
నొక్కవక్కాణింప వడిగా మేలుకో। వత్సా మేలుకో।

(నిష్క్రమించును)

---

## 3వ రంగము.

### మహాసభ ప్రారంభము.

(అధ్యక్షకోపన్యాసము.)

ఆహ్వానసంఘాధ్యక్షుడు—

తే॥ గీ॥ భారతీయ వంశోద్ధర ప్రముఖులార,
హైందవము నూతన వికాసమందు వేళ

మొలకలెత్తిన చక్కని పూవులార,
దేశభారంబు శిరముపై ధీరులగుచు
మోయసంసిద్ధులగు మహనీయులార,
స్వాగతము మీకు నో మహాసభ్యులార!

(అని సభపై పుష్పములుజల్లి) ఈ మహాసభకు దేశభక్తాగ్రగణ్యులగు శ్రీ లాలాలజపతిరాయిగారు అగ్రాసనాధిపతిగా లభించినందుకు మనమెంతయు కృతార్థులము. వారి నాయకత్వమున యీ మహాసభ జయప్రదముగ నెరవేరునని నమ్ముచున్నాను.

(అని లజపతిరాయ్‌గారికి పుష్పహారము వేయును.) కరతాళములు

లజ— దేశీయ మహాజనులారా! సోదర సోదరీమణులారా! ఈమహాసభకు నాకన్న నధికులగువా రెందరోయుండ నన్నే అగ్రాసనాధిపతిగా నెన్నుకొన్నందుకు మీ కెంతయు కృతజ్ఞతాపూర్వక వందనము లర్పించుచున్నాడను దేశము మహాకష్టదశయందున్నది. ముందు చేయదగినపని చూడ ఘోరసముద్రమువలె నంతులేనట్లున్నది. ఈ తరుణమందున తిలకుమూర్తికూడ గతించెను. భారమంతయు ఏయొక్కరును మోయతగినదిగా గన్పించుటలేదు. ఆసేతు హిమాచలపర్యంతము సర్వప్రాంతముల నుండియు విచ్చేసి యీ సభాభవనము నలంకరించిన దేశభక్తులగు మీరందరును కలసి మెలసి బాగుగ యోచించి కర్తవ్యము నిర్ణయించవలెను. విషయము లనేకములుగానున్నవి,

సీ॥ ఒక్కడే లోకమాన్యుండు లోకమువీడి
పోయె దుఃఖంబింక పోవుటెట్లు
స్వాతంత్ర్యమనుగంటి సౌఖ్యంబు చల్లారె
భరతమాతకు స్వేచ్ఛ నెరుగుటెట్లు
మతమునకవమానము తటస్థమైన మ
హమ్మదీయుల శాంతి నరయుటెట్లు

తీవ్రమైపీచుజాతీయ వాతావర
ణము శాంత పడుభాగ్యమమరుటెట్లు

గీ॥ ఆగ్రహము జూపుటకును నిరాయుధులము
పౌరుషమునూడ బెనుక జీవచ్ఛవంబు
లై మనెడు సోదరులను పంజాబుజనుల
గొట్టి రక్తంబు కాల్వలగట్ట జేసి
నట్టి పరమకిరాతుల నక్కటకట!
న్యాయ మార్గంబునను శిక్ష జేయు టెట్లు॥

మరియు

మ॥ కడుసందిగ్ధము కాల, మిట్టితరిజంకన్ భారతీయాశయం
బడుగంటున్, గలుగంగనేరదు స్వరాజ్యంబింక నెన్నేండ్లు, కే
ర్పడగాబోదు స్వతంత్రజీవనము, దూరంబౌను సౌభాగ్య, మె
న్నడుతొమ్ముంబిల వీడిపోవదు, మనంగా దుర్భరంబౌ నిలన్.

సభాసదులారా, దేశము నానాటికెట్టి యధోగతి పాలైనదో ఇంచుక గమనించుడు

మత్తేభమాలిక

ఘనశైలంబులనుండి జీవనదులే యేకాలముల్ బారగా
వనముల్ దోట లరణ్యముల్ మిగులసౌభాగ్యంబు గల్పింప, నీ
ధనధాన్యంబులరాశి, హైందవుల స్వస్థానంబు రాజిల్లుచో
గననెవ్వారికి కడ్లుగుట్ట? విటసౌఖ్యంబొప్ప జీవింపగా
జనినారెందరు లోకు? లెందరిక స్వేచ్ఛన్ వేలనార్జించి పై
కనుపన్ జాలిరి, వర్తకంబుపయి దవ్యంబెంత కాజేసి నా,
రనికిన్ బోయిన రూకలెన్ని, మనన్యాయంబుపాజ్లేసి నా
శనమున్ సేయుగ హేతువెయ్యది, స్వదేశంబందు సేయంగనే
రనివృత్తుల్ గలవే! దలంచుకొనుడార్యావర్తన్ దేశంబనన్
ఘనమెప్పాటిదో! లోకమంతకును మార్గంబెద్ది జూపించెనా

ఘనతఁ నిల్పి, స్వదేశవస్తువులదక్కఁ వేరవర్జింప నె
మ్మనమందొక్కటె దీక్షబూనుకొని తూమంబిందుఁబోగొట్ట నూ
కొనుడీ, సోదరులార, నిశ్చయముకోర్కుల్ వేగమీడేరెడున్.

సోదరులారా, నానాప్రాంతములనుండియు సమితోత్సాహులై కార్యదీక్షఁ గైకొనుటకు విచ్చేసిన దేశసేవాధురంధురులగు మీచేనలంకరింపబడిన ఈసభామంటపమునందు భారతీయ నూతనతేజోలక్ష్మి తాండవంబాడుచు కన్నులపండువ యగుచున్నది. మనప్రస్తుత కర్తవ్యము విషయములో గాంధిమహాత్ముడు సహాయనిరాకరణ తీర్మానము నుపపాదింపబోవుచున్నాడు. సమర్థులగు వేనకువేలు మీరందరుండగా నాఅభిప్రాయము ముందుగానొసగుట సమంజసముగాదు. మొత్తముమీద సహాయనిరాకరణ సిద్ధాంతము నంగీకరించువారలలో నేనొకడను. ఆతీర్మానమునందలి వివిధాంశములను బాగుగాచర్చించి మీరే యీసభాముఖంబున నిర్ణయింపవలసియున్నది. ఇప్పటికేచాలకాలాతీతమైనది. విషయనిర్ణయసభ సత్వరము కూడవలయును. విషయము లనేకములున్నవి. కావున నాయుపన్యాసమును చాలించి యీనాటికీసభను ముగించుచున్నాను. మరల రేపటిదినము మహాసభకూడును.

(కరతాళధ్వనులు)

(తెరపడును.)

---

4 వ రంగము— (కాంగ్రెసులో ఒక పక్షమువారు)

(ప్రవేశము స్వాభిలాషి)

స్వా—స్వాభావ వైచిత్ర్యమేమియోగాని, అంతరాత్మ నెంతయుఁణచుకొన్నను అణగియుండదుగదా! దేశీయమహాసభను కండ్లజూడకుండ నుందమనిన ప్రాణమొప్పదు. అచ్చటికేగిన మమ్ము కండ్లజూచువారెవ్వరు? విషయ నిర్ణయ సభలో నడుగుపెట్టనీయరు

NATIONAL ARCHIVES LIBRARY
No 2794
Date 3.3.72

కూడ మాకు ప్రాప్తములేదుగదా. పోనీ మాఉపన్యాసములైనా చక్కగా విందురేమో. యనిన, కేకలు, అల్లరులు, అరుపులు ఎంతసేపుజూచిన లోకమాన్యుడు, మహాత్ముడు అని పడిచచ్చేవారేగాని, మాపేరు ఊరు తలచు వారెవ్వరును లేరు. అనామధేయులమై వారితోపాటు పడియుండేదానికన్న వేరే ఇంకొక సభపెట్టుకొనిన శుభ్రముగా మనమే శెక్రిటరీలము, మనమే ప్రెసిడెంట్లము కావచ్చును. మన యిష్టమువచ్చినట్లు మనముచేసికొనవచ్చును. ఈకలకత్తా కాంగ్రెసులో మనమాట యేమిసాగేటట్లు గనబడలేదు. ఈసంగతి నాయితరమిత్రులతో నాలోచించెదను.

అదిగో సగర్వియిటులనే వచ్చుచున్నట్లున్నాడు.

(ప్రవేశము సగర్వ)

స—నమోనమః.

స్వా— నమోనమః ఏమండివిశేషములు?

స—ఏమున్నవండి. చూచినారా విషయ నిర్ణయ సభకు అందరు గాంధిగారి అనుచరులే ఎన్నుకొనబడిరి.

స్వా—నేననుకొనుచునే యున్నాలెండి. మనకు తెలిసిన విషయమే దాని కాశ్చర్యమెందుకు.

స—ఇకముందు చేయవలసిన పనికి మీ అభిప్రాయమేమిటి.

స్వా—ఏమున్నవండి. ఇట్లా అనామధేయులమై యెన్నాళ్లు పడియుంటాము చెప్పండీ. ఈసాదాగుంపు మనమాటల లక్ష్యపెట్టదు. కాబట్టి మనము ప్రత్యేకముగా యుండవలసినదే.

స—ఈజనులదొక లెక్కేమిటండీ. వెనుక ముందు చూడకుండా గుడ్డెద్దు చేలోబడ్డట్లు, ఈజనసమూహము ఏదారిని బడితే ఆదారే. పట్టిఅరపులేగాని, సరిగా పనిచేయవలసి వచ్చినప్పుడు వారిసంగతి తేలును. మనమందరము బాగాపట్టుపట్టితే వాళ్లు

తిరుగుతాగులెండి.

స్వా—లేదండి. అవియన్ని పిచ్చిభ్రమలు. అచ్చట మనమాటలెవ్వరును విశ్వసింపరు. మనము వేరొక సభను బెట్టుకొనిన బాగుండును.

స—ఉండండి. తొందరపడవద్దు. ఈసభలో గాంధిని గెలువనిస్తామా? మనవాళ్లందరు వచ్చినారు. పైగా జాతీయవాదులలో చాలమంది గాంధికి వ్యతిరేకం. వాళ్ళు మనము కలసినయెడల ఆయన కపజయం నిశ్చయం. మన బిశెంటుదేవి మన పక్షమున్నది. ఆబిడ తలచుకొన్నయెడల నెంత పనినైనను జేసి తీరును.

స్వా—అవును ఆమాట సత్యమే. అయినను మనవాళ్ళింకను చాల మంది సభకువచ్చునట్లు చేయవలయును. "అదిగో అధికారాభిలాషిగారు" వచ్చుచున్నట్లున్నాడు.

( ప్రవేశము అధికారాభిలాషిగారు. )

అధి—(తనలో) నామిత్రులందరికిని యేవో పదవులులభించినవి. గాని, వీరిరువురు మిత్రులకు మాత్రమింకను ఫలితము కలిగియుండలేదు. కానిమ్ము, త్వరలో కార్యము సిద్ధించును. ( సమీపించి ) మిత్రులారా! యేమియో దీర్ఘాలోచన చేయుచున్నారే?

స్వా—ఓహో! అధికారాభిలాషిగారా! మీగౌరవపదవికి మేమెంతయు సంతసించుచున్నాము. ఏదియో పనిమీద దయచేసినట్లున్నదే ?

అధి—మిత్రమా! నేను మీకొరకే వచ్చుచున్నాను, ఈమహాసభలో మనపని అటో ఇటో తేలును.

సగ—మేమును ఆవిషయమే విచారించుచున్నాము, మనము చేయవలసినపనికి మీ అభిప్రాయమేమిటి.

అధి—ఏమున్నది. మనవారందరిని తయారుచేసికొని సభకు సిద్ధము గాపోయి, సాధ్యమైనంతవరకు గాంధిని గెలువనీయకుండా జేయవలెను. అధికారులు ప్రత్యేకముగా మనతో చెప్పియున్నారు.

స్వా—అధికారులకు మనమిప్పుడు జ్ఞాపకముండవు లెండి. చివరకు మనపని ఉభయసన్యాశం అన్నట్లు అయ్యేటట్లున్నది.

అధి—లేదులెండి. మీా కాభయమక్కరలేదు. మొన్ననే మీా ప్రశంస గూడ వచ్చినది. మనమనుకొనిన విషయము త్వరలోనే అవుతుందిలెండి మీారేమియు తొందరపడనక్కరలేదు.

స—సరే. సభపెట్టుకొనుటలో మీాఅభిప్రాయమేమిటి.

అధి—ఏమోలెండి ఈతడవకు పెనుగులాడి యెట్లాగైన యీసభలో గెలువ ప్రయత్నింతము. అంతగా కాకపోతే మళ్లీవచ్చేనాగపురము కాంగ్రెసుకు మనము పోనేవద్దు. రండు మనమిక శీఘ్రముగపోయి మనకున్న బలంబుల సిద్ధపరచుకొని కాంగ్రెసు సభకు పోవుదము.

(నిష్క్రమింతురు.)

# గాంధివిజయము.

## తృతీయాంకము.

కాంగ్రెసుమహాసభ :—కలకత్తా నగరము.

30000 జనము.

లజపతిరాయి అధ్యక్షుడు:— వేదికపై మహాత్మాగాంధి.—
నెహ్రూ, షౌకతాలి, పాల్, దాస్, మాలవ్యా.
బిశెంటు, సరళాదేవి, వగయిరా.

లజ—మహాజనులారా! విషయనిర్ధారణసభ జయప్రదముగా ముగిసినది. నిర్ణయించవలసిన విషయములన్నిటిని మన నాయకులందరు చక్కగా చర్చించియున్నారు. ఇక తమ యనుమతికై యీ మహాసభయందుంచ వలసి యున్నది. నేటి కార్యక్రమమునందు మహాత్మాగాంధిగారి నూతన సహాయ నిరాకరణ తీర్మానము ప్రాముఖ్యమైనది. ఆవిషయమును చర్చించుటకు పూర్వము, మన దేశనాయకుడును, అఖండ ప్రజ్ఞాధురీణుడును, లోకపూజ్యుడును, లోకమాన్యుడును అగు శ్రీ బాలగంగాధర తిలక్ మూర్తి యవతారమును చాలించి స్వర్గస్థుడైనందుకు విచార సూచకముగ మనమందర మొక్క నిముసము నిలువ బడ వలయును.

(సభలో యావన్మంది తలదుస్తులను తీసి నిలువబడి, లోకమాన్యుని పరమాత్మకు శాంతిగలుగుగాక. "తిలక్ మహారాజుకు జేయ్." అని కూక్పుందురు.)

లజ—తదుపరి మహాత్ముడు నూతనసిద్ధాంతము నుపపాదించును. తామెల్లరు నోపికపట్టి ఆతని సందేశమును చక్కగా గ్రహింతురని వేడుచున్నాను.

(కరతాళములు చెలరేగి మిన్నంట గాంధి లేచుచున్నాడు).

గాం—అగ్రాసనాధిపా! మహాజనులారా! సోదర సోదరీమణులారా! హిందూ మహమ్మదీయ క్రైస్తవ సోదరులారా! నేను తమ యెదుట నుంచబోవు సహాయనిరాకరణ తీర్మానము తమయెల్లరికి నిదివరకే తేటతెల్లమైన విషయము. ఇంతకు పూర్వము సత్యాగ్రహ వ్రతరహస్యములను తామెల్ల రెరిగియేయున్నారు. మనసాంప్రదాయమున కనుకూలమైన సిద్ధాంతమును శ్రీప్రహ్లాదమునీంద్రు డిదివరకే మనకు జూపించియున్నాడు. ఆ మహనీయుని,

సీ॥ కొండలెక్కించి పైనుండి క్రిందబడంగ
మించుకోపమున డొల్లించువేళ
హరిదల్ప వలదంచు కరిపదంబుల ద్రోసి
మట్టించి కడుహింస బెట్టువేళ
బడబానలంబున బడద్రోసి మంటల
కాహుతిగా జేయు నట్టి వేళ
కత్తికటారుల గరముల బూని పై
పైకి రక్కసి మూకదూకువేళ
తే॥ పైబడెడు దెబ్బలన్ని పుష్పములుగాగ
కత్తిపోట్లు ముత్తైపుసరుల్ గాగ మూర
"హరిహరీ" యంచు నుంతేని వెరపులేక
శాంతిమార్గాన నెవడు మోక్షంబుగనెనో
అట్టి ప్రహ్లాదు సత్యాగ్రహవ్రతంబె
రాజమార్గంబు హైందవనైజమునకు.

దేశమున స్వరాజ్యసంపాదనకయి యిప్పటికెన్నేండ్లనుండియో అనేకరీతుల ప్రయత్నించుచున్నాము. కాని అన్ని యత్నములు విఫలములయ్యెను.

తే॥గీ॥ సర్వవిధముల యత్నముల్ సలిపి సలిపి
విసికి వేసారి ప్రాణంబు; స్వేచ్ఛగాంచు
నాశ లేదు పూర్వపుదారులందు జనిన,
జగతికెల్లను మార్గదర్శకముగాగ
నాసహాయ నిరాకరణంబనంగ
నూతనపథంబు మనకు జేయూతనొసగి
కార్యసిద్ధియొనర్చెడు నార్యులార!

సీ॥ గౌరవబిరుదముల్ కాంక్షించుటొక్కటి
సర్కారువిందుకు జనుటయొకటి
పిన్నవయస్కులపిల్చి పిచ్చిగజేయు
విద్యాశ్రమమకు వెళ్ళుటొకటి
న్యాయంబుపేర నన్యాయంబుగావించు,
కోర్టులపైగల పిచ్చికోర్కె యొకటి,
ప్రజల దాస్యముదృఢపరచు నూతనచట్ట
మేసర్వమిడునన్న యాసయొకటి
ఇన్ని యేటికి, మనమేమైననరె స్వరా
జ్యముగోరు రాజ్య సంబంధమొకటి

గీ॥ భరతభూమికిగౌరవ పాత్రములగు
విషయములుగావు వానిని విడువవలయు
జగతిలో మనజన్మ దేశంబుగూడ
పరువుమర్యాదలనుగల్గి బ్రతికియుండె
ననుచు రూఢిగా దెలియజేయంగవలయు.

ఇది యిది అననేల, ప్రభుత్వమునకు తోడ్పడుటే నిరాకరించవలయు. ఆవిధి ఆసేతు హిమాచల పర్యంతమాచరింపెద రేని,

చ॥ అరయుడి యొక్కవత్సరసహాయ నిరాకరణంబు వింతలన్
జరుపు, స్వరాజ్యమప్పుడెవశంబు, ననర్థకభిన్నభావముల్
మరచియునైకమత్యమున మాతృధరాస్థలి సేవజేసినన్

సరియగు నాదుపద్ధతియె చాలిన యాయుధమిప్డు నమ్ముడీ.

సభ్యులారా! ప్రస్తుతమింతకన్న యెక్కువగా చెప్పుటకు నాకేమియు లేదు. నామిత్రులనేకులు భిన్నాభిప్రాయములనుగలిగియున్నారు. వారెల్లరు తమతమ యుపన్యాసములగావించినపిదప నాసంకల్పమును మార్చుకొనుటయో, లేక వారికిప్రత్యుత్తరమిచ్చి మీయంగీకారమును వేడుటయో జేసెద. ఇప్పటికింతటితో సెలవుగైకొనెద.

(కరతాళములు)

లజ — నెహ్రూగారు యీతీర్మానమును బలపరచెదరు.

నెహ్రూ — అగ్రాసనాధిప ఆర్యులారా,

ఈతీర్మానమునకు మీయంగీకారమును గోరుటకుముందుకొన్ని ప్రశ్నల నడిగెద. భారతీయులారా, వేపురుపంజాబు సోదరుల నిష్కారణముగ వధింపుటచే రక్తశిక్తమైన హస్తములతోడ మీభుజములపై తట్టి పిల్చుచుండ మీరంగీకరించి పోయి శాసనసభల గూర్చుండ నిచ్ఛగింతురా?

సభికులు. లేదు. లేదు.

నెహ్రూ — అసత్యములాడ నణుమాత్రమైన జంకులేక మహమ్మదీయ మతమునకు ఘోరమగు నన్యాయముచేసిన ప్రభుత్వమువారి న్యాయస్థానములకేగ నపేక్షించెదరా?

సభి — లేదు. లేదు,

నెహ్రూ — బుద్ధితెలియని పసిపాపల నకారణముగ గుఱ్ఱపుకొరడాలతోమోదియు, మండుటెండలో పదునారుమైళ్ళనడిపించియు పలుకష్టములుబెట్టిన వారి పాఠశాలలకే మీబాలురనంపి ఆత్మగౌరవమును ధ్వంసము చేసికొన నిష్టపడెదరా?

సభి — లేదు. లేదు.

నెహ్రూ— లేనిచో, యీ సహాయనిరాకరణ వ్రతము నవలంబింపుడు. ఇట్టి ఘోరకృత్యము లికెప్పుడు జరుగకుండుటకు స్వరాజ్యమ త్యవసరమనిబయలుదేరుడు. గాంధిమహాఋషి వాక్యములు వేద వాక్యములుగా గ్రహించి యీతీర్మానము నంగీకరింపుడని మి మ్ముల కోరుచు నా ఆమోదమును వెలిబుచ్చుకొంటిని.

(కరతాళధ్వనులు.)

లజ— పాల్ గారీతీర్మానమునకు సవరణ నుపపాదింతురు.

పాల్— అగ్రాసనాధిపా, మహాసభ్యులారా, నేనును సహాయనిరా కరణ సూత్రము నామోదించువారలలో నొకడను. కాని ఆచ రణ యందించుక మార్పు జేయు నావశ్యకంబెరింగి కొన్ని సవ రణలను జేయనెంచితి. నేనొక్క మనవిని మాత్రము చేసెదను.

తే॥ గీ॥ గాంధిమహానీయునకు మిన్నగానుగాని
యైన నాకేదితోచు నయ్యదియె దెలుప
సాహసంబున పెద్దలసమ్ముఖమున
బలుకనెంచితి క్షమియింపవలయుసుండు॥

నేజేయు మనవి యేమనగా?

చ॥ తిలకుమహానుభావుండనుమతించిన నూతన చట్టపద్ధతిక్
సలుపుట పాడియౌనిక, విచారణ సేయుడు నాదుభావముల్
తెలుపుదమాంగ్ల దేశమున తెల్లముగా కడసారి “భారతీ
యులకు స్వరాజ్య మిప్పుడిడకుండిన నూతన గాంధిమార్గమే
గలదని” యింతలో దగిన కాలముగల్గును దేశ శత్రుకై।

మనమీ నూతన సిద్ధాంతము నమలులో పెట్టుటకు పూర్వము ఆంగ్ల దేశమునకు స్పష్టముగా మనయుద్దేశము తెలియజెప్పి మన ఆఖరుఆశ తీర్చుకొందము. ఈలోపల దేశమును బాగుగ తయారు చేయవచ్చును. శాసనసభలను ఇప్పుడే బహిష్కరించుటకన్న శాసన సభలలో నుండియే ప్రభుత్వము నాటంకపరచుచు ప్రతిఘటనము

నల్పుచుండుట శ్రేయస్కరమని నేను గట్టిగా నమ్ముచున్నాను. ఇందు మూలమున నన్న న్యథాతిలంపకుండురని వేడుచున్నాను. పంజాబుదురంతములును, మహమ్మదీయుల ఇక్కట్లును, నామనంబునుండి వీడిపోజాలవు. కాని ఆచరణయోగ్యము నెరిగి యీ సవరణను మీరాఆమోదమునకై సమర్పించుచున్నాడను. (కరతాళధ్వనులు)

లజ— తరువాత చిత్తరంజనదాసుగారు సవరణను బలపరుచుదురు.

దాసు— అధ్యక్షుకా, సభాస్తదులారా, నామిత్రుడు చంద్రిపాలుని కన్న నేనెక్కువగా జెప్పనావశ్యకము లేదు. స్వరాజ్య సంపాదనకు మేమెల్లరమును సంసిద్ధులమై యున్నాము. కాని, ఎద్ది సత్వర స్వరాజ్యప్రాప్తికి సరియైన మార్గమా యని విచారించుచున్నాము. కావున నేచేయుమనవి యేమనగా,

మ॥ గురువర్యుండు తిలక్ మహానృపుడు మీకున్ మాకు దేశంబుకున్
సరియౌమార్గముజూపియేగె, నతడేసందేశముల్ దెల్పెన
త్తెరగున్ సేయుట యుత్తమంబనుచు ప్రార్థింపంగ నే వచ్చితిన్
సరసుండుత్తమ గాంధిసన్ముని పరిశంసార్హ్మాంశటం చెంచియున్॥

కావున తిలకు మహారాజుగారి అభిప్రాయములపై నాధారపడి యున్న మా సవరణను తామందరంగీకరించెదరని ప్రార్థించి యింతటితో విరమించుచున్నాను,

(కరతాళములు)

లజ— తరువాత షౌకతాలీగా రుపన్యాసమును గావింతురు.

షౌక— అధ్యక్షుకా, గాంధిమహాత్మా, హిందూమసల్మాన్ సోదర సోదరీమణులారా! నేటి యీ మహాసభయందు మన యిరు తెగలవారమును కలిసిమెలసివర్తింపుచున్నందుల కెంతయు సంతసించుచున్నాడను, కాని,మనదుస్థితినిగూర్చితలచుకొన్నపుడెల్లను

హృదయవేదన రగుల్కొనిపోవుచున్నది. అయ్యా, మన స్థితిని
కూర్చి యించుక గమనింపుడు,

సీ॥ కరకుకత్తులబోలు తురకబిడ్డలనెల్ల
చెరలలో వలమూసి యణచినారు
నైజవిక్రములైన రాజపుత్రులనొక్క
బోనులో పడద్రోసి మూసినారు
భీమ బలాఢ్యులై పేర్కొన్న ఘూర్ఖులన్
కాళ్ళచేతుల కంట గట్టినారు
వాక్ప్రౌఢిమన్ గన్న వంగదేశజులకు
గుడ్డలు నోటిలో గుక్కినారు
రణసింహులైన యారణజిత్తు సంతతిన్
కాళ్ళ సంకెలలచే గట్టినారు

గీ॥ పడుచుమొగలకు గాజులుదొడగినారు
ముసలులకు నోళ్ళుగట్టిగా మూసినారు
బుడుతలనుగూడ బంధింప గడగినారు
కటకటా! కష్టమింక దుర్ఘటము సైప
మాతృసేవా పరాయణ మానసులయి
నడుములుబిగించి సేవకై నడువరయ్య॥

సీ॥ ధర్మమార్గాను వర్తనమున్ బాలించు
రాజులవంశముల్ రాలలేదు,
మిన్నుమన్నుగజేసి మన్నుమిన్నుగచేయు
మంత్రివర్గంబెల్ల మాయలేదు,
బలపరాక్రమముల నిలయమై వెలసిన
క్షత్రియాంకురమింక చావలేదు,
భక్తియుక్తులు మంత్రశక్తిగల్గు మహాత్మ
దీయవంశము పృథ్వి బాయలేదు.

తే॥ గీ॥ కటకటా! కాని కాలంబు గలిగెగాన
నివురుగప్పిన నిప్పుగా నెగడినాము

సిపురుద్రోసి నిజాగ్నిగన్పింపజేయ
మాతృసేవాపరాయణ మానసులయి
నడుములు బిగించి సేవకై నడువరయ్య!

నేడు మామహమ్మదీయ మతమునకు గొప్పవిప్లవము వాటిల్లినది. తుర్కీరాజ్యము ధ్వంసమగుటకు సంసిద్ధమైనది. మేము హిందూదేశమున జన్మించినను, ఎచ్చటనున్నను, మా మతధర్మములను విడిచి చరింపజాలము. ఈఖిలాఫత్ వ్యవహారము తుర్కీదేశస్థుల కెంత సంబంధించియున్నదో, ఈదేశముననున్న 7 కోట్ల మహమ్మదీయులకును, ఇంక ఏదేశముననైనను గల మహమ్మదీయులకును అంతే సంబంధించి యున్నది. ఈవిషయములో మాకనుకూలముగ మాఖిలాఫతున కేమి అవమానము లేకుండ పరిష్కారమగు వరకు మాజాతికిక నిద్రబట్టదు.

చ॥ మతవిషయంబులందు ననుమానమి కేటికి ప్రాణముండనే
ని తురకజాతిహైన్యమవనిఁ భరియింపదు నేటిమాఖిలా
ఫతు వ్యవహారముల్ సరియవశ్యము సల్పినగానిస్వాంత మి
ట్లతిగదపించుటోర్చుకొన దంతనెన్నేహము మాకు నేరికిఁ!

ఓ హిందూసోదరులారా! మిమ్ము నెంతమాత్రమును నిరసించుచుంటి ననుకొనకుడు. మాకు సహాయభూతులయి మాతోపాటు కార్యసిద్ధికి గడంగిన మీ కెంతయు కృతజ్ఞతాపూర్వక సలాము లొనరించుచున్నాను. పంజాబునందు జరిగిన దురంతములు మన అందరికిని నిరంతర హృదయవేదన గలిగించుచున్నవి. ఈవిషయములకు తగిన పరిహారము జరుగువరకును, ఇట్టి విపరీతము లింకముందు జరుగకుండుట కావశ్యకమయిన స్వరాజ్యము ప్రాప్తించువరకును మనకు శాంతము గలుగదు. మన మిరుతెగలవారమును క్షీర నీరములవలె కలసిమెలసి వర్తించిన జయము నిశ్చయము. గాంధిమహాత్ముని సహాయ నిరాకరణ తీర్మానమే మనకు శరణ్యము. నేనన్యథాతలంచి, శాంతి

మార్గమున ముక్తిగలుగనేరదని అనుకొనిన వారలలో నొకడనేగాని, యీమహాత్ముని యుపదేశముల వలన నాఅభిప్రాయమును విడిచితిని. సహాయనిరాకరణమే మనకుగల ఆయుధమని గట్టిగా నమ్ముచున్నాను. కావున నామహమ్మదీయ సోదరులును, హిందూసోదరులును, ఎల్లరును ఈతీర్మానమును సంపూర్ణముగా నంగీకరించి తక్షణమే ఆచరణలో బెట్టెదరని ప్రార్థించుచు, నింతటితో విరమించుచున్నాను.

(కరతాళములు)

లజ—తరువాత బిశెంటుదేవి యుపన్యాసమును గావించును. తామెల్లరును సావధానచిత్తులరై యాలకించెదరని వేడుచున్నాను.

బిశెంటు—(నిలువబడగా సభలో కల్లోలము)

లజ—నిశ్శబ్దముగా విందురని మరల వేడుచున్నాను. ఎవరినైనను సావకాశముగా వినుట ఉత్తమధర్మము.

బిశెంటు—సభాధ్యక్షకా, సోదరులారా.

(మరల గోల)

మాల—సభాసదులారా! తమకిది న్యాయముకాదు. భిన్నాభిప్రాయము జూపునంత మాత్రమున యేరిని గేలిసేయుట పాడిగాదు. ఇంతకన్న నెక్కువగా జెప్పగలిగిన వాడనుగాను. దయచేసి ఓర్పుతో నామెజెప్పు విషయములు విందురని ప్రార్థించుచున్నాను.

బిశెం—మహాజనులారా! నే నీతీర్మానమునుగాని, సవరణనుగాని అంగీకరించువారలలో జేరినదానను గాను.

(మరల గోల)

గాం—మహాజనులారా! మీకిది న్యాయము కాదు. బిశెంటుదేవి దేశమున కెంతయో సేవజేసినది. నేడు భిన్నాభిప్రాయమును జూపినంత మాత్రమున యామెను మీరిట్లునిరసింపరాదు. ఎట్టి

వారికిని స్వేచ్ఛగా మాటలాడు నవకాశము గావలెననిగదా మీరు గోరుట. అట్టియెడ మీరిప్పుడామె యిష్టానుసార మామెను మాటలాడనీయనిచో మీరే మీరు హానిజేసికొనిన వారగుదురు. దయచేసి ఆబిడ చెప్పునదంతయు సావకాశముగా విందురని నమ్ముచున్నాను. (నిశ్శబ్దము)

బిశెం—నిశ్శబ్దముగా నున్నందుకు మీకువందనములర్పించుచున్నాను.

సీ॥ జననమొందినదాది క్షణమైన విడువక
ప్రజలక్షేమంబుకై పాటుబడితి,
మీదేశమనకేగు నాదిగా మీక్షేమ
మునకు ప్రాణము ధారపోయుచుంటి
దేశదేశంబులు దిరుగాడి ప్రతిచోట
చేయగల్గినదెల్ల చేసియుంటి,
నాజీవముండగానే జయించి స్వరాజ్య
మును కండ్లజూడగా గోరుచుంటి

గీ॥ నాస్వదేశంబు నాయూరు నాదుజనులు
నాదుసర్వస్వమును విడనాడి మీకు
సేవసేయంగ నిచటికి జేరియుంటి
అట్టి నన్నాదరణ సేయంగదగు నె॥

ప్రస్తుత రాజకీయవిషయములలో నాకు భిన్నాభిప్రాయమున్న దనుట వాస్తవము. ప్రజలు మూఢాంధులై తప్పుదారుల బట్టుచున్నారని నేను గట్టిగా నమ్ముచున్నాను. నాశౌచ విషయము హాస్యాస్పదముగా నున్నది.

మ॥ భళిరే! వత్సరమొక్కటే గడచులో స్వాతంత్ర్యమిప్పింతు నం
చలచాదస్తుడు మీకుబల్కుటయు, వహ్వా! యెంతసుజ్ఞానవం
తులు మీరందరు దానినమ్ముటయు, నెంతో వింతగానుండె చాల్
బలుకన్ సిగ్గగుచున్నదేటి కటులన్ వాపోవుటల్ వెఱ్ఱిమై॥

ఎన్నోయేండ్లనుండి, ఎంతమందియో తీవ్రప్రయత్నముల జేయగా

మనకీ నూతనచట్టము లభించినది. ఇదియే మనకు స్వరాజ్య ప్రారంభము.

చ॥ పరమదయాళు లాంగ్లజనపావను లెల్లరు నూత్నచట్టముర్
వరమణిగా నొసంగిరి యవశ్యము దానిని స్వీకరించి య
ల్లరులకు పాలుగాక జనులన్ వ్యథఁబెట్టక పోయిజీవనం
బరయుట శ్రేయ మెల్లరికి నప్పుడె స్వేచ్ఛయు గల్గునమ్ముడీ॥

నేను జెప్పువిషయములు మీకిప్పుడంతగా రుచింపక పోయినను ఒకప్పటికైన మీరు విచారింపక పోరు. ఎవరో చెప్పిరని మీమీస్వబుద్ధులను విడనాడుట బానిసత్వము. బానిసత్వమునుండి విముక్తులగుటకు కోరుచు, బానిసలుగానుండుట చాల విచారకరముగ నున్నది. ఈతీర్మానమును గాని సవరణనుగాని అంగీకరించుట క్షేమకరము గాదని మరల నొక్కివక్కాణించుచు ఇంతటితో విరమించుచున్నాను.

లజ—తరువాత శ్రీమతి సరళాదేవిగారుపన్యసింతురు.

సరళా— అధ్యక్షుకా! సోదర సోదరీమణులారా! జడివానకురిసి చల్లారినది. అయినను మనపై నేకధారగా గురియుచున్న దుండగ మను జడివాన యింకను చల్లారకున్నది. బిశెంటు వాక్కులు మనకిప్పుడంతగా రుచింపకపోయినను, ఒకప్పటికైన వానిమాధుర్యము నెరుగుదుమని యాదేవి సెలవిచ్చెను. అట్లే రాచవుసిరిఫలమును భుజించునపుడు వగరుగాదోచినను తదుపరి మంచినీరు దాగినను పానకముగా రుచించును. కావున వుసిరిగ ఫలమునుబోలు బిశెంటువాక్కుల రుచిగొనినపిదప మంచినీళ్ళవలె నిస్సారములైనను నావాక్కులుగూడ రుచించునను ధైర్యముతో మీయెదుట బల్కుటకు సాహసించితిని.

ఆర్యులారా! మీపూర్వ వైభవము నించుక స్మృతికిదెచ్చు కొనుడు.

సీ॥ దనుజాధములను వాక్కునఁగూల్చునల పతి
వ్రతల మహాత్మ్యమీవసుధ లేదె
ముల్లోకములనేలు మునుల శాపాయుధం
బుల పటుత్వంబిందునిలచి లేదె
పటుపరాక్రమశాలి పరశురాముని నాటి
ధైర్యసాహసములీధాత్రి లేవె?
పెనువిపత్తులు సంభవింపగా నవతార
మెత్తి బ్రోచిన హరి యిపుడు రాడె

గీ॥ ధర్మమేజయమనెడు పద్ధతి వహించి
పట్టువిడువక కార్యసాఫల్యమునకు
పాటుపడరయ్య స్వామిపై భారముంచి
హైందవులు వేగస్వాతంత్ర్యులగుదురవని॥

శా॥ ఎందున్ జూడ స్వరాజ్యరాష్ట్రములు నేయే జాతులున్ వర్తకం
బందున్ మేటిదశన్ వహించుటయు నీప్రాయంబునందక్కటా
హిందూసుందరి యెందుడాగె? సమయంబే తెంచెనిప్పట్ల నో
హిందూనందనులార లెండు, వడిరండీ, మాతృసేవార్థమై॥

శా॥ కందోయిన్ దనపుత్రులన్ గనుచు సౌఖ్యానందముల్ బొందుచున్
డెందంబందు చికాకెరుంగకయె బల్ శోభన్ విరాజిల్లు నా
హిందూసుందరి యెందుడాగె సమయంబేతెంచె నిప్పట్ల నో
హిందూనందనులార లెండు వడిరండీ, మాతృసేవార్థమై॥

శా॥ ముందే మేమని హిందువుల్ నడువ మేమున్ ముందుగాకున్నచో
బందెంబంచు మహమ్మదీయులొక చెంపన్ రూఢిగాబల్క నా
ముందేసిక్కులు పారశీల్ నడువ, మేమున్ మేముమేమంచు నా
నందంబొందుచు మాతృసేవకయి పూర్ణస్వేచ్ఛమైనుండు నా

హిందూసుందరి యెంచుడాగె సమయంబే తెంచె నిప్పట్లనో
హిందూనందనులార లెండు వడిరండీ మాతృసేవార్థమై॥

సభాసదులారా! గాంధి మహాత్ముఁడు తన యుద్యమమునందు ఆడువారికి అవకాశమెక్కువగా గలిగింపనందులకు చింతిలుచున్నాను. మీకొక్కవిషయమును మనవి జేయుచున్నాను.

సీ॥ నరకాసురుని వధింపగ కృష్ణుడేగుచో
సత్యమే యాలంబు సలుపలేదా,
పరమేశు నర్ధాంగి పార్వతిసర్వదా
భర్త చెంతనె నిల్వబడగలేదా,
అతిసాహసముబూని పతికయి సావిత్రి
యమునితో పరలోక మరుగలేదా,
తపభక్తిశక్తిచే ద్రౌపది శ్రీకృష్ణు
ప్రత్యక్షునిగ జేసి ప్రబలలేదా,
(పురుషుల నుద్దేశించి)
గీ॥ భారతీయాభ్యుదయమందు పాల్గొనంగ
ఆడువారికి మీయంత హక్కుగలదు ;
(స్త్రీల నుద్దేశించి)
స్త్రీజనములార నిద్రబోఁజెల్ల దింక
దేశసేవారతులరఁయి తేజరిలుడు॥

సీ॥ అక్కలారా! ఇంకనైన మీపతులు న్యా
య స్థానముల కేఁగుటాపరమ్మ
అమ్మలారా! మీప్రియతనూజులను పిల్చి
పిండెడు విద్యమాన్పింపరమ్మ
సోదరీమణులార! మీదుసోదరులకు
గాంధిసందేశంబు గరపరమ్మ
భారతీదేవి పుత్రీరతనములాగ
మాతృదౌర్భాగ్యంబు మాన్పరమ్మ

తే॥ గీ॥ తనయులుద్యోగములు జేసి దాస్యవృత్తి
ధనమునార్జింతు రను నాశ గొనకుడమ్మ
మాతృదేశాభిమానంబు మానసముల
వెలయగా బిడ్డలనుప్రేమ బెంచరమ్మ॥

కీర్తన.

"వినుతసుగుణశీల" మోస్తరు.

వినుడు సుగుణులార, నావిన్నపమును మీరు
మనవిజేసెద మీదేశము మరువకండికను మీరు॥ వి॥
మానంబెటులైనను గాపాడుకొనవ
లయు; ఆపైనభువి స్వేచ్ఛగాంచు భాగ్యము లభియించు ఈ
ప్రాణంబులికెందుకు మనభారతిసేవింపకనిం
కేనాటికి కరుణ నాయీశ్వరుడిద్ధర గనునో॥ వి॥
ఇలకు మన సేవసేయుటింకను గావలయు రా
గలజన్మజన్మములసుఖంబుగోరగవలయు॥ వినుడుసుగుణు॥

కావున, పిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు, హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు— ఎల్లరును ఏవిధమైన భేదములను విడనాడి, యీ మహాయజ్ఞ సమయంబున గాంధిమహాత్మునకు తోడ్పడెదరని ప్రార్థించుచున్నాను. (కరతా॥)

లజ॥ తరువాత పండిత మదనమోహన మాళవ్యాగారుపన్యసించెదరు.

మాల॥ (కరతాళధ్వనులు) అగ్రాసనాధిపా! ఆర్యులారా! తామెల్లరు శాంతభావముతో నేజెప్పువిషయములన్నియు విందురని ప్రార్థించుచున్నాను. సహాయనిరాకరణ సిద్ధాంతము నామోదించువారలలో నేనొకడను. కాని, ఆచరణ భాగమునందించుక భిన్నాభిప్రాయమును గలిగి యున్నానని మనవిజేయుచున్నాను అట్లని నన్నువ్యథా తలంపవద్దు,

సీ॥ పంజాబుహత్యలు ప్రజలశోకాబ్ధిలో
ముంచెనం చెరుగకపోవలేదు,

తుర్కీసమస్య హిందూమహమ్మదుజాతు
లనుకలంచు మెఱుంగననియుగాదు,
దేశపరిభుత్వంబు జేసెడు కృత్యంబు
లతిఘోర మంచెఱుంగకయుగాదు,
స్వాతంత్ర్యసిద్ధిసత్వరమ ప్రాప్తించు నా
వశ్యకం బెరుగని వాడగాను
గీ॥ అన్ని విషయము లెఱిగియే యున్న వాడ
గానిసత్వవిముక్తి సంప్రాప్తమగుట
యెన్నడాయని కడు వేచియున్న వాడ
కాని యెద్దిదేశక్షేమమౌనో యెఱిగి
అటులవర్తింప నాతురమందువాడ॥

మరియు,

చ॥ భయపడి వెన్కదీసెడు స్వభావము నాయదిగాదు దేశసే
వయె ననుగోరనేని యిదె ప్రాణములీయగ సిద్ధమైతి, సం
దియముల బారదోలక యనిశ్చయ మార్గము జొత్తుమేని యెం
తయు దలక్రిందులౌదుము, యదార్థమెఱింగియె సంచరింపుడీ॥
మ॥ ఇపుడో యింకొకకొన్నిరోజులకో వారేవారిదుశ్చర్యలన్
విపరీతంబులుగా నెఱింగి యుపశాంతిన్ జేసికోవచ్చు, మీ
రిపుడీ తీవ్రపుచర్యలన్ సలుప నేదెబ్బనో మున్ముందికే
విపరీతంబులు పుట్టనున్నవియొ మీవిధ్యుక్తముల్ నిర్ణయిం
చి, పనిన్ సల్పుడు దేశసౌఖ్యమిపుడే చేకూరునట్లయ్యెడన్॥
గీ॥ గాంధీమహానీయు నేనెఱుగనొకో, అతడు
మానివర్యుండు, శక్తిసామర్థ్యములను
వెలుగులేకుండ వెలిగెడు వీరమూర్తి;
ఆమహాత్ముని జ్ఞానమహత్తు జగతి
సర్వసామాన్యులకుఁ గల్గసాధ్యమగునె
యనెడుభీతి బాధించు సన్నార్యులార॥

కావున, మన శక్తిసామర్థ్యముల ననుసరించియు, దేశక్షేమమును మరువకయు, ఆచరణయోగ్యము లెరిగియు, మన కనుకూలమగు మార్గమున వర్తించుట శ్రేయస్కరము. తిలక్ మహామహుని అవసానదశయందాయనను జూచుభాగ్యము లభించెను. అప్పుడాయన జాతీయవాదు లెవరును శాసన సభలను బహిష్కరింపరాదని స్పష్టముగా తెలియజెప్పెను. ప్రస్తుత తీర్మానవిషయములో చంద్రపాలుని సవరణయే నాభావముల కనుగుణ్యముగ దోచుచున్నది. కావున తమరెల్లరు నాసవరణ నంగీకరింతురని వేడుచున్నాను. దేశభారమంతయు ధరించెడు నీమహాసభను జయప్రదముగా నెరవేర్చెదరని నమ్మి నను నింతటితో విరమించుచున్నాను.

లజ—మహాసభ్యులారా! తీర్మానము విషయమును, సవరణనుగూర్చియు చర్చ బాగుగ జరిగినది. వివిధనాయకుల యభిప్రాయములన్నియు బయల్పడినవి. ఇప్పుడు గాంధిమహాత్ముడు తన కడపటి యుపన్యాసమును గావించినపిమ్మట, మీయందరియనుమతులును లెక్కింపబడును. గాంధిమహాత్ముడు తన రెండవ యుపన్యాసమును గావించెదరు.

గాం—ఆర్యులారా! సోదర సోదరీమణులారా! హిందూముసల్మాను సోదరులారా! నామిత్రులెందర నేక విధంబుల భిన్నాభిప్రాయముల వెలిబుచ్చిరిగాని, మదీయోద్యమమును మార్పుజేయగల ప్రతివాద మొక్కటియును వినియుండలేదు. కొందరు నాయుద్యమ మసాధ్యమని యందురు. అసాధ్యమనగా నర్థమేమియో నెరుంగవలయును. ప్రయత్నించినను చేయలేనిది యసాధ్యము. మన ప్రస్తుత యుద్యమమట్టిదిగాదు.

మరియు ప్రభుత్వముపట్ల మన అయిష్టము ననేకవిధంబుల దెలుపవచ్చుననియు, సహాయనిరాకరణము వలన నెక్కువయేమియు గలుగనేరదనియు కొందరందురు.

మ॥ అలపంజాబున స్త్రీలు బిడ్డలను వ్యత్యాసంబులేకే తుపా
కులగాల్పించిన క్రూరచర్యలకునై రోషంబు; నిస్లాం తనూ

జులకుఁ జేసిన ద్రోహభావమునకుఁ జూపించు రోషంబు మా
టలసాధింతురే? భారతీయుల ప్రతిష్ఠఁ నిల్ప యత్నింపరే॥

పంజాబు దురంతము లోకచెంప నిరంతర హృదయవేదనను గలిగించుచుండ, రెండవ విషయమగు ఖిలాఫతు వ్యవహారము త్రోసివేయ దగినది కాదు.

చ॥ అరయమహమ్మదీయులును హైందవులిద్దరు నేత్రియుగ్మమై
వరలుదు, రందునొక్కరికి బాధలు రెండవవారివౌను, వీ
రిరువురు నైకమత్యమున నేకముగా విహరింపకున్న, పొం
దరికస్వరాజ్యమెన్నటికి దాస్యవిముక్తియు గల్గదెప్పుడుఁ॥

ఇప్పుడు మహమ్మదీయమతమునకు గొప్పవిప్లవము వాటిల్లినది ఈ సందిగ్ధసమయమున వారివిషయము మన విషయముగా గ్రహించి వారికి తోడ్పడవలసిన భారము మనయందున్నది. నూతన చట్టమును గురించి యించుక ముచ్చటింతము:—

తే॥ గీ॥ భారతీయుల రక్తప్రవాహమందు
తడిసినకరంబులఁ ప్రసాదమ్ము నొసంగ
రుచికరంబౌనె మీరెఱుంగవలయు
వరమణిగ నూత్నచట్టంబు నరయ నంత
రాత్మ యొప్పునే, పంజాబుహత్యఁదలప॥

కొందరు మిత్రులు శాసన సభలయం దేమియో తలక్రిందులు చేయవచ్చునను వ్యామోహమునఁబడి యున్నారు. ఇప్పటికిన్ని యేండ్లనుండియు శాసన సభలేమి జేయగలిగెనో ఇకముందు నంతే జేయగలవు. అదియునుగాక,

గీ॥ గడియ యేడాదిగాఁజూడబడుచునుండు
కాలమందున రిక్తతర్కంబులందు
విందులఁ జేరి సంతసమొందుటందు
కాలమును వ్యర్థబుచ్చగాఁగలమొయిపుడు॥

శాసనసభలెట్లు బహిష్కరింప బడవలయునో, న్యాయస్థానములును, ప్రభుత్వ విద్యాలయములు నట్లే తక్షణము బహిష్కరింప బడవలెను. న్యాయస్థానము లను పేరుగలిగి అన్యాయస్థానములుగ సార్థకమై యున్నవి. ప్రస్తుత న్యాయస్థానము లన్యాయస్థానములు గాక మరియొకటి గాదని అందరును ఆమోదించు విషయమే. అది గాక, దేశసేవ జేయుటకు న్యాయవాదులకు తదితరులకన్న నెక్కు డవకాశములున్నవి. కావున సత్వరముగ న్యాయవాదులు తమ తమ వృత్తులను మాని దేశసేవకై గడంగవలయును.

ప్రస్తుత విద్యాలయములు భారతీయులను జేయు విద్యాలయములుకావు. పాశ్చాత్య పద్ధతులపై నాధారపడిన విద్యాలయములు. అచ్చటివిద్యార్థులు దిట్టమైన నౌకరులయ్యెదరుగాని చక్కని స్వాతంత్ర్యము ననుభవించుచు, పౌరత్వపుహక్కుల గాపాడుకొనుచు స్వేచ్ఛగా జీవించు దేశభక్తులు గాజాలరు. కావున ప్రస్తుత రాజకీయ సంపర్కముగలవిద్యను సత్వరము విసర్జించి పవిత్రవంతులు గావలెను.

మరియు, నామిత్రులు కొందరు కొన్నిసందర్భముల యందు తిలక్ మహాత్ముని నామము మదీయోద్యమమునకు వ్యతిరేకముగానుపయోగించిరి. ఆమహారాజు వాక్కు వేద వాక్కుగావున నామిత్రులకుగల దురభిప్రాయమును సవరింపవలయును. ఆయన అవసాన దశయందాయనను జూడగా, మహమ్మదీయులందరును సహాయ నిరాకరణ సిద్ధాంతము నాచరణలో బెట్టుటకు సిద్ధమైన, తానును తన పక్షమువారును తప్పక వారితోపాటు వర్తింతుమని సెలవిచ్చిరి. అట్టియెడ నామిత్రులకేల యీదురభిప్రాయము గలిగెనో ఆశ్చర్యముగానున్నది. ఈ విషయమున ప్రజలకు నిజము గనపరచవలయును.

( కనులు మూసికొని ఆకసమువంక జూచును. )

లజ—ఏమిది ! గాంధిసోదరు డాకసముతో సంభాషించుచున్నాడు.

[ఇచ్చట గాంధి పరమేశ్వరునిగూర్చి ధ్యానించుచున్నాడు.]

(తిలకు. పరమేశ్వరులోకశేయని యూహించుసది.)

గాం—మిత్రా! సాక్షాత్ విష్ణుసన్నిధానమున విశ్రాంతి నొందుచున్న నీ యంతరాత్మ కిసుమంత చలనము గలిగించినందులకు క్షమింపవేడెదను. నీయుద్దేశము నెరింగియే మదీయోద్యమమును ప్రారంభించి యుంటిని. కాని మదీయ మిత్రులు కొందరు దురభిప్రాయమును గలిగియున్నారు.

మిత్రా!

మ॥ భవదీయాజ్ఞ నతిక్రమించియెపుడుఁ వర్తింపగాలేదె యు
ద్ధి విధానంబో యెరింగి మీరిడినసందేశంబుగావించి, తీ
భువివాటిల్లును లేనిపోని కలుషంబుల్ లోకమాన్యుండు వే
రె విధానంబును దెల్పెనందు రిట తండ్రీ తెల్లముఁ జేయవే॥

గీ॥ భారత పిశాసలక్ష్మికి బట్టుకొమ్మ
సత్వర స్వరాజ్యంపు నిశ్చయపదంబు
నా "సహాయనిరాకరణంబు" దీని
ననుమతింపంగ నీసభ్యులందరెదుట
వచ్చి వేదవాక్యంబులఁ బలుకుమయ్య॥

ఏమిది మహానుభావుడింకను రాకున్నాడు. నాయందనుగ్రహముతప్పెనా యేమి?

సీ॥ మహాసీయ నిన్నురమ్మని వేడుకొనుచుండ
దయచేయ వింతనిర్దయయటయ్య
అవతారమూర్తిని యాదించినసుగాని
బలుక కుంటివదేమి పాపమయ్య
దివ్యచారిత్రి సందియము బాపగనిన్ను
ప్రార్థించినసు రావు బరువటయ్య
లోకమాన్యా నీదు రాకకై యెదురుచూ
చెదు మమ్ము కనులవీక్షింపవేమి

గీ॥ ఆసలింక నిరాశలజేసికొంటి
కలియుగంబున నేజేయుకార్యమింక
వేరుగాలే దడవులందు జేరుటొకటె
హాతిలక్ మహారాజ రావయ్య వేగ॥

(గాంధి ధ్యానము నభినయించును.)

( తెరలో— సభాస్థారులారా! పరమేశ్వరుండగు తిలక్ మూర్తి నిదే తలచుకొనుడు. మీ మీహ్మాత్కమలములకు సాక్షాత్కరించి యాపరమాత్ముడేమి చెప్పునో వినుడు. గాంధిమహాత్ముని ధైర్యము వీడనీయకుడు.)

(అందరును తిలకు మహారాజునుగూర్చి చింతించుచున్నారు. జనులెల్లరు విభ్రాంతిజెంద సభలోనొకడు లేచి గడగడ వణకుచున్నాడు. ఆత డావేశుడైనట్లగపడుచున్నాడు. (వళ్ళుపెరుగుట.)

ఆవేశుడు: నన్ను మీరన్యథా తలంచుచున్నారు. నాకు మీ రన్యాయం చేయుచున్నారు. నామనన్ను కనిపెట్టండి.
(అనుచున్నాడు.)

లజ.— ఎవరు నీవు?

ఆవే.—నన్ను మీరు మరచితిరా! నేను తిలకును. నేను తిలకును—
నామాటలువినుడు, నేను మహమ్మదీయులకు చేసిన వాగ్దానము మరచితినను కొంటిరా? నాకును గాంధి మహాత్మునికిని భేదము లేదు. వినుడు.

సీ॥ దౌర్జన్యమును బాపి ధర్మంబునిలుపంగ
పరమౌషధంబయి వరలునెద్ది
బానిసత్వముమాన్పి, స్వాతంత్ర్యగరిమను
స్థాపింప నెద్ది వజ్రాయుధంబు

NATIONAL ARCHIVES OF INDIA

పామరత్వముమాన్పి పౌరత్వపుంహక్కు
పాలింపనెద్ది దివ్యామృతంబు
రాక్షసత్వంబును గ్రాలకుండగజేసి
పరమేశుదెల్పునే పరమపథము
గీ॥ అట్టి పవిత్రము సత్యాగ్రహవ్రతంబు
అట్టి శ్రీగాంధిమాత్మ సిద్ధాంత మదియె
హైందవ స్వరాజ్యసోపానమార్యులార
జాగికేల నధిష్ఠింప సాగరయ్య॥

సోదరులారా !

శా॥ మీలోమీరలు పోరుచుంటకిదియా మేలైనకాలంబు ? క
ల్లోలంబై జగమెల్లతల్లడిలగా లోకంబు స్వాతంత్ర్యతా
లోలంబౌ తరుణంబు మీరిటుల గోల్పోవంగ న్యాయంబొకో
మేలుంగీడును గుర్తెరింగి మనుడీ మీరైకమత్యంబునన్॥

మరియు

క॥ జనవాక్యమె కర్తవ్యం
బను వాక్కులనమ్మి యఖిలహైందవ "కాంగ్రెస్"
జనవాక్యమెరిగి దెలిపెడు
మనవిని శిరసావహించి మనుడీ ఘనతన్

(అని శాంతించుచున్నాడు.) (సభలో "తిలకుమహారాజుకు జెయ్" అనుధ్వనులు మిన్నంటుచున్నవి.)

లజ— సభ్యులారా ! శాంతింపుడు శాంతింపుడు. మహాత్ముని తీర్మానముచాలమంది అధికసంఖ్యాకులచే నామోదింపబడినది. (కరతాళధ్వనులు) ఇక జయప్రదముగా నాచరణలో బెట్టు భారముమీాయందే యున్నది. ఈమహాసభానిర్మితమైన యాతీర్మానానుసారము దేశమంతయు వర్తించునని పరమేశ్వరుని సర్వదా ప్రార్థించుచు నీమహాసభ నింతటితో ముగించుచున్నాను.

NATIONAL ARCHIVES OF INDIA

సేలం. వి.—(లేచి) మహాజనులారా! నేనిదివరకే తీర్మానమునకు ప్రాతికూల్యము చూపినను, జనవాక్యము నామోదించి నాశాసనసభాసభ్యత్వమును వదలుకొనుచున్నాను.

(శ్రీ మహాత్మా గాంధికి జేయ్ అందురు)

కొం. వెం.—ఆర్యమహాజనులారా! నేనును ఇదివరకుకొంతవ్యతిరేకమును చూపినను, నేటినుండి సర్వమును త్యజించి గాంధి మహాత్మునకు తోడ్పడ నిశ్చయించుకొంటిని. మాఆంధ్రదేశమంతయు నట్లేచేయునని వాగ్దానము చేయుచున్నాను.

(గాంధి మహాత్మునకు జేయ్ శబ్దములు చెలరేగ సభ ముగియుచున్నది. పెక్కండ్రు గాంధిమహాత్మునిపై పుష్పవృష్టి గురిపించుచున్నారు.)

[భరతమాతకు జేయ్. హిందూ, మూసల్మానులకు జేయ్]

## చతుర్థాంకము.

### 1-వ రంగము.

(ప్రవేశము మాలవ్యా.)

ఉ॥ కాలముతోడ బోవుటతికష్టతరంబయి తోచుచుండె, నే
వేళకు నిప్పుడేమియొ సవిస్తరతర్క మదిగుర్తెరింగి యా
జాలున బోవకున్న యెడ సాగదొకించుక లోకమిప్పు డిం
కేలనొ నామనంబువిడి యేగవు సందియముల్ బలంబులై॥

కాలము స్వాధీనము తప్పిపోవుచున్నది. సహాయనిరాకరణమందిసుమంతయేని మార్పుజేయకయె మహాసభ అంగీకరించినది. ఈవిషయమున మహాసభ తొందర పడినదని నాఅభిప్రాయము. నిజముగా మహాసభా తీర్మానము శిరసావహించవలసియున్నను, ఈతీర్మాన విషయమును మట్టుకు నాలోచించవలయును. తొందరపడిన ప్రయోజనము కనుపించుటలేదు.

(ప్రవేశము కస్తూరి రంగయ్యంగారు ఆతురతతో)

క—మాలవ్యగారూ! తీర్మానము తలవని తలంపుగా నెగ్గినదండీ ఇక ముందు జరుగవలసినపనికి మీ అభిప్రాయమేమిటి?

మా—నామట్టుకు నేను ఈతీర్మానమును సంపూర్ణముగా నామోదించను. శాసన సభలకేగుటయే కర్తవ్యమని యెంచుచున్నాను.

క—అమ్మయ్య, బ్రతికిపోయితిమి. ఈ సందిగ్ధసమస్యను బాగుగా విప్పి మాకందరకును దారిజూపించితిరి.

మా—కస్తూరి రంగయ్యంగారూ తొందరపడవద్దు. కాలప్రవాహమెట్లు పారునో చూడవలయును.

క—చూచుటకేమున్నది.

చ॥ జనులిపుడంధకారమున సంతసమొందుచు నూత్నపద్ధతిన్
గనులకు గప్పుకొందురిక కాలమొకించుక మారునంతలో
గనపడుదాన లోపములు, గాన, మనంబులజంకకుండ శా
సన సభలందు దూరుటె నిజంబని వెల్లడిసేతమిత్తరిన్॥

నే నిక సెలవుగైకొనెద. (నిష్క్రమించును.)

మా—నామట్టుకింకను మనశ్శాంతి జిక్కకున్నది. మనము పరిపరివిధంబుల బోవుచున్నది. వెనుకకు పోయిన నూయియు ముందుకేగిన గోయియు నన్న చందంబయ్యె. భిన్నాభిప్రాయమున్నంతమాత్రమున వ్యతిరేకముగా పనిచేయగూడదు. మహాసభాతీర్మానములను శిరసావహించుటా లేక నిరాకరించుటా అనునది గొప్పవిషయము. అదియట్లుండ శాసనసభలకేగుటా, యేగకుండుటయా అనునది మరియొక గొప్పవిషయము. ఐనను అనుభమును బట్టిచూడ శాసనసభలలో ఎక్కువగా జేయదగినపనిగూడ గన్పించుటలేదు. బహిష్కరించినచో కార్యసిద్ధికి భంగము వాటిల్లునేమోయని భీతి గలుగుచున్నది. అది అటుండ ప్రస్తుత తీర్మానములో కొన్ని మార్పు

లను జేసినచో ఈ నూతనసిద్ధాంతమే మోక్షదాయకమని
తోచెడిని.

చ॥ మనమున నెన్నియేని యనుమానములై పొడసూపుచుండె, చూ
చినకొలది౯ మహాత్మునకు చేరువ యయ్యెడు నామనంబు, శా
సన సభలందుచేరుటకు స్వాంతమదేమొకొ యొప్పకుండె, నూ
తన పథమందె దేశమిక ధన్యతనొందెడు నంచుతోచెడి౯॥

(ప్రవేశము గాంధి)

గాం—(తనలో ఈతడేమియో దీర్ఘాలోచనపరుడై యున్నాడు. ఈతని మనమును త్రిప్పినగాని కార్యము. త్వరలో సిద్ధింపదు. (ప్ర)పండిజ్జీ! మీరు భిన్నాభిప్రాయము గలిగినందు కెంతయు చింతిల్లుచున్నాను. త్వరలో మీమనమును ద్రిప్పుకొని, ఈ దేశీయోద్యమమునకు తోడ్పడెదరని కోరుచున్నాను.

మా—మహాత్మా! నేనుమట్టుకు వెనుకంజవేయుచున్నాననియా మీ తలంపు. నామనస్సు నడినముద్రములో నీదులాడుచున్నది.

గాం—మిత్రమా! మీరు వెనుదీయువారుకారు. కారని నేనుగట్టిగా త్రికరణశుద్ధిగా నమ్ముచున్నాను. నేనున్నను లేకున్నను మీరు యీయుద్యమమును కొనసాగింతురను ధృఢ విశ్వాసముతోగూడ నున్నాను,

మా—నాకేమిచేయుటకును తోచకున్నది. ఏదియెట్లున్నను దేశక్షేమముకన్న కావలసినది యెవరికిని లేదుగదా! ఎద్దిదేశక్షేమకరమా యని మన ప్రస్తుత వివాదము.

గాం—ఆవిషయము ఇంకను సావకాశముగా మోతీలాలు నెహ్రూతోగలసి చర్చింతము రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

2 రంగము.

మహమ్మదాలీ—కటకటా; ప్రాణము విసిగి విసిగి వేసారినది. దేశదేశములను తిరిగితిరిగి చేయగల ప్రయత్నములన్నియు చేసి తుదకు నిష్ఫల మనోరథుడనై యిల్లు చేరవలసె. మహాత్ము

దీయ మతమునకు గలిగిన అవమానమును న్యాయమార్గమున తొలగింప ప్రయత్నించుట నిష్ప్రయోజన మయ్యెను. కొన్ని కొన్ని దేశములవారుబలికిన పలుకులు తాత్కాలికోత్సాహము కలిగించి ఆశనించుక నిలిపెను గాని, తుదకు వారివారి నిజ హృదయములు బయల్పడినతరి మోసపోతిమి. ఒరులపై నాధారపడియున్న వారిగతి యింతకన్న నెక్కువ ఏమగును. అయిన మనవిధ్యుక్తమును మనము నెరవేర్చితిమి జరుగబోవు కీడు మేలులకు పాశ్చాత్యులే కారణభూతులుగాని మనమెంతమాత్రము కాజాలము.

మహమ్మదీయుల హృదయవేదన నానాటికి రగులుకొనుచుండ, హిందూదేశ దుస్థితి రోజురోజుకు ససంతృప్తి యగుచుండ, అయిరోపా దేశీయులు ప్రపంచక శాంతిని నెలకొల్పుటకై నానాజాతి సమ్మేళనము స్థాపింతురట. అదియెట్లుకొనసాగునో వారికే తెలియును, అమెరికావారీ విషయ మెరింగియే వారి యనుమతిని జూపించుటలేదు. ఇట్టితరి ఐరోపియను లోకులే ఎట్లు ప్రాపంచిక శాంతిని స్థాపింతురో హాస్యాస్పదముగనున్నది.

ఇంక జేయు కర్తవ్యమేమియో యోచింపవలయు. దేశాంతరమున మేము ప్రయత్నములు చేయుచుండ దేశములో గాంధి మహాత్ముడును షౌకతాలీ సోదరుడును జేయుచున్న ప్రయత్నములు వర్ణనాతీతములు. అవును స్వశక్తిపై నాధారపడి యుండుటకన్న వేరొక సన్మార్గ మేమున్నది. స్వశక్తియే పరమశక్తి. స్వశక్తియే ముక్తిదాయకము. స్వశక్తియే మానుషలక్షణము. కావున స్వశక్తిపై నాధారపడియున్న యీసహాయనిరాకరణసూత్రమును సంపూర్ణ దిగ్విజయము జేసితీరవలయును తక్షణమే పోయి సోదరుని కలుసుకొని క్షేమ సమాచారములెరిగి కృషిసలుప ప్రారంభించవలయును. అదిగో నారాక

నెరింగి షౌకతాలి ఇటులనే వచ్చుచున్నట్టున్నాడు.

(ప్రవేశము షౌకతాలి.)

షౌక—మహమ్మదాలీ! క్షేమముగా వరుదెంచినందులకు సంతసించుచున్నాను. విశేషము లేమియు లేవుగదా.

మహ—సోదరా! మన అల్లాకృపయుండుటం జేసి యింతవరకు క్షేమముగా నిల్లుసేరియుంటిని.

షౌక—ప్రయత్నములేమైన ఫలించెనా?

మహ—సోదరా! పాశ్చాత్యుల స్వభావమెరింగియు ఫలించెనా యని యడుగుదువేమి? మనవిధిని మనము నెరవేర్చితిమి, అదియే మనకు గలిగిన ఫలితము.

షౌక—నేననుకొనుచునేయుంటిని. ఏమియు నాశలేదుగదా?

మహ—మనస్వశక్తిపై నాధారపడుటయే మనయాశ. పోవుదము రమ్ము.

షౌక—ఇంకొకరిపై నాధారపడి వారిని ప్రార్థించుటకన్న వేరొక నీచములేదు. లాయడు జార్జిమంత్రిగారి మాటలు నీళ్లలో మూటలయ్యెనుగదా? మనగాంధిసోదరుడు యీవిషయముల నిదివరకే తెల్పుచున్నాడు, మనముపోయి ఆమహాత్ముని కలసికొని కర్తవ్యమూహించుదము రమ్ము. (అని నిష్క్రమింతురు.)

## 3-వ రంగము.

గాంధి, మాలవ్యా, నెహ్రూ, మహమ్మదాలీ, షౌకతాలీ లజపతిరాయి, (సమావేశము.)

నెహ్రూ—ఆసేతుహిమాచల పర్యంతము సహాయనిరాకరణోద్యమము నానాటికి తీవ్రముగ రగుల్కొనిపోవుచున్నది. శాసనసభల విసర్జించువారును, ఎన్నికల విడుచువారును, పాఠశాలలు బహిష్కరించువారును, న్యాయవాదివృత్తిని వదలుకొనువారును రోజురోజుకు అధికమగుచున్నారు. విద్యార్థులందీ నూత

నోద్యమను చాల కలవరము గలిగించుచున్నది. అలిఘరు విద్యార్థుల ననుసరించుటకు తక్కిన విద్యార్థులందరును గట్టిప్రయత్నములను చేయుచున్నారు.

మహ—కాశీహిందూవిశ్వవిద్యాలయము ప్రభుత్వ సంపర్కమునుండి విముక్తినొందిన మరునాడు విద్యాలయము లన్నియు వరుసగా మలిన రహితములయి, స్వచ్ఛమగు విద్యాపీఠములగును, ప్రస్తుతపు విద్యావిధానము చాల హీనదశయందున్నది. ఈరాక్షస విద్యనుండి మన యువకులు విముక్తులయిన గాని దేశము కోలుకొన నేరదు.

షౌ—హిందూవిశ్వ విద్యాలయ విషయములో మన పండిట్జీ తలచుకొనిన యెడల స్వల్పకాలములో మనకోర్కెలన్ని యుఫలించును

నెహూ్రు—ఈసందిగ్ధసమయమున దేశ సేవాదురంధరుడును, కార్యదీక్షాతత్పరుడును అగు మన మాలవ్యా ఎంతమాత్రమును వెనుదీయడని నేను గట్టిగా జెప్పగలను. ఐనను ఆతడింకను యోజించుచుండుటకు కతంబేమియో తెలియకున్నది.

మాలవ్య—మిత్రులారా! నామనమెన్ని విధముల తలక్రిందగుచున్నదో మీకు తెల్పుటశక్యముగాదు. ముందుకునడిచిన నూయియు వెనుక కేగిన గోయియు అను చందంబుననున్నది. ప్రస్తుత విద్యావిధానము నందనేకమార్పులు గావలెనని ఒప్పుకొనక తప్పదు. అయినను ప్రభుత్వమువారి ధనసహాయమును నేల వదలుకొనవలయునో తెలియుటలేదు. ప్రభుత్వమువారి ధనముగూడ మనధనమేగదా. కావునయిట్టి సంకోచములచే తలక్రిందగుచున్నాను. ఏమి చేయుటకు తోచకున్నది.

గాం—మిత్రమా! మనకింకను సంకోచములేల,

సీ॥ నానాటికి ప్రభుత్వ మేనీతి నెరుగక

కఠినరాజ్యంబుగా గ్రాలుచుండె

అంతకంతకు న్యాయము దుగంటుటయె గాక
తప్పుదాకుల ప్రభుత్వంబు నడుచు
రోజురోజుకు మన రాజకీయవిధాన
మతిహీనదశకు పాలగుచునుండె
చూడచూడగ ధర్మశూన్యమైరావణా
సురునిచర్యలు జ్ఞప్తిజొచ్చుచుండె

తే॥ గీ॥ దాస్యబంధములు బిగింపుబాల్చుచుండె
జీవనమె దుర్భరంబుగ జేయబడియె
నకట, యికనైన నిట్టి రాజ్యాంగ మవని
మార్పు జెందగావలదె ధర్మంబుకొరకు

ఇట్టిసమయంబున శంకలనియు సందియములనియు వెనుదీసిన నాత్మహత్య జేసికొనిన వారమగుదుము. ప్రభుత్వమువారి ఆయువుపట్టు న్యాయస్థానముల యందును విద్యాలయము లందును గలదని నేనిదివరకే మనవిజేసి యుంటిని. మనమెల్లర మేకీభవించి యీ ఆయువుపట్టును స్వాధీనపరచుకొనిన నేనిది వరకేచెప్పినట్లు ఒక్క సంవత్సరములో స్వరాజ్యము కరతలామలకము.

తే॥ గీ॥ సమయ మేతెంచె భారత జాతికెల్ల
శంకలనుమాని కర్తవ్యసరణిదెలిసి
స్వార్థమతివీడి, దేశ సేవార్థమిపుడె
నడుములను గట్టవలయు హైందవులు వేగ॥

కావున పండిజ్జీ మీకుగల శంకలను మానిమాకు తోడ్పడెదరని ప్రార్థించుచున్నాను.

షౌక — మిత్రులారా!

మ॥ అనుమానంబికనేల నిబ్బవి మహమ్మద్ జాతిలో బుట్టునే
ఘనుడైన వెనదీయ డిత్తరి మహాకష్టంబెయూగాక మా

తనువుల్ బోనులజిక్కు సింగములచందంబయ్యె గాకున్న నె
మ్మనుజుండేని మతావమానమును సామాన్యంబుగా నోర్చునే॥

మాల—మిత్రములారా! వెనుదీసెడు వారెవరైన గలరనియా విచా
రమూహా.

ఉ॥ భారతభూమి పుత్రులగు భాగ్యముగల్గిన ధీరపూర్వు లె
వ్వారును వెన్కదీయ రిల పౌరుషతీవ్రమహాగ్నియెల్ల చ
ల్లారిన తాచుపాములయి హైందవులెల్లరు వేచియుండ బం
గారమువంటికాలము సఖా యెవరేనియు బోవనిత్తురే॥

లజ—మిత్రులారా! మనకిన్ని వాదములేల. సహాయనిరాకరణసిద్ధాంత
ము విషయమున మనమెల్లరము నేకీభావమును గలిగియే యు
న్నాము. ఇక జయాపజయంబులు ప్రజాధీనములు. దేశ
మీతీర్మానము నామోదించునదియు లేనిదియు నీ శాసనసభా
యెన్నికలనుబట్టి నిర్ణయింప వచ్చును. రేపోమాపో వార్తాప
త్రిక లీవార్తలను దెచ్చును. అపిమ్మట కర్తవ్యమును నిశ్చ
యించుట సులభము.

మహ—శాసనసభలయెడల నుత్సాహమున్నదియు లేనిదియు మొన్నటి
బొంబాయియెన్నికలలో 100 కి 20 మందికన్న యెక్కువపాల్గొ
నకుండుట బట్టియే స్పష్టమగుచున్నది. దేశమంతయు గాంధి
మహాత్ముని పట్లను, దేశీయ మహాసభ యెడలను, అమితోత్సా
హము చూపుచున్నది. (తెరలో)

ఉ॥ సంతసమార్యులార పలుసందియముల్ విడిపోయె భారతం
బంతయు గాంధిమార్గానికి జయంబును దిగ్విజయంబుగూర్చె ధీ
మంతులు హైందవప్రజల మానమమిద్ధరనిల్పె, నూత్న సి
ద్ధాంతమునమ్మి యెన్నికలతాకగలేదు జనంబులెచ్చటన్॥

దే. సే—(ప్రవేశము దేశసేవకుడు)

(మరల) ఉ॥ సంతసమయ్యులార (అనుపద్యముచదువును)

గాం—జయాపజయంబులు నా వెట్లగును? దేశమునకు జయముగల్గిన దనుము. పలుపార్శ్వములనుండి వార్తలరుదెంచినవా?

దే. సే—ఎచ్చటనో పరిభుత్వోద్యోగులును, స్వాభిలాషులును, మహాంధులును, మితవాదులనువారును, దక్క వేరెవ్వరును ఎన్నికలయందు పాల్గొనలేదు. అనేకప్రదేశములందు ఓట్లఆఫీసరులు 6 గంటలవరకు కూర్చుని కూర్చుని, తుదకుఖాళీపెట్టెలతో లేచిపోయిరి. ఆంధ్రరాష్ట్రమమితోత్సాహము చూపినది. కొలదికాలములో శ్రీయుత కొండ వెంకటప్పయ్యపంతులుగారు మొదలగు నాయకులనేర్పర్చుకొని, కార్యదీక్షవహించి, కలకత్తా బొంబాయి రాష్ట్రములతో సరిసమానముగ ఆంధ్రరాష్ట్రము నూతనోద్యమమును జయప్రదము గావించుచున్నది. పంజాబు బీహారు సంయుక్తరాష్ట్రము లిదివరకే తదితరదేశములను మీరిపోయినవి. చెన్నపట్నమును మరికొన్ని ప్రదేశములును కొంచెము వెనుకబడియున్నవి. అవియును త్వరలో కార్యదీక్షగైకొను ననుసూచనలు గన్పడుచున్నవి. ఈనాటి వార్తావిశేషములన్నియు చాల సంతోషముగా నున్నవి.

మహా—ఈ అతివాద మితవాద భేదములు లేకున్నచో దేశమింకను జయప్రదముగా మన యుద్యమమును కొనసాగించియుండును. ఈ భేదములు త్వరలో నంతరించునని దేవుని సర్వదా ప్రార్థించుటయే మన కర్తవ్యము.

నె—అదియునుగాక మన మనస్సులు పాశ్చాత్య వ్యామోహమునకు జిక్కుకొని, నమ్మకమును విశ్వాసమును గోల్పోయి, అనుమానములందు మునిగి తేలుచుండును. కావున నేమన మేపని చేయుదమన్నను శంకలధికముగా బయల్పడుచుండును. త్వరలో మన మీవ్యామోహ విముక్తుల మయ్యెదము గాక.

లజ—మిత్రులారా! దేశీయ మహానావ యీ సహాయనిరాకరణ ఘోరాబ్ధిలో నింతవరకు జయప్రదముగా యానము సల్పినది. ఇకముందు కర్తవ్యమును నిర్ణయించవలెనుగదా.

గాం—సోదరులారా! నిర్ణయించుట కేమున్నది. ఆదర్శమిదివరకే యేర్పడియున్నది.

తే॥ గీ॥ చక్కని స్వరాజ్య సౌధంబు నెక్కుటకును
ప్రథమసోపానమును జేరి ప్రజలహర్ష
మున తిరింతును వెనుకకు పోవుమాట
చెవులబడరాదు, వడివడి జేరవలయు
మోక్షసౌధంబు హైందవ పుత్రులార॥

కావున మనమే సహాయనిరాకరణమను దివ్యమంత్రమును ప్రయోగించి యింతవరకు, అనగా శాసనసభా యెన్నికలలో, జయముగావించితిమో, ఆ సహాయ నిరాకరణ మంత్రమునే మరి మరి జపించి శీఘ్రముగ దరిజేరవలయును. మన నాయకులందరేకమై యీ యుద్యమమునందలి వివిధాంశముల పట్టుదలతో కొనసాగింతురేని ఒక్క వత్సరములో జయము గాంతుమని నేనుగట్టిగా జెప్పగలను.

లజ—సరి. మిత్రులారా! మహాత్ముడు చెప్పినట్లు మన మెల్లరమును కలసి ఈ నూతనోద్యమమును జయప్రదము గావించవలయును. ప్రస్తుతము పాఠశాలలవిషయములో తీవ్రముగ పనిచేయవలసియున్నది. ఇప్పటికే చాలకాలాతీతమగుటచే ఈనాటికీసమావేశమును చాలించి మరల నొకసారి కలియుదము. ఎచ్చటకూడుటో స్థలనిర్ణయ మిప్పుడే చేయవలయును.

గాం—కొలదిరోజులలో మనలో చాలమందిమి వారణాశి పట్టణమునకు పోవుచున్నామని యూహించెదను. కావున సమావేశమచ్చటనైన బాగుండును.

అందరు—అవును. అవును. (కరతాళధ్వనులు)

(తెర పడును.)

## 4 వ రంగము.

## ఓట్ల హాస్యము.

(ఓట్లపెట్టె—ఆఫీసరు.)

ఆ—3 గంటలయింది, ఇంతవరకు మనిషిపురుగు జాడాలేదు. కూర్చొని కూర్చొని ప్రాణము విసిగిపోతున్నది. పెట్టెలో ఒక్క ఓటన్నా పడలేదు. ఏమి మిడిమేళమువచ్చిపడుతుందో యేమొ ఎవరినైనా పిలిచిఅయినా 4 ఓట్లు పడేయించకపోతే మర్యాద దక్కదు. (ప్రక్కకుచూచి అడుగో, ఎవరో పోతున్నాడు. ఏమయ్యోయ్ ఏమయ్యోయ్. ఇటురా, ఇటురా. (పిలుచును)

(ప్రవేశము బాటసారి)

బా—ఏందండీ

ఆ—ఓటియ్యవ్?

బా—ఓటేంది?

ఆ—ఓటు.ఓటు. మీకందరికి పన్నువేయించి మేలుచేస్తారే, ఆఓటు.

బా—ఎందో మాకేంవద్దుబాబూ, ఇప్పటికే చచ్చిపోతుండాం, ఈపన్నులతోటి.

ఆ—మీకులంఆయనకు ఒకవోటు యిచ్చిపోవయ్యా.

బా—మాకు కులంవద్దు గిలంవద్దు ఇట్లాబ్రతికనిద్దురు. (అనిపోవును.)

ఆ—సరే (గడియారంచూచుకొని) ఇంకా రెండుగంటల కాలమున్నది. ఇంతవరకు నేనొక్కడినే మిగిలా (ప్రక్కకుచూచి) అమ్మయ్యా ఎవరో వస్తున్నాడు.

[ప్రవేశము రయితు.]

ఆ—ఏవూరు నీది.

ర—ఆ, అదేంది, మనగంధిపాలెంగాదూ.

ఆ—గాంధిపాలె మెక్కడోయ్?

ర—ఇదేంది తిలకూరుపక్క.

ఆ—తిలకూరు పక్కది అరండేలుపురం కాదూ.

ర—అదేలెండీ, ఆపేరుతీశేసారు లెగండి.

ఆ—అయితే నీవేమిపనిమీదవచ్చావు యిప్పుడు.

ర—యిదేందో వోడ్లుయిస్తారంటగా?.

ఆ—వోడ్లుగాదు ఓట్లు, ఓట్లు.

ర—అదేంది ఓడ్లుయిస్తారన్నారే. అయితే యేవో వృకటియ్యండి కూసిని.

ఆ—మేముకాదోయ్ యిచ్చేది. నువ్వు యియ్యాలె వోటు.

ర—మాదగ్గిర యేముందండీ. మేముయిచ్చేదేంది

ఆ—ఈ యేడుగురిలో నీయిష్టమువచ్చిన వారికి నీవోటు యిచ్చిపోవలె. వోటంటే నీసమ్మతి.

ర—అయితే ఎవరికోరికెయ్యండి.

ఆ—నేనెయ్యకూడదు. నీవుచెప్పాలి.

ర—యీభాగ్యానికి యెవరికైతేనేమి యేతురు.

ఆ—అట్లాగాదు. నీవు ఎవరికో ఒకముగ్గిరి పేర్లుజెప్పు.

ర—అట్లయితే తలాఒకటీ యెయ్యండి.

ఆ—ముగ్గురికిమాత్రమే వెయ్యవలయును. ఈ యేడుగురిలో నీయిష్ట ముచ్చిన వారిపేర్ల కెదురుగా ఇలా గీతగీయవలె. (X)

ర—అదేంమాటండి.అదేంమాట అంటా. ఒకరికిచ్చి ఒకరికియ్యకపోతే ఊరుకుంటారు. ఈపక్షపాతాలు మాకొద్దండీ

ఆ—సర్లే, నీగోల మాకువద్దు, బైటికిపో.

ర—యేసుకొండీ పోతా.



NATIONAL ARCHIVES OF INDIA

ఆ—అలాఅయితే నీయిష్టమువచ్చినవారికి వేసిపో. (అనికాగితము చేతికిచ్చుచున్నాడు)

ర—(కాగితము దీసికొని పైనుంచి క్రిందికి రెండు పెద్దగీతలనుబెట్టి యిచ్చుచున్నాడు) అయితేమాకు సోడాబుడ్లెయ్యండీ.

ఆ—ఇక్కడలేదు. బజారులో ఇస్తారుపో.

ర—ఓట్లిచ్చినవాండ్లకు బుడ్లిస్తారన్నారే,

ఆ—లేదు లేదు పో.

ఆ—బాబయ్యో, నేనందరికి తలోకటియిసి పోతుండాలెండి.

(అని నిష్క్రమించును)

ఆ—పడ్డ ఒక్క కాగితము (Invalid) పనికిరానిది. ఈయనెవరో యింకొకఆయన వస్తున్నాడే. రండి. రండి.

(2-వ రైతు ప్రవేశం)

ఆ—ఏవూరు నీది.

2. ర—మాదియిక్కడే లెగండి.

ఆ—ఎందుకొచ్చావు నీవు.

2. ర—మీరు రమ్మని చాటించారుగా.

ఆ—ఛెట్. అటువంటిమాటలు మాట్లాడకు.

2. ర—మరి మీరు రమ్మన్లేదంటయ్యా. మామిట్టిమిట్టిచూస్తారేమిండీ,

ఆ—అనవుసరంగామాట్లాడవద్దు. ఎవరికిస్తావు వోటు.

2. ర—ముందాయనకు వెయ్యండిబాబూ:—ఆయనెవరో అర్ధరాత్రప్పుడు మాయింటికొచ్చాడే

ఆ—ఎవరాయనా, 5 నెంబరాయనా ?

2. ర—ఆ అల్లాయనే. ఎయ్యండిబాబూ యెయ్యండీ.

ఆ—నీవే వెయ్యాలోయ్. నేను వేయకూడదు.

2. ర—ఎవరైతేనేం లెగండి. ఎయ్యండి.

ఆ—ఇంకెవ్వరికైనా వేస్తావా ?

2. ర—ఇంకెవ్వరికివద్దన్నారు బాబూ. ఆయనొక్కడికే.

ఆ—సరే. పో. (అని ఆయనే వేయుచున్నాడు)

(రైతునిష్క్రమించును)

ఆ—(గడియారము చూచి) ఇక 5 నిమిషములున్నవి. ఇప్పటికి రెండు ఓట్లుపడ్డవి. అందులో ఒకటి (Invalid) 1200 మంది ఓటర్లకు ఒకడు వచ్చాడు (పెట్టెమూతవేసికొని పట్టించుకు పోవుచున్నాడు.) (నిష్క్రమించి...)

NATIONAL ARCHIVES OF INDIA

# గాంధివిజయము

## పంచమాంకము.

### 1 రంగము.

(కలనల్ వెడ్జివుడ్, బెన్ స్పూర్లు:—వీరిరువురు)

(ఆంగ్లకార్మిక సంఘముతరపున నాగపురపు కాంగ్రెసుసభకు ప్రతినిధులుగా వచ్చిరి.)

వె.—ఆలోగాడ్! బ్రిటిష్ రాజధాని కెల్లను కిరీటమనందగు హిందూ దేశము మనకిక దక్కునట్లు లేదు. ప్రభుత్వ పక్షమువారింకను ఈ విషయము గుర్తించుటలేదు.

బె.—హిందూదేశ మింకను వెనుకబడియున్నదనియు దేశమున జాతి మతభేదములింకను నశింపలేదనియు ప్రభుత్వశాఖవారు మురియు చున్నారు గాని దేశస్థితి నాకు భీతిగొల్పుచున్నది. మనమను కొన్నదానికన్న దేశము వేయిరెట్లు వివేకముగా నున్నది.

వె.—మనమిప్పుడు చేయవలసిన పనియేమి. అతి తీవ్రముగ పరుగిడు చున్నజాతీయ ప్రవాహమును ముందు ఆపవలయును గదా.

బె.—ఈమహాప్రవాహము నాపుటకెవరివశము. ప్రభుత్వమునందే గాక ఇంగ్లీషుజాతియందు గూడ ద్వేషము పెరిగిపోవుచున్నది. దీనినాపుటకు, ఇండియాదేశస్థుల నాగరికులగా నెంచి వారిన ణగ ద్రొక్కవలె నన్నతలంపుల తక్షణమేమాని మనతోపా టు సమానహక్కుల వారికిచ్చి వారిని గౌరవముతో జూడ వలయును, అట్లుచేయని యెడల మనమర్యాద యికదక్కదు.

వె.—దేశమిట్టి విషమస్థితికి వచ్చుటకు కారణమేమి యని యూహిం చెదవు?

బె॥—ఏమున్నది. కొంతవరకు! మాంటేగ్యూచెమ్సుఫర్డుల అవివేకమును, చాలవరకు* డయ్యరో డ్వ్యయరుల పంజాబు దురంతములును కారణములు,

వె—తరువాత యేదియెట్లున్నను, ముందు మనజాతిపై ప్రబలెడు ద్వేషము నాపవలయునుగదా. అలాచేయుటకు మితవాదులను బిశెంటు పక్షము వారిని పట్టిన కార్యము నెరవేరునని తోచుచున్నది

బె॥—అంతకన్న పొరబాటింకొకటి లేదు. అట్లుచేయుటవలన మనపైగల కాస్తవిశ్వాసమును గూడ బోగొట్టుకొనిన వారమగుదుము.

వె—నీయభిప్రాయ మేమిచేయవలెనని. గాంధిగారిని త్రిప్పగలమని ధైర్యము నీకు గలదా?

బె॥—వారిదేశమునకు గల్గిన ఆపదలను తొలగించుటకు త్రికరణశుద్ధిగామనము తోడ్పడుటయే మనకర్తవ్యము. కృత్రిమమార్గములననుసరించిన మనపనిని చెడగొట్టుకొనిన వారమగుదుము నాగపుర మహాసభకు వెళ్లి అచ్చట నిర్మలభావముతో మన దృఢసంకల్పమగు స్నేహాభావమును వెల్లడిచేయుటయే మనము చేయవలసినది.

వె—మదరాసులో మితవాదులు వేరొక సభగావించెదరట, మన మచ్చటికి పోవలదా?

బె॥—అచ్చటికేగిన మనఆత్మగౌరవముగూడ నశించును. దేశీయప్రవాహము నాగపురమునకు పొర్లుచుండ, చెన్నపట్నమున కేగుట "కూంబు" నది దర్శనమునకే. దేశీయ తేజస్సును చూడవలయుననిన మహాసభకు పోవలయును.

---

• మాంటేగ్యూ మనదేశ రాజప్రతినిధి. చెమ్సుఫర్డు= మనవైస్రాయిగారు.

* వీరు పంజాబు అధికారులు.

వె—అట్లయిన నీవు జాతీయవాదులతో కలసి మెలసి వర్తింపుము. నేను మితవాదుల సాయమునకై యత్నించెద. మనమన్ని విధముల ప్రయత్నములు చేయవలసినదే (ప్రక్కకుచూచి) ఇదుగో, మనఆంగ్లోఇండియను స్నేహితుడు వచ్చుచున్నాడు. ఈతని యభిప్రాయములెట్లుండునో కనుగొందము.

(ప్రవేశము ఆంగ్లో ఇండియను.)

ఆం—గుడ్ మార్నింగ్.

బెస—& వె—గుడ్ మార్నింగ్. దయచేయుండి.

ఆం—ఇం—ఏమో ఆలోచించుచున్నారే.

వె—ఏమిలేదండి. ప్రస్తుత మీదేశము విషయమై మీయభిప్రాయమేమిటి? ప్రభుత్వమేమైనా నిలుచునాశగలదా?

ఆం—ఇం—నాన్సెన్సు. బ్లడీబెగ్గర్సు—ఈ దేశంలో వాంళ్ళకు దడిసేదేమిటండీ. నాఅభిప్రాయములో మాంటేగ్యూగారు చాలా తప్పుచేస్తున్నాడని చెప్పగలను.

బెస—ఆతడింకను ఈదేశమునకు సంపూర్ణస్వరాజ్య మిచ్చేప్రయత్నముల చేయుటలేదసియా మీయూహా?

ఆం—ఇం—కాదు. కాదు. ఆందోళనపరులగు వారిని స్వేచ్ఛగా సంచరింప నిచ్చుటమే మాంటేగ్యూగారి తప్పు. ఎక్కడి వారి నక్కడ బంధించితే దేశము గుట్టుచప్పుడిగాకుండా పడివుంటుంది.

బెస—సరి సరి. పంజాబులో అట్లుచేయుటబట్టియే దేశమిట్టి స్థితికివచ్చినది.

ఆం—ఇం—మీకింకను ఈదేశవిషయము బాగుగా తెలియలేదు, పైపైన నలుగురు ఆందోళనా పరులను జూచి మీరు భయపడుచున్నారు.

NATIONAL ARCHIVES OF INDIA

వె—మిత్రమా, నీవు దేశముపట్ల చాల అన్యాయముగా ప్రవర్తించు చున్నావు. మీరందరింతకన్న కొంచెము వివేకము గలిగి యుండవలయును. కేవలము పశుబల మెన్నినాళ్ళు నిలుచునని నీతలంపు?

అం ఇ—మీాకీ దేశవిషయమై బాగుగా తెలియలేదనియే మరల నేను జెప్పెదను.

శే—(వెం॥తో) మిత్రమా, ఈశుష్కప్రియములతో పనిలేదుగా మనమికపోయి మహాత్మాగాంధిని సందర్శించి అచ్చటినుండి నాగపుర మహాసభకు పోవుదముర మ్ము.

(అందరు నిష్క్రమింతురు.)

2 రంగము.

నాగపురమున నాయకుల సమావేశము.

(అందరును భేదములవర్జించి కార్యశూరులగుట.)

గాంధి, లజపతిరాయ్, మహమ్మదాలీ, షౌకతాలీ, పాల్, దాసు, (అనేకమంది అనుచరులతో) మాలవ్యా, నెహ్రూ, వగ॥

దాస్—నాయకులారా, కలకత్తామహాసభయందు సహాయనిరాకరణ సిద్ధాంతమునందే యనేకమార్పులు, జేయనెంచి పట్టుపట్టితిమి. కాని ప్రజలమితోత్సాహములోబడి యించుక తొందరపడిరి. ఇప్పటికిని మిగిలిపోయినదేమియు లేదు, గావున గాంధిమహాత్ముని తీర్మానమునందు కొన్ని మార్పులనుజేసి యీమహాసభ యందు యుక్తమైన కార్యక్రమము నేర్పరచవలయును.

పాల్—మిత్రులారా, దాసుగారు చెప్పిన విషయములు విశ్వసనీయములు. దేశమున నాయకులందరు పలుతెరంగులు చీలిపోయి యున్నారు. అందరేకగ్రీవముగ నొప్పుకొనుమార్గము నొక దానినికనిపెట్టినగాని ఉద్యమము నెరవేరదు.

గాం—మిత్రులారా, మనమందరమును కోరవలసిన విషయమదియే.
ఈసహాయనిరాకరణ సిద్ధాంత విషయములో నేనొక్కటి మన
వి జేసెదను.

చ॥ కడచెనుమూడు మాసములు, గన్పడె మార్పులనేకముల్ కదుఁ
వడి ప్రజలందరేకమయి పాటుపడంగను దేశసేవ యె
న్నడుగననట్టిరీతిని ఘనంబయిదోచెడు జాగుసేయకఁ
వడివడి నూత్నదృక్పథముబట్టిజనఁ వలె భారతాత్మజుల్
మరియు,

చ॥ భయమిసుమంత నొందకయె భారతపుత్రులు స్త్రీలుబిడ్డలుఁ
సయితము కార్యశూరులయి శాంతమనస్కులుగామెలంగ సం
దియములు వేయునేటి కరుదెంచె శుభప్రదమైనకాలముఁ
జయమగు కోర్కులన్ని కొనసాగు ప్రయత్నములెల్లసేయుడీ॥

మాల—మహాత్మా, ప్రయత్నములు చేయుటలో నేమి లోపమును
జరుగనేరదు. కార్యాచరణమునం దుత్తాయుక్తము లెఱుంగు
టకే కృషిసల్పుచున్నాముగాని, కర్తవ్యమిదియని యేర్పరుచు
కొనినపిదప వెనుదీయువారెవ్వరును ఉండరు.

మహ—మిత్రమా, ఇంకను కార్యాచరణయందు సంకోచములేల.
దేశమేదో యొకదారినిబట్టి యింతవరకు జయప్రదముగా
వర్తించుచున్నది, ఇంకను సంకోచములేల?

నెహ్రూ— పండిజ్జీ, నీయభిప్రాయమేమిరూపుర్తిగాం. తెలియ జె
ప్పుము. సంకోచములు సంకోచములని యెన్నాళ్ళు తలక్రింద
గుదుము. నలుగురమేదో యొక మాటననుకొని నఖ్యతతో
కార్యదీక్ష గైకొందము.

మా—మిత్రులారా, నేనేభిన్నాభిప్రాయము వెలిబుచ్చవలసివచ్చినందు
కెంతయు చింతిల్లుచున్నాను. అయినను మహాయాగమునుసలు

పనున్న యీ సమయంబున అభిప్రాయములను దాచుకొనరాదు కొన్ని దినముల క్రిందటనే స్వరాజ్య సంపాదనకు తీవ్రమగు నిరాకరణోద్యమ మవసరమని నేను నమ్మియుంటిని. కాని విద్యాలయముల పడద్రోయుటవలన విద్యార్థులల్లరి పాలౌదురను భీతిగలుగుచున్నది. ప్రభుత్వసాయమే యేల పనికిరాదో నాకు తోచకున్నది. కావున నిట్టి విషయములలో కొన్ని మార్పులు జేయవలయునని నేను నమ్ముచున్నాను.

షా—మిత్రములారా, ఇంకను ప్రభుత్వసాయమేల పనికిరాదని యడుగుట నాకు హృదయవేదనను గలిగించుచున్నది.

తే॥ గీ॥ మామహమ్మదీయ మతము మంటగలుప
హైందవుల శాశ్వతముగ దాస్యముననుంచ
నటఖిలాఫత్తుకవమాన మాచరించి,
ఇచట పంజాబ్ దురంతములెన్నొ జేసి,
పాపమును మూటగట్టిన ప్రభుసహాయ,
మెటుల నంగీకరింపగా హృదయమొప్పు॥

మహ—అదియునుగాక,

సీ॥ మనదేశభాషలే మంటిలో గలిపిరో
పరభాష మనకెల్లగఅవుచుండ్రి
యౌవనదేహదార్ఢ్యము నశింపగ జేయు
విద్యావిధానంబు బెట్టినారు
మనదేశపద్ధతుల్ మనజాతిగౌరవం
బడుగంటి పాశ్చాత్యమయ్యెనెల్ల
నూటికెన్బదిమంది నోళ్ళమట్టిని గొట్టి
స్వల్పసంఖ్యకు పేలు సల్పుచుండి
తే॥ గీ॥ ఇన్నియేటికి మనసొంతమెల్ల జంపి
అంతరాత్మయె నసియించు నట్లు జేయు
విద్యనెన్నాళ్ళు నేర్వంగ వేడుకయ్యె
వెనుక ముందేల జాతీయ విద్యగొనుడు॥

గాం—సోదరులారా, మనమిన్ని వాదముల మాని వర్తించుటశ్రేయ
స్కరమని నాతలంపు,

మ॥ మనవారందరు నేకభావమును సంపాదింపలేకుండ, నొ
క్కని స్వాంతంబొకదారిపోవుట మరొక్కండొక్కదారాట నే
పనియుఁగాదిల నైకమత్యములరన్ వర్తింపనేడాదిలో
ననుమేల్ మాసములోన గాంచుదుము నిక్కంబంచెదఁ నమ్ముడీ.

లజ—మిత్రులారా, నామట్టుకు నేను సర్వమునకు సిద్ధమైయున్నాడను. జాతీయ మహాసభ పూర్వమువలెలేదు. లెక్కలేని జనము వేనకు వేలసంఖ్యతో మహాసభ పొంగి పొర్లుచున్నది. అట్టితరి యీమహాసభాసమ్మతముగ శక్తికొలది వర్తించుటకు సిద్ధమై యున్నాను. స్వల్ప భేదములను పాటించ వలసిన తరుణము గాదు.

దాస్—మిత్రులారా, నేనును మొదట కొంత వ్యతిరేకభావముతో తీవ్రముగా వచ్చితినిగాని, యీమహాసభా లక్షణమును, మహాజనముయొక్క అమితోత్సాహమును జూడ నాకు నోరాడుట లేదు. ఇంక దృఢనిశ్చడయునైతి.

చ॥ దలపకుమో మహాత్మ, యిల దాశ్యమెగోరుమహానుభావులఁ
గలసెదు వాడనంచు, వెనుకఁబడువాడనుగానెదఁ స్వతం
త్రిలమగుమార్గమేదియను తొందరపాటుజనించె. నెద్దియుఁ
సలుపుటకేని సిద్ధుడ నొసంగు మొనర్చెద నెట్టికార్యముల్॥

నిరంతర శంకలంబడి గుండుట క్షేమకరముగా దోచుటలేదు కావుననీమూడుమాసములనుండి దేశమవలంబించుచున్ననూత్నసిద్ధాంతమునే నమ్మి అందరమును కృషిసల్పుదము.

పాల్—నావిషయములోగూడ మీరెట్టి అనుమానమును పొందదగదు

మ॥ తలఁపఁబోకుడు మిత్రులార, తగుసందర్భంబునఁ భారతీ
యులువెన్కఁ బడువారలంచు, నిదెమీతో నెంతదవ్వైన రా

గల దార్ఢ్యంబు మనోదృఢంబు గలదింకం జెప్పుడేదేని, రా
గల కష్టంబుల వెన్ని వచ్చినను జక్కం జేతు నాశక్తిమై॥

లజ—సోదరులారా, నాకుమట్టుకింక సంశయము లేమున్నవి,

మ॥ అకటా! వత్సరముల్ ప్రవాసమున నేనల్లాడి, యల్లాడి చిం
తకు పాలై తుదకిల్లు సేరితిని, స్వాతంత్ర్యంబు నాజన్మభూ
మికి సాధింపగ ప్రాణమిచ్చెదనను మిమ్మా గాంధిమౌనీంద్రా, నే
నిక వెన్దీయను సిద్ధమే పనికి యేదెల్లైన లెక్కింపకన్॥

మాల—మిత్రులారా, మీరప్పుడే చాల తొందరపడుచున్నారు.

చ॥ త్వరపడు కోర్కెకైన శుభదాయకమౌనని గాదు, వెన్కముం
దరసియు జాగరూకులమునై మెలగంగ స్వతంత్రరాజ్యముం
త్వరితముగా జయింతుము, వృథాయగు కార్యములాచరించి వల్
తెరగులఁ బోవుచున్న యెడ దేశసుఖంబు చెడుం దలంచుడీ॥

గాం—మిత్రా, పండిట్జీ, నీమనంబింకను సందేహాస్పదమై యున్నది.
మనము తొందరపడి చేసినదేమున్నది.

సీ॥ మంచితనాన సాధించుద మనుకొన్న
మనమాట చెవియొగ్గి వినరు వారు
ఆంగ్లప్రజాసాయ మాసింతమన్నచో
వారికేగతిలేక వగచుచుండ్రి.
రణరంగమున రాజ్య మణగద్రొక్కుదమన్న
ఆయుధంబుల జ్ఞాన మసలె లేదు
విన్నపంబుల వారి వేడుకొందమటన్న
ఆయాశలప్పుడే యంతరించె
తే॥ "మీసహాయంబు వలయును తోసివేయ
మింక మీదేశసంబంధ మెన్నటికిని"
అనుట తక్షణమే మాని యవుసరంబు
తెరిగి ప్రజలెట్లు తలతురత్తెరగు నేతు
మనుచు జాటంగవలయు ధైర్యము వహించి॥

కావున "బ్రిటిషు సంబంధము౦డి తీరవలయును" అను నిబంధ వను గలిగిన కాంగ్రెసు మతమును, మార్చుటయు సంపూర్ణ సహాయ నిరాకరణ తీర్మానము నామోదించుటయు నీమహాసభలో చేసి తీరవలయును,

దాస్—మహాత్ముడు చెప్పినది వాస్తవమని రూఢిగా దెల్పుచు, రెండవ తీర్మానమును నేనే సభలో ప్రవేశపెట్టెదను.

గాం—మంచిది. నీవంటి తేజోవంతుడు భాగము వహించుట చాలశుభసూచకము. ఈసమావేశమిక చాలించి, రేపటి మహాసభ ప్రయత్నముల చేయుదము. మీరందరును ఏకాభిప్రాయులగుట భారతమాతపుణ్యము. (కరతాళములు.)

(నిష్క్రమ) (తెరపడును.)

4 రంగము,) (నాగపుర కాంగ్రెసు సభాభవనముదగ్గర)

(ప్రవేశము దేశభక్తుడు.)

దే—భ—అనుకున్నంతా అయింది. విజయరాఘవాచార్లుగారు చెడగొడతాడని భయపడ్డట్లే అయింది. మదరాసు రాజధానియొక్క పేరు చెడిపోయింది. తిలక్ మహారాజువుంటే ఆమహనీయుడధిష్ఠించవలసిన అధ్యక్షక పీఠమీయనకు లభించినందుల కాఘనతనిల్పుకోటం ఎంత కష్టం!

(ప్రవేశము దేశసేవకుడు ఆతురతతో పరుగెత్తుచు.)

ఏమండోయ్ దేశసేవకుడుగారు ఎక్కడికి అడావుడి?

దే—సే—ఎవరు! దేశభక్తుడుగారా! వంగదేశ మురాలో అల్లకల్లోలము జరుగుచున్నదట, కుర్చీలుబల్లలు విరగగొట్టుకొనుచున్నారట. నేనక్కడికే త్వరగా పోతున్నా . మీరుగూడా వస్తారా (అని పోబోవును.)

దే—భ—ఆగండి, ఆగండి, మరేమితొందరలేదులెండి, అంతాసర్దుమణిగింది.

దే. సీ—ఎలా, ఎలా, మీరెప్పుడు విన్నారు ?

దే. భ—ఇంతకుముందే, గాంధిమహాత్ముడు వారినిసందర్శించి, అందరిని భాయిభాయి చేసాడు. ఆహా! ఆయన ముఖారవిందమే మండి! ఆయన స్వరూపం కనపడటంతోటే ఎక్కడివారక్కడ గుట్టుచప్పిడకు, అంతటితో వారివారివైరములను పూర్తిగా మానుకొందుమని ఒట్లుపెట్టుకున్నారు.

దే. సీ—భేష్. బాగున్నది. సంతోషమయిన వార్తయే. అయితే విషయనిర్ణయ సభా విశేషము లేమయినా బయల్పడినవా ? దాసుగారేమో చాలాపట్టుదలపట్టుచున్నట్లును, చర్చలు తీవ్రముగ జరుగుచున్నట్లును విన్నాను.

దే. భ—ఆవిషయములో గూడ మనమాదుర్ద పడ నవసరములేదు. ఇప్పుడే సభనుండి వచ్చిన వారివల్ల విన్నాను. దేశీయనాయకులందరు అభిప్రాయభేదములను వీడి యేకమైనారట. దాసుగారు మొట్టమొదట కొంతపట్టుదలపట్టిరో చివరకు అంతశాంతమువహించి, గాంధిమహాత్ముని తీర్మానమునంతయు తానే మహాసభలో ప్రవేశపెట్ట నంగీకరించెనట. ఆంధ్రనాయకులలో పట్టాభి శీతారామయ్యగారు మిక్కిలి రమ్యముగను గంభీరముగను, విరోధివాదనలను ఖండించుచున్నారట.

దే. సీ—భేష్. బాగున్నది. అయితే, సభ మనమనుకున్నట్లు 10, 15 రోజులదాకా పోకుండా, త్వరలో ముగియుననుకుంటాను.

దే. భ—ఆ. ఈరాత్రి యెంతప్రొద్దు పోయినను విషయములన్నింటిని నిర్ధారణచేసి తీరెదరట, ముఖ్యమయిన విషయములు రెండింటిని నిశ్చయించిరి. ఇక తక్కినవి యెంతసేపు?

దే. సీ—ఏవి ఆరెండూ? కాంగ్రెసుమతమును మార్చుట, సహాయనిరాకరణ పూర్తి తీర్మానమూనా ?

దే. భ—అవును అవియే ముఖ్యవిషయములు.

దే. సీ—రమ్ము- ఆసభదగ్గరకు బోయి ఇంకా విశేషము లేమయినా

తెలియునేమో కనుగొందము. రేపుదయం మహాసభతప్పక ప్రారంభమగు ననుకుంటాను.

దే. భ—ఆ- సందేహములేదు- మనము భయపడ్డందుకు మరేమిఅడావుడి లేకుండాపోయింది. పోదామురండి.

(నిష్క్రమింతురు)

36-వ అఖిల భారత జాతీయ మహాజనసభ,

(నాగపురమునందు) 20,000

సేలం విజయరాఘవాచార్యులుగారాధ్యక్షులు,

---

సభావేదికపై గాంధి, లజపతిరాయ్, నెహ్రూ, మహమ్మదాలి, షౌకతాలీ, పాల్, దాస్, బెసెంట్ వగయిరా.

[సేలం- వి. అధ్యక్షక పీఠమున]

బాలభటులు:

("ప్రార్థన) సుజలాం సుఫలాం"

ప్రబోధము

వరభూమి మనపుణ్యభాగ్యంబురా
భరతమాతకు సేవభారంబురా॥ పల్లవి॥

1 భూలోకమునకెల్ల ముత్యంబురా
తన్మాతలంబున సూర్యచంద్రులురా
భరతతల్లిమనకు సర్వంబురా
పూర్వజన్మ సుకృతపుణ్యంబురా॥ వర॥

2 ధీరులనుగన్న పృధ్వీస్థలమురా
వీరమాత యనెడుపేర్గాంచెరా
మానులనుగన్నట్టి మనతల్లిరా
క్షత్రియులగన్నట్టి శౌర్యాద్రిరా ॥వర॥

3 భరతవంశముగన్న పౌరధాత్రిరా
పదియవతారముల పావనిరా
భీష్మద్రోణుల గన్న పృధ్వీమణిరా

భీమార్జునుల గన్న ప్రియభూమిరా ॥ వర ॥
4 మంత్రశక్తికిగొప్ప యంత్రంబురా
పతిభక్తి శక్తిగొప్పదు మేటిరా
కర్మయోగము కగ్రిగణ్యంబురా
సత్యాగ్రహ వ్రత సద్ధర్మరా ॥ వర ॥

అధ్య—మహాజనులారా, నిన్నటిదినము విషయనిర్ధారణసభ జయప్రదముగా ముగిసినది. భేదాభిప్రాయముల విడనాడి, మననాయకులందరును కలసి విషయములను నిర్ధారణ చేసియున్నారు. అందుముఖ్యమైనవిషయములు మొదటిదికాంగ్రెసుమతమునుమార్చుటయును, రెండవది సహాయనిరాకరణ సంపూర్ణ తీర్మానము నామోదించుటయు నైయున్నది. ఇందు మొదటి తీర్మానము శ్రీ మహాత్మా గాంధిగారుపాదించెదరు గావున తామెల్లరు సావకాశముగా విని చర్చించెదరని మిమ్ము వేడుచున్నాను.

(కరతాళములు చెలరేగ గాంధి లేచును.)

గాం—దేశీయ మహాసభ్యులారా, హిందూ ముసల్మాను సోదరులారా, నేనీ తీర్మానమువిషయమై యెక్కువగా జెప్పదలచుకొనలేదు. శ్రీ లాలాలజపతిరాయిగారు వచ్చియున్నారుగావున నాభారమునుకొంత వారువహించి యీవిషయమునవిపులముగ మీకు దెల్పగలరు. నేనును రెండుముక్కలుమాత్రము జెప్పి తీర్మానమునుపపాదించెదను.

ఈ విషయము సామాన్యముగ మీరందరు కోరునదియు మీకెల్లరకు తెలిసినదియునై యున్నది. ఈజాతీయమహాసభయొక్క ముఖ్యోద్దేశము సత్వరస్వరాజ్యసంపాదన మని మీకు తెలిసినవిషయమే. మనప్రస్తుత తీర్మానాంశము స్వరాజ్య సాధనకు సంబంధించియున్నది. ధర్మ విరుద్ధముగాని అన్ని మార్గములను మనము స్వరాజ్య ప్రాప్తికై ప్రయత్నింపవచ్చును. మనప్రస్తుత జాతీయ మహాసభా నిబంధనలు మన

కట్టి అవకాశమును గలిగించుటలేదు. బ్రిటిషు సామ్రాజ్యమునకు లోబడిన స్వరాజ్యమునే సంపాదించవలయుననికాంగ్రెసుతత్వము బోధించుచున్నది. ఇది న్యాయమునకు దూరము, ధర్మమునకు విరుద్ధమును అయియున్నది. కావున ఆతత్వమును వెంటనే మనము మార్చుకొనవలయును. అట్లని,

తే॥ గీ॥ బ్రిటిషురాజ్య సంబంధంబు విడువుడనుచు
నిపుడె మిమ్ముగోరు చుండలేదిచట నెవరు;
అవుసరంబైనఁ బ్రజలయిష్టాను సార
ముగను వర్తింప నవకాశములను నేడె
జేసికొన వేడుచుంటి దేశీయులార॥

మరియు,

చ॥ వలయు స్వరాజ్య సాధన కుపాయములిప్పుడె నిర్ణయింప, లో
కులకును లొంగి సాయమును గోరుట గౌరవహీనమెప్పు, డా
ర్యులవరసంతతిన్ జననమొంది ప్రశస్తిగడించిన భారతీయ శూ
రులము స్వశక్తిలేనిగతి రోషము వేషము బాసియుందుమే॥

కావున నీమార్పు అత్యంతావశ్యకము. ఇందుకు వ్యతిరేకులుగనుండు వారు "మనమిప్పుడే బ్రిటీషు సంబంధమును విడువజాల"మని జెప్పవచ్చును. మనమెన్నాళ్లితరులపై నాధారపడి యుండ గలమని నేను వారిని ప్రశ్నించెదను. మరియు,

సీ॥ పరులపైనాధార పడుటకన్నను వేరు
నీచంబులేదన్న నీతివినుడు
ఒరులసాయంబుకై కరముజాపుటకన్న
హీనంబులేదంచు నెరుగరయ్య
మనశక్తులన్నింటి మరచియన్యుల దేబి
రించుకన్నను రోతలేదునుండి
మనజాతి యౌన్నత్యమునకు సమ్మతమౌ ప
థముదప్పుకంటె దోషమును లేదు

తే॥ గీ॥ ఇల స్వశక్తికి మించినదేది లేదు,
మనదుశక్త్యానుసారవర్తనమునందె
మోక్షపదవిని సాధింపబూనుకొనుడు
పిదప నీశ్వరుడున్నాడు భీతియేల॥

నేనింతకన్న నెక్కువగా జెప్పదలచుకొనలేదు. మనముజేయు మార్పెంత మాత్రమును విపరీతముగ లేదు. శాంతియుతమైనట్టియు, న్యాయసమ్మతమైనట్టియు, నన్నిమార్గములను స్వరాజ్యము సంపాదించుట కాంగ్రెసు సభయొక్క ముఖ్యాభిప్రాయమని ధైర్యముతో చాటుచున్నాము. ఈతీర్మానము నేకగ్రీవముగ నంగీకరించు శక్తిసామర్థ్యములను పరమేశ్వరుడు మీకొసంగుగాత యని ప్రార్థించుచు నింతటితో విరమించుచున్నాను.

(కరతాళములు జేయ్ శబ్దములు.)

అ—తరువాత శ్రీలాలాలజపతిరాయిగారు తీర్మానమును బలపరచెదరు, (కరతాళములు)

లజ—మహాజనులారా, సోదర సోదరీమణులారా, మహాత్మాగాంధిగారుపపాదించిన కాంగ్రెసుమతమును మార్చు తీర్మానమును నేను సంపూర్ణముగనామోదించుచున్నాను. ఈకాంగ్రెసుమత విషయములో కొంత పూర్వగాధగలదు. ఈదేశీయమహాసభా చరిత్రమును చదివినవారికి సూరత్ నగరమున జరిగిన కాంగ్రెసు మహాసభ జ్ఞాపకముండవచ్చును. ఆసభయందు రెండు పక్షములవా రేర్పడిరి. బ్రిటీషుసంబంధమును తప్పకగోరువారు మితవాదులనియు, తదితరు లతివాదులనియు పేర్కొనబడిరి. ఈ సమస్యపైననే కాంగ్రెసు రెండుపక్షములుగా చీలినది. అప్పుడే కాంగ్రెసు మతమనునది యొకటియేర్పరుపబడెను. అప్పుడు మితవాదులబలమెక్కువగుటచే వారియిష్టానుసారము జరిగినది. ఆసభకు నేనుకూడ వెళ్ళియుంటిని. ఆకాంగ్రెసు మతమునకంగీకరించనివారా సభలో నుండరాదనికూడ తీర్మా

నింపబడినది. అట్టినిర్బంధమువలన పూజ్యనీయ శ్రీ అరవింద ఘోష్ మహర్షివంటి దేశభక్తాగ్రణికి కూడ ప్రవేశము తొలగిపోయినది. ఆకారణముచేతనే నేను అసలు మతమునకు పై నిబంధనకునుగూడ వ్యతిరేకముగా నుంటిని. ఆమతమప్పటినుండియు చెల్లుబడి యగుచు నేటికి మరల విచారణలోనికి వచ్చినది. కలకత్తాలో, మీరంగీకరించిన సహాయనిరాకరణ సిద్ధాంతమున కీమతమును మార్చుట అనుగుణ్యముగా నున్నది. అదియునుగాక

ఉ॥ భావముమారిపోయినది భారతజాతికి నాంగ్లరాజ్యపూ
ర్షావళిపట్లనేడు, హృదయంబుల నమ్మిక మెల్లఁబూర్తిగా
లోవగఁ జేసి దేశమును మోసముజేసిరి యెన్నొసారు లిం
కేవిధి వారితోఁ గలసి యెల్లపుడుండుము మీరెయెంచుడీ॥

యెన్నోసారులు మోసముచేసిరనుటలో విపరీతమేమియు లేదు.

సీ॥ "డాల్ హౌసి" ప్రభువుమాటల పసజూపించి
వాగ్దానముల నెన్నొ భంగపరచె
విక్టోరియారాజ్ఞి ప్రేమతో నొసగిన
పత్రికటనక కర్జను భంగపరచె
అహహ, నేడుమసలాయడ్ జార్జి మనకండ్ల
పట్టపగలు దుమ్ముగొట్టలేదె
వారువీరననేల ప్రభుసాంప్రదాయమే,
మోసభావమునందు మునిగియుండె

తే॥ గీ॥ అట్లుకాదేని నీతిగలట్టి వారి
వేలుమడిచిచూపించుడీ బ్రిటిషురాజ్య
వర్గమందున, "మాంటేగు" ప్రభువెయగునో
"డయ్యరోడ్వ్యయర్"లగుదురో? వెయ్యియేల
నెవ్వరేనియు గలరేమొ యెంచరయ్య.

ఈమధ్య పెల్బోర్న్ ప్రభువుగారు హిందూదేశము నందలి ఆందోళనాపరులు అపోహలను అసత్యములను వ్యాపింప జేయుచున్నారనియు అట్లుచేయుట వెంటనే ఆపుదల చేయవలయుననియు ప్రభుత్వమువారిని హెచ్చరించి యున్నారు. నేను ఆయనకును, ఆయన దేశీయులందరకును బహిరంగముగా నీసభావేదికపైనుండి యీ 30,000 వేలమహాజనుల యెదుట చాటునది యేమనగా,

మ॥ తెలియన్ జెప్పెదనీసభాముఖమునన్ తెల్లంబుగా నాంగ్ల పూ
ర్షులకున్ వారల రాజనీతియెడలన్ సుంతైనవిశ్వాస మెం
దులలేదంచును, రాజ్యవర్గమునకున్ దుర్బుద్ధిజన్మించి వా
రల ప్రఖ్యాతి నశింపజేసెనని ధైర్యంబొప్పగా జాటెదన్॥

ఇట్లని ఆంగ్లేయప్రజలపై మన కెట్టివిరోధమును గలదని నేను చెప్పుట లేదు.

తే॥ గీ॥ ఆంగ్లజనులపట్ల విరోధమసలులేదు
బ్రిటిషుప్రభువర్గ మక్రమప్రేరితమయి
బానిసలమాడ్కి మననెల్ల పరిగణింప
వారిరాజనీతియెడ విశ్వాసమెల్ల
సాంతమునశించె, వేరు ద్వేషంబులేదు॥

ఈకాంగ్రెసు మతమునుమార్చుటలో మనమిప్పుడే వారిసంబంధము ఛేదించవలెననిగాదు. ఎప్పుడు అవసరమో అప్పటికట్లుచేయ నవకాశమును గలిగించుచున్నాము. ఇప్పటికేనియు

చ॥ మననియమంబులన్నిటిని మన్నన జేసి, స్వతంత్రసౌఖ్యమున్
గని భువిస్వేచ్ఛనుండు నవకాశ మొసంగియు, వారితో సమం
బున మననెల్ల జూచునెడ పోదుమె వారలవీడి? అట్లొనర్పకే
మన ననిశంబు బానిసలమాడ్కి గణించుచు గర్వదృష్టితో
గనునెడ వారికిన్ మనకు గల్గునెపొత్తు నిమేషమేనియున్॥

మనలో కొందరికింకను వారిపై నాశపూర్తిగా విడిపోయియుండలేదు. ఎన్నటికైనను వారు సద్భావముతో మనకు స్వరాజ్యమిత్తురను నాశ కొందరిని వేధించుచుండవచ్చును.

శా॥ ఆసల్ బెట్టుకొనంగబోకుడిక నీ యాంగ్ల ప్రభుత్వంబు మీ
కీ సామ్రాజ్యమునన్ సమానమగు హక్కే నాటికేనిచ్చునం
చాసల్ దీరిన దెన్నడా "డయరు" పంజాబ్ దేశమున్ జెండెనో!
ఆసల్ సాంతముదీరె నాఘనుడు "లాయిడ్ జార్జి" ఇస్లామునున్
మోసంబెన్నడు జేసెనో యపుడె, వ్యామోహంబికన్ మానుడీ॥

ఆర్యజాతికి బుట్టిన ధీరులగు మీరెల్లరరును స్వశక్తిపై నాధారపడియుండెదమని బహిరంగముగా ధైర్యముతో చాటుదురనికోరుచు విరమించుచున్నాను.

అధ్య—తరువాత జిన్నాగారుపన్యసింతురు.

జిన్నా—మహాజనులారా, గాంధిగారుప—

(మహాత్మా గాంధి "అనుడు" అను కేకలు)

సరే, మహాత్మాగాంధిగారుపపాదించిన తీర్మానమును నేనంగీకరించుటలేదు. లజపతిరాయిగారు ప్రభుత్వము వారిపై మోపిన నిందలన్నిటిని నేను నమ్ముచున్నాను. కాని శాంతముచే స్వరాజ్యమును పొందుదమనుటను నేనంగీకరింపను. రక్తప్రవాహములు కట్టనిది స్వరాజ్యము రాదు. అందుకు మనము సిద్ధముగా లేదు. తగిన ఆయుధములు లేనిదే ఆవేశమున తొందరపడి మనము దూకకూడదు. ఈతీర్మానము నిప్పుడంగీకరించినచో మరల మార్చుట చాలకష్టమగును. కావున బాగుగా యోచించెదరని హెచ్చరించుచు, నీ తీర్మానము నంగీకరింపకుందురని మిమ్ము వేడుచున్నాను. (చప్పట్లు)

అధ్య—తరువాత ఆంగ్ల కార్మిక సంఘపక్షమున ప్రతినిధిగా యీ మహాసభకువచ్చిన కలనల్ వెడ్జివుడ్‌గారుపన్యసించెదరు. వారికి

స్వాగతమిచ్చి తామెల్లరు సావధాన చిత్తులరై వినుడని ప్రార్థించుచున్నాను.

వెడ్జి—అగ్రాసనాధిపా, భారతీయమిత్రులారా, నాకు స్వాగతమిచ్చి యిచ్చట మాట్లాడ నవకాశముగలిగించి నందులకు మీ కెంతయు కృతజ్ఞుడను. మా కార్మిక సంఘములతరఫున మా సహాయమును వాగ్దానమును చేయుటకు నన్ను పంపియున్నారు. పాశ్చాత్యులగు మేమును మీరును అన్యోన్య మైత్రిని గలిగియుండిన గాని ప్రపంచకశాంతి లభింపదు, ప్రభుత్వ వర్గమువారు మీకు సంపూర్ణ స్వరాజ్యము నియ్యక అధర్మమార్గమున ద్రొక్కుచున్నారు. అందుకొరకు మీరన్ని విధములను సక్రమాందోళన సలుపవచ్చును. అట్లుచేయుటలో మేమును హృదయపూర్వకముగ మీకు తోడ్పడుదుము. మీరు తొందరపడి బ్రిటిషు సంబంధమును విసర్జించినయెడల మీరట్టిసాయమును గోల్పోయినవారగుదురు. మీరును మేమును అన్యోన్య సంబంధమును గలిగియుండకున్న యిరువురమును చెడినవారమగుదుము. కావున తొందరపడవలదని మరల మిమ్ము హెచ్చరించుచు నాయొక్కయు, మాసంఘముయొక్కయు, వందనములు మీకర్పించుచు విరమించుచున్నాను.

అ—పిమ్మట బిపిన్ చంద్రపాలుగారుపన్యాసము నిచ్చెదరు.

పాల్—అగ్రాసనాధిపా, మిత్రులారా, మహాత్మాగాంధిగారిచే నుపాదింపబడి శ్రీ లాలాలజపతిరాయి వగయిరా ప్రముఖులచే బాగుగ చర్చింపబడిన ఈతీర్మాన విషయమై నేనెక్కువగా జెప్ప నక్కరలేదు. ప్రభుత్వము యొక్క నిజ సాంప్రదాయమును నిజస్థితిని యెరిగిన వారెవ్వరును వారిసహాయముపై నాశబెట్టుకొనరు. బ్రిటీషురాజ్యము రెండువిధములై యున్నది. అన్యజాతులకు నివాసమై వారిచే పాలింపబడుచున్న దేశముకొంత. అట్టిదే మనదేశము. అట్టి దేశములయందు ఆర్థిక కాంక్షయే వారికి ప్రాముఖ్యము. పాశ్చాత్యసాంప్రదాయమేయట్లుండును.

సీ॥ ఆర్థిక వృద్ధియేయభిలాషగాగల
దేశ సంబంధంపుటాశ యేల ?
తమ స్వలాభాపేక్ష దక్క సన్యులక్షేమ
మరయని ప్రభుసహాయ్యంబదేల
తమజాతిగొప్పకై యుత్తమ జాతియను
సహంకారులస్నేహమే గోరుటేల
కృత్రిమ బుద్ధియు గేవలపశుబలం
బున నేలువారి వ్యామోహమేల

తే॥ గీ॥ నాగరకత నెరుగని యనాధులమట
ఇంకనుస్వరాజ్యమును నిర్వహించుకొను స్వ
శక్తిలేని మూఢులమట, చాలుచాలు
మనకు వారికి యెట్టి సంబంధమింక॥

మరియు,

సీ॥ అసహాయులగు స్త్రీలు పసిపాపలనని
పంజాబ్ హత్యకుపశాంతి జరుగలేదు.
స్వమతగౌరవమునాశనమా పరిస్థితు
లిస్లాములను వీడి యేగలేదు.
రావణుఁ మరపించుకాలతు శాసనా
ద్యసురశాసనములింకారలేదు
హైందవభూమి నేయడవిజాతులో
యుందురనుచు హేళనసేయుటాగలేదు

తే॥ గీ॥ ఇవి యవియునేల మనస్వరాజ్యప్రతిష్ట
సలుప వారింత వరకును దలచలేదె
ఇంక మనకేటియాశ వారిత్తురనుచు
చాలుచాలు నింతట నైన మేలుకొనుడు॥

అంతేగాక మన దేశమునకు,

తే॥ గీ॥ వెనుకపడిన దేశంబని పేరు బెట్టి
క్రమతమునకెల్ల నభివృద్ధిగాంచునట్లు
చేయుచున్నారమని చాల జెప్పుకొనెడు
స్వార్థమతులకు మనకు సంబంధమేల॥

ఇప్పుడే మనము వారి సంబంధమును విడనాడకపోయినను, అట్లుచేయుటకిప్పుడే సంసిద్ధులమై యుండవలయునని నామనవి. కావున యీ తీర్మానమును తామెల్ల రేకగ్రీవముగా నంగీకరింతురని ప్రార్థించుచున్నాను. (కరతాళధ్వనులు)

అ—సభాసదులారా, తీర్మానము సంపూర్ణముగాచర్చింపబడినది. గనుక ఇక తమ యంగీకారమునకై సమర్పించుచున్నాను. ఈ తీర్మానమున కనుకూలురగు వారు చేతులెత్తుదురని ప్రార్థించుచున్నాను. ("అందరు అందరు" అను కేకలతో చేతులెత్తుదురు.)

ఇంక వ్యతిరేకు లెవరైన యున్నచో దెలుప ప్రార్థితులు.

(1, 2, మాత్రము చేతులెత్తుదురు)

(కరతాళములు జెయ్ శబ్దములు చెలరేగ
తీర్మాన మామోదింపబడినది.)

ఈతీర్మానము లెక్కలేని అధికసంఖ్యాకులచే నామోదింపబడినది. ఇక సహాయనిరాకరణ తీర్మానమును చర్చించవలసియున్నది. ఈ తీర్మానము విషయములో విషయనిర్ధారణ సభలోనే సంపూర్ణచర్చ జరిగినది. గాన మనమెక్కువ కాలము వ్యర్థపుచ్చనక్కరలేదు. నాయకులందరుగూడి చర్చించి సవ్యమైనసిద్ధాంతమును జేసియున్నారు. ఆతీర్మానము చిత్తరంజనదాసుగా రుపపాదించ బోవుచున్నారు. తామందరంగీకరించి త్వరలో నీమహాసభను ముగింతురని ప్రార్థించుచున్నాను.

(కరతాళధ్వనులు రేగ చిత్తదాసు లేచుచున్నాడు.)

NATIONAL ARCHIVES OF INDIA

దాసు — మహాజనులారా, నేనిదివరకీ తీర్మానమునకు కొంత ప్రాతికూల్యముజూపితినని మీరెరిగియేయుందురు. కాని సహాయనిరాకరణ సిద్ధాంతమునంగీకరించువారలలో నేనుగూడ నొకడనని తామెరిగియే యుందురు. ఆచరణయోగ్యమగు కార్యక్రమము నేర్పరుపవలసియున్నది. ఇన్నాళ్ళనుండియు వెనుకముందాడుచు నేడు మన నాయకులందరు గలసి సర్వజనామోదితమగు తీర్మానము నేర్పరచియుండుటచే నేనాతీర్మానమునందు దృఢవిశ్వాసముగలవాడనై తమయెదుట చెప్పియొప్పింప సంసిద్ధుడనై తమయెదుటికి వచ్చితిని. నేనుపపాదించబోవు తీర్మానస్వరూపమును ముందు మీకు తెలియబరచెదను.

తే॥ గీ॥ తొల్లి పంజాబ్ ఖిలాఫతు దుండగములు
మరల నెన్నంటికేనియు జరుగకుండ,
దేశగౌరవమునుగాచు దీక్షతోడ
జన్మహక్కైన స్వాతంత్ర్య సాధనంబ
నగు "సహాయనిరాకరణంబు" నాచ
రింప నీమహాసభ నిర్ణయింపుడయ్య॥

మరియు, తే॥ గీ॥ ప్రస్తుతప్రభుత్వమునకు సంబంధమౌ స
హాయముని రాకరించుట యాది, తుదకు
పన్నులిచ్చుట మానుటవరకు శ్రీ మ
హాత్మగాంధి తీర్మానమునంత నాచ
రింప నీమహాసభ నిర్ణయింపరయ్య॥

ఈ దేశీయమహాసభ యెల్లరిని హెచ్చరించుట యేమనగా,

సీ॥ తలిదండ్రులార, మీతనయులను ప్రభుత్వ
బడులకంపుట మానవలయునిపుడె
విద్యార్థులార, మీవిద్యాలయముల త
క్షణమే విసర్జింప సాగరయ్య

అధికారులార, మీయాధీనమందున్న
బడుల మాలిన్యంబు బాపరయ్య
* న్యాయవాదులు మీరలన్యాయవృత్తి చా
లింపయత్నములు హెచ్చింపరయ్య
వర్తకులార యే పరదేశవస్తువుల్
గొనక నార్థికవృద్ధి గోరుడయ్య

తే॥ గీ॥ స్త్రీపురుషులెల్ల త్యాగసంసిద్ధులగుడు
గ్రామసంఘంబులెందు నేర్పరచుడయ్య
సేవకాసంఘముల నెన్నో జేర్పరయ్య
అన్నిటికి నాసరంబైన యట్టిధనము
విరివిగాతిలక్ నిధిని యేర్పరచుడయ్య॥

మరియు జాతీయ మహాసభ జేయు మనవి యేమనగా,

మ॥ జను లెల్లన్ వలదంచు ఘోషిలగ లక్ష్యంబెంతయున్ లేక నె
మ్మనమందాశల గొన్ని బెట్టుకొని సన్మార్గంబునన్ రాక శా
సన సభ్యత్వము నందపోయిన ఘనుల్ స్వాంతంబులన్ ద్రిప్పి త
త్క్షణమేరందు స్వరాజ్యపున్ రథములాగన్ మారు జేదోడుగా॥

ఇంకను, ఈమహాసభ ప్రజలకును పోలీసు యుద్ధభటులకును స్నేహము ప్రబలుచున్నందుకు సంతసించుచున్నది. ప్రభుత్వోద్యోగులు రాజకీయసభలకు బహిరంగముగా వెళ్ళుట యుద్యమమునకు ధనము విరివిగానిచ్చుట మొదలగురీతుల దేశసేవ సేయుదురని గోరుచున్నది. హిందూ మహమ్మదీయ బ్రాహ్మణ బ్రాహ్మణేతర వైరములను వెంటనే విడిచిపెట్టుటకు ప్రజలందరిని హెచ్చరించుచు పంచములపట్ల మన దృక్పథమును పూర్తిగా మార్చుకొన వలయునని గోరుచున్నది. మరియు ఈమహాసభ గావించు నాఖరుమనవి యేమనగా

మ॥ మరువన్ బోకు డహింసయే మనకు సన్మార్గంబటంచున్ నిరం
తర దాస్యానల మార్చగోరు నెడ శాంతంబన్న చన్నీరు స

* ప్రస్తుత ఇంగ్లీషుకోర్టులలోని న్యాయవాదులు.

[illegible]త్వరమేజల్లుడి యగ్నికాజ్యమటులన్ దౌర్జన్యమన్యాయమున్
పెరుగన్ జేసి యనర్థకంబవనిలో పెంపొందగా జేసిరున్ ॥

సభ్యులారా, తీర్మానమునంతయు తమకు వినిపించియున్నాను ఈయంశములన్నియు నిప్పుడే యాచరణలో పెట్టవలసినవి. మిగిలిన యంశములు బోలీసులకును యుద్ధసైనికులకును, ప్రభుత్వోద్యోగులకును సంబంధించియుండును. చిట్టచివర యంశము పన్ను లెగగొట్టుట. ఈవిషయము లవుసరమైన యప్పుడు ఆచరణలో బెట్టుట ప్రత్యేకమహాసభవారుగాని లేక కాంగ్రెసుఉపసంఘము వారుగాని నిర్వహించెదరు

ఈవిషయములో దాసు మీకేదో జెప్పినాడని తలచకుడు. త్రికరణశుద్ధిగా నేను నమ్ముటచే ఈతీర్మానమును తమయెదుట పెట్టితిని.

మ॥ తలపన్ బోకుడు "దాసు" మీకిటుల బోధల్ చేయుచున్నాడటం
చలహిందూభువిదాసుడొక్కడుమిమున్ యాచించుచున్నాడు మా
టలనెన్నో ఏచియించి వాక్పటిమ జాటన్ గాదు, నన్ గోరు ప్ర
శ్నల ప్రత్యుత్తరమీయగా దగిన విశ్వాసంబునన్ బల్కితిన్ ॥

కావున మీరే ప్రశ్నలడిగినను ప్రత్యుత్తరమిచ్చుటకు సిద్ధముగానున్నాడను. నేను చిట్టచివరకు తమకు చేయుమనవి యేమనగా,

మ॥ ఇదెదేశీయ మహాసభా భవనమందెల్లత్రిస్వాతంత్ర్యసం
పదనార్జింపగ రండురండనుచు ప్రేమన్ మిమ్ము ప్రార్థించు స
త్సుదతీరత్నము దేశమాతకొగి సంతోషంబుగూర్పంగ బో
వుద మాలస్య మికేలరండు వడి సంపూర్ణానురాగంబునన్ ॥

మీరెల్లరు తీర్మానము నేకగ్రీవముగా నంగీకరించెదరని నమ్ముచు నింతటితో విరమించుచున్నాను.

(కరతాళములు చెలరేగుట.)

అ—మౌలానా మహ్మదాలీగారు తీర్మానమును బలపరచెరు.

(కరతాళములు)

మహా—అగ్రాసనాధిప, మహాసభ్యులారా,

దాసుగారు చాలసమర్థతతో నుపపాదించిన తీర్మానవిషయ

ములో నింకెవ్వరును ఎక్కువగా జెప్పనక్కరలేదు. దేశాంతరమునకేగి ఖిలాఫతువ్యవహారములో మేముకృషి సలిపిసలిపి, తుదకు నిష్ఫలమనోరథులమై యిల్లు సేరితిమి. ఇంక పరులపై నాధారపడుటగాని, వారిసాయము నాశించుటగాని, వారి సంబంధమును గోరుటగాని బుద్ధితక్కువయని నిశ్చయముగా తోచుచున్నది. ఇంక మనము శక్తిని మనమేసాధించుకొనవలయును ప్రస్తుతము కత్తితీసికొనిపోట్లాడు సామర్థ్యము మనకు లేదని తమ రందరికి తెలియును కావున మహాత్మాగాంధిగారు మనకుపదేశించిన యీ నూతనసహాయనిరాకరణమే మనకుశరణ్యము. ప్రస్తుత తీర్మానము సర్వజనామోదిత మగునట్లు బొందుపరుప బడియున్నది. కావున తమరెల్లరేకగ్రీవముగా నీతీర్మానము నంగీకరింతురని వేడుచున్నాను.

(కరతాళములు)

అ—పిమ్మట బెక్ న్స్పూర్ గారుపన్యసింతురు. మనదేశముపై వారికిగల గాఢాభిమానము చొప్పున ఇంగ్లాండునుండి కార్మికపక్షపు ప్రతినిధిగా వచ్చియున్నారు. వారికి స్వాగతమిచ్చి వారిసందేశమును వినుట మనవిధియైయున్నది.

(కరతాళములు రేగ)

బెక్—అధ్యక్షకా, మహాసభాసభ్యులారా,

మీరెల్లరు నాకొసగిన హృదయపూర్వక స్వాగతమునకు వందనములు. మీయెడల ప్రభుత్వమువారెంత వైరభావములు గలిగియున్నను, బ్రిటీషు "లేబరు" అనగా కార్మికపక్షమువారు మట్టుకు మంచి యభిప్రాయమును గలిగియున్నారని దెల్పుటకే నేనిటకువచ్చియుంటిని.

బ్రిటీషు సంబంధమును మీరుంచుకొనినను వదులుకొనినను మేముచేసెడు సాయమును మాత్రము మేముచేసితీరెదము. మీదేశమునకు తక్షణమే సంపూర్ణ స్వాతంత్ర్యమిచ్చితీరవలయునని మేము గట్టిగా నమ్ముచున్నాము. మీదేశమున జాతీయవికాసము అద్భుతము.

మీకుతగిన సాయకులు లభించిరి. మా కార్మిక సంఘసాయముగూడ మీకునిశ్చయము. ఇవి యన్నియు శుభసూచకములు.

మీతూర్పు దేశముయొక్క సాయములేనిది మాపాశ్చాత్య దేశమొక్కనిముసమును బ్రతుకజాలదు. మీకును మాకును అన్యోన్యమేర్పరుచుటకే, మా కార్మికపక్షము వారమందరము మీకుసాయము చేయనిశ్చయించుకొంటిమి. గాంధిమహాత్ముని యుపన్యాసములువిన్నాను. అట్టి మహాపురుషులు కొందరు మాదేశమునున్న మేము చాల సంతోషించెదము.

చివరకు, మీకెల్లరికి రాజకీయ ఆర్థిక ఆధ్యాత్మిక విషయములలో సంపూర్ణస్వాతంత్ర్యము గలుగుగాత యని సర్వదాపరమేశ్వరుని ప్రార్థించుచుండెదను. మీ కాఫలసిద్ధిగలిగినచో మీ మూలమున పాశ్చాత్యులమగు మేముగూడ నట్టిస్వాతంత్ర్యమును పొందుటకవకాశము కలుగును. తమయెదుట పలుక నవకాశమిచ్చి నన్నాదరించినందుకై మీకు వందనము లర్పించుచు నింతటితో విరమించుచున్నాను.

అ—తదుపరి బిపిన్ చంద్రపాల్ గారుపన్యసింతురు.

పాల్—మహాజనులారా,

ఈతీర్మానానుసారము ఎల్లరును ఒక్క సంవత్సర మాచరించెదరేని స్వరాజ్యమీయొక్క వత్సరములో వచ్చుటనిశ్చయము. ఈయొక్క సంవత్సరము పాటు విద్యార్థులు తమచదువును ప్లీడర్లు తమవృత్తిని వర్తకులు విదేశవస్తువ్యాపారమును మానుకొందురేనిచాలును. ఈసంవత్సరములోనే స్వరాజ్యము తప్పకవచ్చును. తమరందరేకగ్రీవముగా నీతీర్మానము నామోదించుటయే గాక తక్షణమే ఆచరణలో బెట్టెదరని గూడకోరుచున్నాను.

అ—తరువాత శ్రీలాలా లజపతిరాయ్‌గా రుపన్యసించెదరు

లజ—ఆర్యులారా,

ఈతీర్మానము అన్నిపక్షములవారికి ననుకూలముగా పొందు పరుపబడియుండుటచే ప్రాతికూల్యమే దొలగిపోయినది. బ్రిటీషు వారిశక్తి కేవలము పోలీసుదళముపైన మాత్రిమే ఆధారపడియుం డలేదు. మనలోమనను చీలదీసి భేదములు గలిగించి కొంతబలమును సంపాదించుకొను చున్నారు. మనమెల్లరమును తీర్మానానుసారము జరిపెదమేని వారికట్టి యవకాశములు దొరకవు. శాసనసభా బహి ష్కారము దేశమున చక్కగా నెరవేరినది. ఏదోవిధముగా శాసనసభల లోనికి దూరినవారు మన ప్రతినిధులు గారని నిరంతరము సింహధ్వ నులు సేయుచుండవలయును. తమ రందరును ఈ తీర్మానము నేకగ్రీవ ముగా నామోదించి దేశమంతటను ఆచరణలో పెట్టుదురని ప్రార్థించుచు విరమించు చున్నాను,

అ—తదుపరి శారదాపీఠ శంకరా చార్యులవా రుపన్యసించెదరు.

వారుమన మత గురువు గావున వారు చెప్పు విషయములను చక్కగా గ్రహించవలయును.

శంక—మహాజనులారా, ఈదేశమున మతగురువు నైననేను, ఈ సహా య నిరాకరణోద్యమము దిగ్విజయము గాంచుగాతయని ఆశీర్వదించుచున్నాను. సర్వత్యాగమును జేసిన నాకును స్వరా జ్యమునకును ఏమి సంబంధమని కొందరనుకొనవచ్చును.

తే॥ గీ॥ సర్వమును సన్యసించి యాశాపిశాచ
బంధముల తెంచుకొన్న నావంటివారి
కీ స్వరాజ్య సంబంధ మింకేటికంచు
దలతురో యేమొయయ్యది తప్పుసుండు.

ఏలయనిన:—

సీ॥ పుత్రమిత్రకళత్రముల పైన వ్యామోహ
మించుకేలేక నశించువరకు
ధనముపై నడియాన దారిద్ర్యమనరోత
స్వాభిలాషయుచాల జచ్చువరకు

గంపెడుగర్వంబు కష్టంబులన భీతి
ఖనులపై వాంఛ సున్నకా వరకు
కైగులసాధించవలెనన్న యార్తియును
బుద్ధిమాలిన్యంబు పోవువరకు

తే॥ గీ॥ ఇన్నియేటికి నైహిక మెల్ల పూర్తి
గానశించి యాముష్మిక జ్ఞానమెవని
కబ్బు నతఁడాత్మపారిశుధ్యమును గాంచు
నట్టి పారిశుధ్యమె స్వరాజ్యంబు మనకు॥

మన ఆత్మగౌరవము గాపాడుకొనుటయే మన ఆత్మస్వాతంత్ర్యము. అట్టి ఆత్మగౌరవమును గాపాడుకొన నెంచితిమేని దుష్టరాజ్యాంగమునకు మనమేమాత్రమును తోడ్పడరాదు. అట్లుచేయుట మనమతవిరుద్ధము గౌరవహీనమునైయున్నది. చేయుచేయిగలసినగాని మ్రోగదు. కావున వారి చేతికి మన చేతులు గల్పకున్నచో వారిదౌర్జన్యమును దుండగములును ఇక మ్రోగజాలవు. అదియే నిరాకరణభావము. ఈనిరాకరణభావము బౌద్ధమతమునుండి వచ్చెనని కొందరందురు. నేనట్లుజెప్పక హిందూమతమునుండియే వచ్చెనని నొక్కి చెప్పుచున్నాను. ప్రభుత్వమునకు నాయుధ ప్రాతికూల్యము జూపజాలనప్పుడు దౌర్జన్యరహిత సహాయ నిరాకరణమే శరణ్యము. విద్యావిషయిక బహిష్కారమును నేను 15 సంవత్సరములనుండి చెప్పుచున్నాను. ఇప్పటికి దేశీయ మహాజనసభ యొప్పుకొనినది. హిందూమహమ్మదీయ సమ్మేళనము చాల ప్రాముఖ్యమైనది. అందు రాజకీయముకంటె నాధ్యాత్మిక ప్రాముఖ్యతమెండు. బ్రాహ్మణ బ్రాహ్మణేతర జాతీయ మితవాద భేదము లనర్థదాయకములని నేను హెచ్చరించుచున్నాను. ఎల్లరును కలసిమెలసి వర్తించుచు మీనగర పవిత్రతను సార్థకము జేసెదరని నమ్ముచు నింతటితో విరమించుచున్నాను.

(కరతాళములు)

అ—తరువాత కస్తూరి రంగయ్యగారు తీర్మానము నామోదించెదరు.

క—మహాజనులారా, దాసుగారి తీర్మానమును నే నామోదించుచున్నాను. ఈతీర్మానము సమగ్రముగను ఆచరణ యోగ్యముగ నున్నది. అన్నిటికిని మూలమగు జాతీయవిద్యను భద్రపరుచు చున్నది. జాతీయ పరిశ్రమాభివృద్ధిని పోషించుచున్నది. జాతీయతను నిలుపబెట్టుకొను నవకాశము లన్నింటిని గలిగించు చున్నది. జాతీయశక్తుల నన్నింటిని ఏకీభవింప జేయుచున్నది. కావున ఈ 20000 మందిచే నామోదింపబడిన ఈ తీర్మానము నెవ్వరును ఆక్షేపింపనవకాశములేదు. తమరంద రేకగ్రీవముగ నీతీర్మానము నామోదింతురని ప్రార్థించుచు విరమించుచున్నాను.

అ—మహాజనులారా, తీర్మానము చాలమందిచే చర్చింపబడినది. మహాత్మా గాంధిగారు కొంతసేపు ముచ్చటించెదరు. తదుపరి మీయామోదమునకై సమర్పింపబడును.

(జయధ్వానములు, కరతాళములు మిన్నుముట్టగా గాంధి లేచును)

గాం—మహాజనులారా, హిందూ ముసల్మాను సోదరులారా,

ఈ సహాయనిరాకరణ తీర్మానమును దాసుగారుపపాదించి నా భారమును కొంత వారిపై వేసికొనినారు. తమరెల్లరుగూడి ఆభారమును వహింపసిద్ధముగా నున్నారు. అదినాకు చాల సంతోషము. ఐనను కాంగ్రెసునకు సంబంధించిన ప్రతివారును తీర్మానము నంగీకరించి తీరవలెనని నాతలంపు కాదు. ఎవరైనను తమయంతరాత్మలో నిది చేయదగినపనియని పూర్తిగా నమ్మినయెడల చేయుడు. మేము చెప్పినంత మాత్రముననే చేయకుడు.

పోలీసువారి విషయములో లజపతిరాయిగారు చెప్పినది బాగుగానున్నది. నన్ను బ్రిటీషు సైనికునిగాభావించుకొనుడు. అట్టితరి ఓడ్వయరుగారు జలియన్ వాలాబాగ్‌లో ప్రజలపై తుపాకులను గాల్చుడని నాకాజ్ఞాపించిన ననుకొనుడు. అట్టి యాజ్ఞనుల్లంఘించుటయే నావిధియు ధర్మమును న్యాయమును

ఐయున్నది. ఈవిషయమై నేనుగట్టిగా చెప్పగలను. చివరకు మీకెల్లరకు నేను చేయుమనవి ఏమనగా,

సీ॥ మరువకండికమీరు మాతృదేశపుసేవ
ప్రపథమమని స్వప్నమునన్నైన
మరచిపోకుడహింస మనసాంప్రదాయమౌ
వరధర్మమంచు నెప్పట్లనైన
మరువగావలదు "మాధరణీస్వరాజ్యంబు
సాధింతు"మనెడు నిశ్చయవ్రతంబు
మరువకండెప్పుడు మనకెన్నటికినైన
నాధారము స్వశక్తియగునటంచు
తే॥ గీ॥ మరచిపోకుడి పంజాబుమనుజహత్య,
మరువకుడి ఖిలాఫత్ అవమానములను,
మరచిపోకుడెన్నటికి మీమాతృభూమి,
మరిమరి పచింతు శాంతముమరువకండి॥

అ— మహాజనులారా, తీర్మానమును మీరెల్లరును వినియేయున్నారు. బాగుగ చర్చగూడ జరిగినది. ఇక ఈతీర్మానమును తమయంగీకారమునకై సమర్పించెద. ఆమోదించువారందరును చేతులెత్తప్రార్థితులు.

("అందరు, అందరు"అను కేకలు: అందరు చేమెత్తుదురు.)

అ— వ్యతిరేకు లెవరును లేరా?

(లేరు లేరు)

అట్లయిన తీర్మానమందరిచే నేకగ్రీవముగా నామోదింపబడినది.

(కరతాళములు. విపరీతముగా జేయ్ శబ్దములు)

నేటిసభాకార్యక్రమ మంతయు ముగిసినది. ముఖ్యమైన తీర్మానములన్నియు నంగీకరింపబడినవి. తదితర చిల్లర తీర్మానములిదివరకే యంగీకరింపబడినవి ఇక చిట్టచివరయంశము, శ్రీమతి సరళాదేవిగారు ప్రబోధము గావింతురు.

సర—మహాజనులారా, సోదర సోదరీమణులార, తీర్మానమేకగ్రీవముగా నంగీకరింపబడుటచే మన మందరము పరమానందము నొందుచున్నాము. ఇక మనము జయాపజయంబుల విషయమై భయపడ నక్కరలేదు. మనమిప్పుడు మహాసంగ్రామమునందు ప్రవేశించినాము. ఈసంగ్రామమున

గీతమాలిక.

ధర్మమే రథముమన యుద్ధమున నేడు
ధర్మమూర్తియే సారథి ధరణి మనకు,
దేశసేవకెల్ల త్యజించి దేనికైన
సిద్ధమగువాడె యుద్ధసంసిద్ధుడిపుడు,
శాంతమే దివ్య శస్త్రాస్త్ర సాధనములు,
ఆత్మపారిశుధ్యమె స్వరాజ్యంబుమనకు
మనస్వశక్తిని నమ్ముటే మనకుదారి,
బానిసత్వవిముక్తియే వరజయంబు
మనసు మనమెరుంగుటె గొప్పఘనతమనకు॥

ఇట్లు సక్రమముగా వర్తింతుమేని,—

చ॥ జయమగు భారతాంబ, కనిశంబు జయంబు తిలక్ మహాత్మకున్
జయమగు గాంధిమహానికిన్ని, సద్యశుడౌ నరవింద ఘోషుకున్
జయమగు, లాలుపాలులకు సంతతదిగ్విజయంబు, దాసుకున్
జయమగు, నూతనోద్యమము చక్కగ దిగ్విజయంబుగాంచెడిన్।

ఉ॥ శాంతరసామృతంబు ధరజల్లినమాడ్కి సుఖంబుగల్గెడిన్

వంతలుదీరి భూజనులు స్వచ్ఛమనస్కులుగా మెలంగెడిన్
సుంతయు బానిసత్వమిల చూపుటకేనియు లేకచచ్చెడిన్
సంతత వైభవోన్నతుల క్ష్మాతలమెల్ల సుఖించుచుండెడిన్।

అ—ఆర్యులారా, నేను అపరిమితానందముతోడను, జయజయధ్వానములతోడను భారతీయ నూతన తేజోలక్ష్మీ ప్రసన్నముగా వెలయు నీ మహాసభను ముగించుచున్నాను. ఇట్టి తరుణమున ఒక్కసారి మాతృభూమికి మంగళపుష్పములజల్లి మనమింక కర్తవ్యమునకు గడంగుదుము.

మంగళము.

ఇంగ్లీషు నోటు

శ్రీలతల్లి భవతు మంగళం। సురత్నగర్భమాతృభూమి భవతు।
హిం—దూ—మా—తా
ధీరమహా—పూరుషులా—ధారులు—నీపై
ధీరా—శూరా—వీరా—ఈ
కాలహరణ—మేలకరుణ—నేలుతరుణ—మో
ధరణీ—తరుణీ—వరనారీ
శ్రీ భారతి, మాభాగ్యమ—యీభూమిమణీ—సురనదిధర—వరగిరి
భర—ధరసురధర]
హిం—దూ—మా—తా
శ్రీ భక్తిమార్గదర్శిని. దివ్యముక్తిదాయకి ధరిత్రి॥ శ్రీల
సత్వరస్వరాజ్యప్రాప్తిరస్తు
సర్వేజనాః సుఖినోభవంతు

ఇది, శ్రీవత్సగోత్రపవిత్ర దామరాడ్వంశ గోపాలకృష్ణరంగమాంబా జ్యేష్ఠపుత్రి పుండరీకాక్ష.నామధేయ ప్రణీతంబగు "శ్రీ గాంధి విజయము" అనునాటకమునందు సర్వము

సంపూర్ణము.



# పాంచాలపరాభవము.

ఇది ఐదంకముల నాటకము

ఇందు పంజాబుహత్యలు జరిగినవి జరిగినట్లు విపులముగా సులభశైలిలో రమ్యముగ వర్ణింపబడినవి. ఇందు డయరాసుల పరిపాలనమును; పాంచాలమాత వస్త్రాపహరణము, శ్రీ కృష్ణుని జన్మస్థాన వర్ణనమును, అమృతసర కాంగ్రెసు మహాసభయున్ను మొదలైనరంగములు చూచియు చదివియు తీరవలయును.

మంచికాగితము చక్కని గట్టిఅట్ట 100 పేజీలు,

చిల్లర—వెల 0—12—0

కమీషన్ 1 డజన్ ప్రతులు 7—0—0

[ 25 ప్రతులుకు పైన] 100 కి 55—0—0

---

# గాంధిమహోదయము.

లేక

# నవయుగారంభము.

ఇందు జగచ్ఛాసనసభ, అనగా, పరమేశ్వరుని లోకపరిపాలనా విధానము, వివిధావతారములు రాముడు, కృష్ణుడు, మహమ్మదు, క్రీస్తు, తిలక్ మున్నగువారు దేవునినడుగు ప్రశ్నలు,—తిలకుమరణము తిలకు స్వర్గారోహణ సమయము శ్రీవిష్ణు భరతమాతల సంవాదము—గాంధిమహోదయము, అనగా, గాంధి మహాత్ముని యుగారంభము మున్నగునవి చదివి తీరవలయును.

వెల 1 కి రు 0—8—0

డజను 1 కి రు 4—8—0

[ 25 కు పైన] 100 కి రు 84—0—0

---

## గుంటూరి గొప్ప

చిన్న జంగంకథ పొ'స్తరు. గుంటూరు మండల రాజకీయచారిత్ర, అనగా చీరాల, పేరాల విషయము, రేపల్లెవిషయము, పల్నాడు అల్లరులు, గుంటూరు దురంతములు మున్నగునవి విపులముగా తేటపదములతో వర్ణింపబడినవి. గుంటూరి నాయకుల పై చక్కని పద్యములును గలవు.

వెల 1 కి 0—8—0

100 కి రు 12—0—0 డజన్ 1 కి 1—11—0

---

## కలియుగప్రహ్లాద.

[హరికథ]—చక్కని పద్యములు—సొగసైనమట్లు-సత్యాగ్రహవ్రతము పంజాబు దురంతములు తిలక్ మరణము గాంధియుగారంభము కలకత్తానాగపుర మహాసభలు ఓట్లహాస్యము బెజవాడ సమావేశము, మలబారు మొదలైన అల్లరులు ఆలీసోదరుల నిర్బంధము, మహాత్ముని చెన్నరాష్ట్ర సంచారము వరకు సులభశైలిలో వర్ణింపబడినవి.

వెల 1 కి 0—10—0

1 డజన్ 6—0—0

100 కి 45—0—0

---

## సంస్కారిణి.

(అయిదంకముల నాటకము.)

సాంఘిక విషయములు, అనగా హిందూమహమ్మదీయ క్రైస్తవమతములు, బ్రాహ్మణ బ్రాహ్మణేతర కులవిచక్షణ, పంచముల విషయము తాగుడు వగయిరా వర్ణింపబడినవి. [త్వరలో వెలువడును.]

---

NATIONAL ARCHIVES OF INDIA

# స్వరాజ్యసోపానపంక్తిప్రచురములు

ఇవి యీ స్వరాజ్య సంవత్సరమునందు సుమారు మాసమున కొకటి చొప్పున వెలువడుచుండును. ఇప్పటికి 5 గ్రంథములు వెలువడినవి. ఈగ్రంథములను ప్రతిమాసము తెప్పించుకొను వారికి చాల పోస్టుఖర్చులు తగులునని సంవత్సరచందాగా రు 5—0—0 నియమించినాము. ఈడబ్బుముందు కట్టినవారికి వి. పి. ఖర్చులతో పనిలేకుండా ప్రతినెలకు 1 పుస్తకము పంపబడును. ఎప్పుడు చేరినను వెనుకటి గ్రంథములు గూడ పంపబడును. చందాముందే చెల్లించవలయును, పోషకులుగా నుండగోరు వారికి చందా రు 10—0—0లు. వారికి మంచిగ్లేజు పుస్తకములు పంపబడి వారి నామములు ప్రతి పొత్తమునందును పేర్కొనబడును.

ఇట్లు విన్నవించు,
గ్రంథకర్త.